సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 237
శుక్రవారం 18-11-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



గగనాన్ని జయించింది
స్కై డైవింగ్ చేసిన తొలి సైనికురాలిగా లాన్స్ నాయక్ మంజు రికార్డు - 11లో



ఇక ద్వైపాక్షిక సిరీస్ సమయం
భారత్, కివీస్‌ల తొలి టి20 నేడు.. శుభారంభంపై ఇరుజట్ల దృష్టి - 13లో




బ్రిటిషర్లకు సావర్కర్ వత్తాసు
బ్రిటిష్ వలస పాలకులకు వీడీ సావర్కర్ వంతపాడారని, జైల్లో ఉండగా క్షమాభిక్ష కోరారని రాహుల్ మరోసారి ఆరోపించారు.
వివరాలు 6లో



ఈడీ ముందుకు సోరెన్
అక్రమ గనుల తవ్వకం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్ఖండ్ సీఎం సోరెన్ ఎట్టకేలకు ఈడీ విచారణకు హాజరయ్యారు.
వివరాలు 6లో



రిపబ్లికన్లదే పైచేయి
అమెరికా మధ్యంతర ఎన్నికల్లో.. 435 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ పైచేయి సాధించింది.
వివరాలు 6లో



నితిన్ గడ్కరీకి స్వల్ప అస్వస్థత
సిలిగురి ప్రాంతంలో రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నితిన్ గడ్కరీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు.
వివరాలు 6లో

'ఉన్నత' ఉత్సాహం

రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ఉన్నత చదువులకు విద్యార్థుల మొగ్గు

ఇంటర్ తర్వాత చదువుల కోసం 93.38% మంది అడ్మిషన్లు

- జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనల ఫలితం
- ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరిన వారు 35.50 శాతం
- డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు 43.79 శాతం.. 11.13 శాతం మంది అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ కోర్సుల్లోకి
- ఉన్నత విద్యకు ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు 2.96 శాతమే
- భారీగా తగ్గిన డ్రాపౌట్స్.. కరోనాలోనూ పెరిగిన చేరికలు



సాక్షి, అమరావతి: ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రవేశాలు పెరుగుతున్నాయి. ఇంటర్ ఉత్తీర్ణుల్లో ఈ ఏడాది రికార్డు స్థాయిలో 93.38 శాతం మంది ఉన్నత విద్యా కోర్సుల్లో చేరడం గమనార్హం. ఇది దేశంలోనే కొత్త రికార్డు సృష్టించింది. జాతీయ సగటుకు మించి ఏపీలో గరిష్ట చేరికల నిష్పత్తి నమోదవుతోంది. ఏ రాష్ట్రంతో పోల్చినా ఆంధ్రప్రదేశ్ విద్యా రంగంలో మూడున్నరేళ్లలో గణనీయమైన పురోగతి సాధించింది. టీడీపీ హయాంలో 2018–19లో 20.37 శాతం మంది విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరలేక డ్రాపౌట్లుగా మిగలగా ప్రస్తుతం 6.62 శాతానికి తగ్గిపోవడం గమనార్హం. గత సర్కారు అరకొర ఫీజులనూ ఇవ్వకుండా రూ.1,800 కోట్లకు పైగా బకాయిలు పెట్టి దిగిపోగా వాటిని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించి విద్యార్థుల చదువులకు అండగా నిలిచింది. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థీ ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో పాటు అకడమిక్ అంశాలు, నైపుణ్యాభివృద్ధి కోసం చేపట్టిన సంస్కరణల వల్లే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయనేది కాదనలేని నిజం. విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తూ సదుపాయాలు మెరుగు పరుస్తుండడం, వివిధ పథకాలతో

మిగతా 2వ పేజీలో ▶

'ఆక్వా' సంక్షోభం తాత్కాలికమే

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రొయ్యల కొనుగోలు

100 కౌంట్ రూ.210, 30 కౌంట్ రూ.380 చెల్లిస్తాం

- ఇది అంతర్జాతీయ సంక్షోభమే
- మరో రెండు నెలల్లో సాధారణ పరిస్థితులు.. పన్నుల పేరుతో కొందరు బురదజల్లుతున్నారు
- రైతులతో రాజకీయం చెయ్యొద్దని హితవు
- సీఫుడ్స్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతల వెల్లడి
- రాజమహేంద్రవరంలో రైతులు, ఎగుమతిదారులతో సమావేశం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీద మస్తాన్‌రావు, అసోసియేషన్ నాయకులు

సాక్షి, రాజమహేంద్రవరం: 'ఆక్వా సంక్షోభం అంతర్జాతీయ స్థాయిలో ఏర్పడిందని.. మరో రెండు నెలల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని.. సంక్షోభం నుంచి రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు రొయ్యలు కొనుగోలు చేస్తామని సీఫుడ్స్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు అల్లూరి ఇంద్రకుమార్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావ్, అసోసియేషన్ నేతలు వెల్లడించారు. రాజమహేంద్రవరంలో గురువారం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాలకు చెందిన రైతులు, ఎగుమతిదారుల సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఫలితంగా యూరోపియన్, చైనాల జీరో కోవిడ్ పాలసీ అమలు, అమెరికాలో వనామీ రొయ్యల నిల్వలు పెరిగిపోవడం లాంటి పరిణామాలతో ఆక్వా రంగం గత మూడు నెలలుగా సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో విదేశాల్లో పండుగలు ఉన్నాయని.. అక్కడ నిల్వ ఉన్న సరుకుతోపాటు దేశంలో ఎగుమతిదారుల వద్ద ఉన్న సరుకు అమ్ముడుపోతుందని, ఫలితంగా భారత్‌లో తిరిగి రొయ్యల ఎగుమతులు

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

సచివాలయాలు భేష్



రాష్ట్రంలో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల పనితీరు బాగుందని న్యూఢిల్లీలోని ఐఐపీఏ బృందం కితాబిచ్చింది. ఈ బృందం గురువారం విశాఖ జిల్లా భీమిలి మండలంలో పర్యటించింది. కేంద్ర, రాష్ట్ర పథకాలపై ప్రజలు, అధికారులతో మాట్లాడింది.
వివరాలు 2లో ▸

ఆడియో వ్యవహారంలో యూట్యూబర్లకు నోటీసులు



భీమిలి ఎమ్మెల్యే, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరువుకు భంగం కలిగించేలా ఆడియోను ప్రసారం చేసిన యూట్యూబ్ చానళ్లపై విశాఖ నగర సైబర్ క్రైమ్ విభాగం దర్యాప్తు వేగవంతం చేసింది.
వివరాలు 10లో ▸

డిసెంబర్ 17న ఏయూకు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి



డిసెంబర్ 17వ తేదీన నిర్వహించే ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి హాజరవుతారని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తెలిపారు.
వివరాలు 14లో ▸

తప్పు చేయకపోతే భయం ఎందుకు?



ఎలాంటి తప్పూ చేయకుండా ఉన్నప్పుడు సిట్ దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారని టీడీపీ నేత వర్ల రామయ్య తరపు న్యాయవాదిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అవినీతి దురుద్దేశం ఉన్నప్పుడు ఎందుకు విచారించకూడదని ప్రశ్నించింది.
వివరాలు 14లో ▸

గౌరవ సభ కాదు కౌరవ సభ.. అసెంబ్లీ

మళ్లీ క్షేత్రస్థాయిలో గెలిచి అసెంబ్లీలో అడుగు పెడతా



- మేం వస్తే మరింత మెరుగైన సంక్షేమం
- ఆదోని, ఎమ్మిగనూరు బహిరంగ సభల్లో చంద్రబాబు
- సీఎం జగన్‌పై బూతు పురాణం
- సీఎంఓలో అవినీతి పెరిగిపోయింది
- విశాఖలో మెడపై కత్తి పెట్టి ఆస్తులు రాయించుకుంటున్నారు
- మూడు రాజధానులతో ఏపీని సౌతాఫ్రికా మాదిరిగా మారుస్తారా?

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర అసెంబ్లీ గౌరవ సభ కాదని.. కౌరవ సభ అని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో గెలిపించకపోతే అవే తన చివరి ఎన్నికలని.. తనను గౌరవ సభకు పంపుతారా, కౌరవ సభకు పంపుతారా అన్నది మీ చేతుల్లోనే ఉందని ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో గెలిచిన తరువాతే మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతానని స్పష్టంచేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇప్పటికంటే మెరుగ్గా సంక్షేమ పథకాలను అమలుచేస్తామన్నారు. కేసుల విషయాన్ని ప్రస్తావిస్తూ సీఎం జగన్‌ను 'ఎవడ్రా నువ్వు..' అంటూ సంబోధించారు. మూడ్రోజుల కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా

మిగతా 3వ పేజీలో ▶

బతుకులు కూల్చడం బాబుకు అలవాటే
- ఎన్టీఆర్, హరికృష్ణ ఉదంతాలే ఉదాహరణ
- ఆర్థిక మంత్రి బుగ్గన

2లో

ఇవే ఆఖరు ఎన్నికలని బాబుకు తెలిసొచ్చింది
- మనుగడ కోసమే సానుభూతి డ్రామాలు
- మాజీ మంత్రి కన్నబాబు

3లో

చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరివి
- అవి టీడీపీకి సమాధి కట్టే ఎన్నికలు
- మంత్రి అప్పలరాజు

3లో

బయటపడిన మార్గదర్శి మోసాలు

చర్యలు తీసుకోవాలని చిట్స్ డిప్యూటీ రిజిస్ట్రార్లకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీలో మోసాలు బట్టబయలయ్యాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) బృందాలు మూడు రోజుల పాటు చేసిన తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణయ్యాయి. రాష్ట్రంలోని పలు చిట్‌ఫండ్ కంపెనీల్లో అధికారులు మూడు విడతలుగా తనిఖీలు చేశారు. మూడో విడతలో మార్గదర్శి సంస్థల్లో మూడురోజులు తనిఖీలు నిర్వహించారు. 1982 చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా ఉన్న రికార్డులు, మెటీరియల్‌ను అధికారులు సీజ్ చేశారు. చిట్ల రూపంలో కట్టిన నిధులను మళ్లించడం, జీఎస్టీ ఎగవేయడం, కంపెనీ పాడిన చిట్‌లకు గ్యారెంటీ చూపకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. గురువారం నిర్వహించిన తనిఖీల్లో వాటిపై పూర్తి ఆధారాలను సేకరించారు. ఈ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల చిట్స్ డిప్యూటీ రిజిస్ట్రార్లను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ అండ్ కమిషనర్ రామకృష్ణ ఆదేశించారు. కాగా తనిఖీల సందర్భంగా మార్గదర్శి అన్ని బ్రాంచీలలోనూ తమ గ్రూపు సంస్థలకు చెందిన మీడియా ప్రతినిధులను మోహరించారు. సాధారణంగా ఇలా దాడులు జరిగే సమయంలో అధికారులే వీడియో సాక్ష్యాలను చిత్రీకరిస్తుంటారు. కానీ మార్గదర్శి బ్రాంచీలలో ఈ మీడియా ప్రతినిధులు కూడా వీడియోలు తీస్తూ అధికారులను బెదిరించే ధోరణిలో హల్‌చల్ చేసినట్లు తెలిసింది. అంతే కాదు తనిఖీల సందర్భంగా జరిపే పంచనామా పత్రాలపై సంతకాలు చేయడానికి కూడా మార్గదర్శి సిబ్బంది నిరాకరించారని అధికారులు తెలిపారు. పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకే వారు అలా సంతకాలకు నిరాకరించి ఉంటారని, తమకు తెలియకుండానే పంచనామా తతంగాన్ని పూర్తి చేశారని ఆరోపించేందుకే అలా చేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు.



విశాఖ, విజయవాడలో 'నిక్సీ' కేంద్రాలు

ఇకపై రాష్ట్రంలో ఇంటర్నెట్ దూకుడు

- రాష్ట్రంలో పెరుగుతున్న ఇంటర్నెట్ వినియోగం నేపథ్యంలో అంతరాయ సమస్యలను అధిగమించేందుకు ఎక్స్ఛేంజీలను విశాఖతో పాటు విజయవాడలోనూ ఏర్పాటు చేయాలని నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (నిక్సీ) నిర్ణయించింది. ఇంటర్నెట్ సేవలందించే సర్వీస్ ప్రొవైడర్లు ఎక్కువగా ముంబై, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో ఉన్నాయి. విశాఖ, విజయవాడ కేంద్రంగా నిక్సీ కేంద్రాలు ఏర్పాటైతే ఐటీ పరిశ్రమలు తమ ఉత్పత్తుల దూకుడు పెంచేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి.

- వివరాలు 2లో

ఇదండీ జగత్



అంధకారంలో టీడీపీ భవిష్యత్

- అందుకే చంద్రబాబులో అభద్రతా భావం
- బీజేపీ–జనసేనే భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయం
- బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు
- పవన్ మాతోనే ఉంటాడు.. ఉండాలి: సోము వీర్రాజు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ రాజకీయ భవిష్యత్తు అంధకారంలో ఉందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. అందుకే చంద్రబాబు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని చెప్పారు. గురువారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. జనసేన, బీజేపీతోనే కొనసాగుతుందని క్లారిటీ రావడంతో చంద్రబాబు నిరాశ, భయంతో వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. 'తాను తప్ప వేరే ప్రత్యామ్నాయం లేకుండా చేస్తే, తన సినిమానే ఆడుతుందని చంద్రబాబు భావించాడు. ఇతరులు రంగంలో లేకుండా టీడీపీతో కలుపుకోవాలని ఆలోచించాడు. అది ఫలించ లేదు. అలా వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు వేసిన పాచిక పారలేదు. కచ్చితంగా భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ–జనసేన ఎదుగుతుంది' అని

మిగతా 3వ పేజీలో ▶



విక్రమ్–ఎస్ ప్రయోగం నేడే

- దేశీయంగా ప్రైవేట్‌రంగంలో రూపొందించిన విక్రమ్–ఎస్ రాకెట్‌ను శుక్రవారం ఉదయం 11.30లకు తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్)నుంచి ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ మూడు అతి చిన్న పేలోడ్స్‌ను స్పేస్‌లోకి తీసుకెళ్లనుంది. ఈ పేలోడ్స్ భూమికి అతి తక్కువ దూరం అంటే 100 నుంచి 120 కిలోమీటర్ల ఎత్తులోని సబ్ ఆర్బిటల్‌లో వుండి వాతావరణాన్ని అధ్యయనం చేస్తాయి.

6 లో

నార్కో పరీక్షలకు కోర్టు అనుమతి

ఢిల్లీ హత్య కేసులో అఫ్తాబ్‌కు అయిదు రోజుల కస్టడీ పొడిగింపు

- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రద్ధవాకర్ హత్య కేసులో నిందితుడైన అఫ్తాబ్ అమీన్ పూనావాలాకు నార్కో పరీక్షలు నిర్వహించడానికి గురువారం ఢిల్లీ కోర్టు అనుమతిచ్చింది. ఇందుకోసం మరో అయిదు రోజులు పోలీసు కస్టడీని పొడిగించింది. అఫ్తాబ్ విచారణ జరిగినప్పుడు కోర్టు వెలుపల భారీ సంఖ్యలో నిరసనకారులు చేరుకొని వెంటనే అతనిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. పోలీసుల విచారణలో అఫ్తాబ్ అమీన్ ఒళ్లు జలదరించే విషయాలు బయటపెడుతున్నాడు. ఆమె ముఖం ఎవరూ గుర్తు పట్టకుండా కాల్చినట్టుగా పోలీసుల ఎదుట అంగీకరించాడు.



- వివరాలు 6లో

క్లుప్తంగా

24న కృష్ణా బోర్డు ఆర్‌ఎంసీ భేటీ

- ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ నియమావళి రూపకల్పనే అజెండా



సాక్షి, అమరావతి: కృష్ణా బోర్డు రిజర్వాయర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఆర్‌ఎంసీ) సమావేశం ఈ నెల 24న హైదరాబాద్‌లో జరగనుంది. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నిర్వహణ నియమావళిని రూపొందించడమే అజెండాగా ఈ సమావేశం ఉంటుంది. ఇప్పటికే ఆర్‌ఎంసీ నాలుగుసార్లు సమావేశమై శ్రీశైలం, సాగర్ నిర్వహణపై సమగ్రంగా చర్చించింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల కింద ఏ కాలువకు ఎప్పుడు నీరు విడుదల చేయాలి, విద్యుత్ ఉత్పత్తిని ఎలా చేయాలి, మళ్లించిన వరద జలాలను లెక్కలోకి తీసుకోవాలా... వద్దా... అనే అంశాలపై ముసాయిదాను రూపొందించింది. ఈ ముసాయిదాను 24న జరిగే భేటీలో చర్చించి, ఆమోదించనుంది. ఆ తర్వాత కృష్ణా బోర్డుకు ముసాయిదా నివేదిక సమర్పించనుంది. కృష్ణా బోర్డు సర్వసభ్య సమావేశంలో ఈ ముసాయిదాను చర్చించి, రెండు రాష్ట్రాల అభిప్రాయాల మేరకు దానిలో మార్పులు, చేర్పులు చేసి నిర్వహణ నియమావళిని ఖరారు చేస్తారు. ఈ నియమావళి ఆధారంగా ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించడం ద్వారా రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు చరమగీతం పాడాలనేది బోర్డు లక్ష్యం.

మహిళా, శిశు సంక్షేమ ప్రభుత్వ సలహాదారుగా నారమల్లి పద్మజ



సాక్షి, అమరావతి: రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సలహాదారుగా నారమల్లి పద్మజను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన తొలి మహిళ కావడం గమనార్హం. పద్మజ నియామకం తక్షణం అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

వీసీపీటీఎల్ సరికొత్త రికార్డు



కంటైనర్ టెర్మినల్‌లో ఎంఎస్ నెయ్యార్ షిప్

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ లిమిటెడ్ (వీసీటీపీఎల్) సరికొత్త రికార్డుని అధిగమించింది. షిప్ మూమెంట్, బెర్త్ మూమెంట్‌ల్లో తన రికార్డుని తానే తిరగరాసింది. ఈ నెల 16న బెర్త్ చేసిన ఎంవీ ఎస్ఎమ్ నెయ్యార్ నౌకలో షిప్‌మూవ్స్ పెర్ అవర్ (ఎస్ఎంపీహెచ్) అత్యధికంగా 128.62, బెర్త్ మూవ్స్ పెర్ అవర్ (బీఎంపీహెచ్) 119.54 గా నమోదు చేసింది. గతంలో టర్మినల్ పేరుతో ఎస్ఎంపీహెచ్ 122.0, బీఎంపీహెచ్ 115.5 గా ఉన్న రికార్డుని వీసీటీపీఎల్ అధిగమించిందని విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు.

మన్యంలో చలి విజృంభణ



అరకులోయలో దట్టంగా పొగమంచు

సాక్షి, పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా చలి గాలులు అధికమయ్యాయి. ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. బుధవారం అరకులోయ కేంద్ర కాఫీ బోర్డు వద్ద 9.8 డిగ్రీలు నెలకొనగా గురువారం ఉదయం 6.8 డిగ్రీలకు పడిపోవడంతో చలి అధికమైంది. ఒక్కరోజు వ్యవధిలోనే 3 డిగ్రీలు ఉష్ణోగ్రత తగ్గడంతో అరకు ప్రాంత వాసులు చలితో ఇబ్బందులు పడుతున్నారు. పొగ మంచు దట్టంగా కురవడంతో పాటు చలి పెరగడంతో స్థానికులు, పర్యాటకులు అవస్థలు పడ్డారు. ఉదయం 10 గంటల వరకు మంచు కమ్ముకుంది. అలాగే పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 10 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 10.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ప్రాంతాల్లో కూడా పొగ మంచు దట్టంగానే కురిసింది.

సచివాలయాలు భేష్

రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల పనితీరు బాగుంది



విశాఖ జిల్లా టి.నగరపాలెం సచివాలయ సిబ్బందితో కేంద్ర బృందం



దాకమర్రిలో జగనన్న పౌష్టికాహార కిట్లు గురించి వివరిస్తున్న అధికారులు

- 38 మంది సభ్యులున్న ఐఐపీఏ బృందం ప్రశంస
- భీమిలి మండలంలో పర్యటించిన బృందం.. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ఆరా

తగరపువలస (భీమిలి): రాష్ట్రంలో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల పనితీరు బాగుందని న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ) బృందం కితాబిచ్చింది. అడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ ప్రోగ్రాం ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఏపీపీపీఏ) 48వ విజిట్‌లో భాగంగా 38 మంది సభ్యులున్న ఈ బృందం గురువారం విశాఖ జిల్లా భీమిలి మండలంలో పర్యటించింది. రెండురోజుల పర్యటనలో భాగంగా మొదటిరోజు వీరు రెండు బృందాలుగా విడిపోయి టి.నగరపాలెం, దాకమర్రి పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు, అధికారులతో మాట్లాడారు. ఏడు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, మిషన్ అంత్యోదయ, పీఎంఏవై, ఎస్‌బీఎం, ఎన్‌ఆర్‌బీఎం, ఎస్‌ఎస్‌ఏ అమలు తీరుపై లబ్ధిదారులతో విడివిడిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీశారు. స్థానిక పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల ఆరోగ్యం గురించి వారితో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. పుస్తకాలు, యూనిఫాం పరిశీలించారు. గణితంలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ మంచి ఆలోచన

గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ విభాగాల కార్యదర్శులను పిలిచి వారి బాధ్యతల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల పనితీరు బాగుందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ మంచి ఆలోచనని చెప్పారు. రెండు వారాలకు ఒకసారి ఫ్యామిలీ ఫిజీషియన్ సందర్శించడం బాగుందన్నారు. సామాజిక పింఛన్లు డీఎం అండ్ హెచ్‌వో పెన్షన్ల పంపిణీపై సంతృప్తి వ్యక్తం చేశారు. పీఎంఏవై హౌసింగ్ పథకాన్ని లబ్ధిదారులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో పంచాయతీల వారీగా మృతులు, వ్యాక్సినేషన్, తీసుకున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీల్లో అమలవుతున్న ఆహారం, పౌష్టికాహార కిట్ల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ఇంకా మెరుగుపడాలని పేర్కొన్నారు.

బృందంలో అధికారులు, త్రివిధదళాల ఉద్యోగులు

బృందంలో కేంద్రంలోని వివిధ శాఖల అధికారులు, త్రివిధదళాల ఉద్యోగులు ఉన్నారు. ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, భీమిలి ఎంపీపీ దంతులూరి వెంకటశివసూర్యనారాయణరాజు, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీడీవో ఎం.వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, సర్పంచ్‌లు పొట్నూరు ఛాయాగౌతమి, చెల్లూరు పైడప్పడు, ఎంపీటీసీ సభ్యులు పల్లా నీలిమ, చెల్లూరు నగేష్, పీహెచ్‌సీ వైద్యుడు ఎ.బి.మల్లికార్జునరావు, కార్యదర్శులు రఘునాథరావు, శంకర్ జగన్నాథ్, లోకేశ్వరి, తెలుగు అనువాదకుడు టి.ఎస్.వి.ప్రసాదరావు ఈ బృందానికి, ప్రజలకు సంధానకర్తలుగా వ్యవహరించారు.

'ఆక్వా' సంక్షోభం తాత్కాలికమే

▶ మొదటి పేజీ తరువాయి

పుంజుకుంటాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు 100 కౌంట్ రూ.210, 30 కౌంట్ రూ.380కి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిరోజూ ధరల్లో మార్పులేకుండా 10–20 రోజుల పాటు నిర్ణీత ధర ఇచ్చేందుకు అంగీకరించారు. సంక్షోభంలో ఉన్న రైతులను ఆదుకోవాల్సింది పోయి.. కొంతమంది జె-ట్యాక్స్, ఆ ట్యాక్స్, ఈ ట్యాక్స్ అంటూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. వ్యవసాయం తర్వాత అత్యధిక సాగులో ఉన్న ఆక్వా రంగంపై లేనిపోని ఆరోపణలుచేసి రైతులతో రాజకీయం చెయ్యొద్దని వారు విజ్ఞప్తి చేశారు.

క్రాప్ హాలిడే ఆలోచనే లేదు:

ఆక్వా రంగం సంక్షోభాలు రైతులకు కొత్తేమీకాదన్నారు. టైగర్ రొయ్య సాగులో నష్టాలు చూశారన్నారు. ప్రస్తుతం వనామీలో సంక్షోభం తాత్కాలికమేనని వారు స్పష్టంచేశారు. రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తారన్న ఆరోపణలను వారు ఖండించారు. అలాంటి ఆలోచన రైతులకు లేదన్నారు. కేవలం గిట్టుబాటు ధర కావాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అందుకనుగుణంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులు, ఎగుమతిదారులను సంప్రదిస్తూ సూచనలు చేస్తోందన్నారు. ఇందుకుగాను ఒక కమిటీ వేసి మరీ పర్యవేక్షిస్తోందని గుర్తుచేశారు. రైతుల సమస్యలపై సంప్రదించేందుకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటుచేస్తామన్నారు.

రైతులకు సూచనలు..

ఆక్వా రంగంలో నష్టాల నుంచి గట్టెక్కాలంటే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై వక్తలు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అవి..

- అందరూ ఒకేసారి పంట వేసి ఇబ్బందులు పడకుండా క్రాప్ రొటేషన్ పద్ధతి పాటించాలి.
- ఎగుమతులకు ఇబ్బందికరంగా మారిన 100 కౌంట్ రొయ్యల సాగుకు స్వస్తిపలికి 70, 80, 30 కౌంట్ రొయ్యలపై దృష్టిపెట్టాలి.
- చెరువుల్లో తక్కువ స్థాయిలో సీడ్ వేసి ఎక్కువ కౌంట్ సాధించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి.
- దేశంలో 8 లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతుంటే ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే 5 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది.
- ఇందులో సింహభాగం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచే ఉంటోంది.



పెద్ద రైతులకూ విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి



ప్రభుత్వం చిన్న రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇస్తోంది. వాటిని పెద్ద రైతులకూ అమలుచేయాలి. మేతల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. నాణ్యమైన సీడ్, మేత లభించకపోవడం ఓ కారణమైపోతోంది.

– రుద్రరాజు నానిరాజు, ఆక్వా రైతు, కోనసీమ

'ఉన్నత' ఉత్సాహం

▶ మొదటి పేజీ తరువాయి

అడుగడుగునా అండగా నిలుస్తుండటంతో చదువుల నాణ్యతలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

రాష్ట్రానికే ప్రాధాన్యం

బయట రాష్ట్రాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య గతంలో కన్నా తగ్గి రాష్ట్ర కాలేజీల్లో చేరికలు పెరిగాయి. 2022 – 23లో రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరిన వారు 35.50 శాతం ఉండగా డిగ్రీ కోర్సుల్లో 43.79 శాతం మంది చేరారు. 11.13 శాతం మంది అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నత విద్యలో చేరిన వారు 2.96 శాతం మంది ఉన్నారు. మరో 6.62 శాతం మంది మాత్రమే డ్రాపౌట్లుగా మిగిలారు. 2018–19లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారిలో 20.37 శాతం మంది డ్రాపౌట్లుగా మిగిలిపోగా ఈసారి అది 6.62 శాతానికి తగ్గిపోవడం గమనార్హం. 2018 – 19లో టీడీపీ అధికారంలో ఉండగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కాకుండా కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లించినందున మిగతా ఫీజుల భారాన్ని భరించలేక ఇంజనీరింగ్ కోర్సుల్లో 21.77 శాతం మంది మాత్రమే చేరారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తుండడంతో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరికలు అమాంతం 35.50 శాతానికి పెరగడం గమనార్హం.

నాడు.. ప్రైవేట్‌కే విద్య

టీడీపీ హయాంలో ఉన్నత విద్య మొత్తం ప్రైవేట్‌పరం కావడం విద్యార్థులకు శాపంగా పరిణమించింది. ఇంటర్ చదువులకే రూ.లక్షలు ధారపోయాల్సిన దుస్థితి నెలకొంది. తూతూ మంత్రంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలైంది. కాలేజీల్లో ఫీజు ఎంతున్నా ఇంజనీరింగ్‌కు రూ.35 వేలు, ఇతర డిగ్రీ కోర్సులకు రూ.7 వేల నుంచి రూ. 10 వేల లోపు మాత్రమే విదిలించి గత సర్కారు చేతులు దులుపుకొంది. అది కూడా అరకొరగానే ఇవ్వడంతో మిగతా ఫీజుల మొత్తాన్ని తల్లిదండ్రులే భరించాల్సి వచ్చేది. ఫలితంగా పిల్లల చదువులు పూర్తయ్యేసరికి అప్పుల్లో మునిగిపోయేవారు. ఇలాంటి పరిస్థితి కారణంగా ఎంతోమంది విద్యార్థులు ఇంటర్‌తోనే చదువు ముగించి చిన్నా చితకా ఉద్యోగాలు, కూలి పనుల అన్వేషణలో నిమగ్నమైన పరిస్థితి ఏర్పడింది.

నేడు.. సమూల మార్పులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత విద్యా రంగం పరిస్థితి సమూలంగా మారిపోయింది. పేద విద్యార్థుల చదువులకయ్యే ఫీజు మొత్తాన్ని జగనన్న విద్యా దీవెన ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తోంది. చదువులు సాఫీగా సాగేలా వసతి, భోజనాల కోసం ఏటా రూ.20 వేల వరకు చెల్లిస్తున్నారు. వీటిని నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉన్నత చదువులపై భరోసా ఏర్పడింది. ఫలితంగా డ్రాపౌట్లు గణనీయంగా తగ్గాయి. కరోనా ఉన్న రెండేళ్లలోనూ చేరికలు పెరగడం విశేషం.

2022-23లో ఉన్నత విద్య మొదటి ఏడాదిలో చేరికలు ఇలా

కేటగిరీ	సంఖ్య	శాతం
ఇంటర్మీడియెట్(పాస్)	3,37,987	--
ఇంజనీరింగ్	1,20,000	35.50
ఫార్మసీ	12,000	3.55
అగ్రికల్చర్	5,000	1.48
మెడికల్, నర్సింగ్	15,000	4.44
డిగ్రీ	1,48,000	43.79
ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ	5,600	1.66
ఇతర రాష్ట్రాల్లో చేరికలు	10,000	2.96
మొత్తం చేరికలు	3,15,600	93.38

'ఐష్' సర్వే ప్రకారం జీఈఆర్ గణాంకాలు

సంవత్సరం	దేశంలో	ఏపీ
2019-20	27.1	35.2
2018-19	26.3	32.4
2017-18	25.8	30.9
2016-17	25.2	32.4
2015-16	24.5	30.8



లక్ష ప్లేస్‌మెంట్స్ లక్ష్యం

- టీడీపీ హయాంలో 2015–16లో ఉన్నత విద్యా కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య 11,25,510 కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2021–22 నాటికి 14,23,952కి చేరుకుంది. చదువుల కోసం నయాపైసా భారం పడకుండా ప్రభుత్వమే మొత్తం ఫీజులను చెల్లిస్తుండటంతో ప్రవేశాలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి.
- అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) గణాంకాల ప్రకారం 2014–15లో రాష్ట్రంలో ప్లేస్‌మెంట్లు 56 వేలు కాగా 2021–22లో 78 వేలకు చేరాయి. ప్లేస్‌మెంట్స్‌ను లక్షకు పైగా తీసుకెళ్లటాన్ని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- జీఈఆర్ (ప్రతి వంద మందిలో కాలేజీల్లో చేరేవారి సంఖ్య)కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఏటా రాష్ట్రాల వారీగా ఆలిండియా ఉన్నత విద్యా సర్వే (ఐష్) పేరిట నివేదికలను వెలువరిస్తుంది. ఐష్ సర్వే ప్రకారం ఏపీలో జీఈఆర్ 2015–16లో 30.8 ఉండగా 2019–20లో 35.2కు పెరిగింది. జాతీయ స్థాయిలో 24.5 నుంచి 27.1కు పెరిగింది. జీఈఆర్ పెరుగుదల జాతీయ స్థాయిలో 3.04 శాతంగా ఉండగా ఏపీలో 8.64 శాతంగా ఉండడం విశేషం. కేరళ 4.86 శాతం, తమిళనాడు 4.89 శాతం, తెలంగాణ –1.65 శాతంగా ఉన్నాయి.

విశాఖ, విజయవాడలో

'నిక్సీ' కేంద్రాలు

- ఇక రాష్ట్రంలో ఇంటర్నెట్ దూకుడు.. ఇప్పటికే కనెక్టివిటీ పనుల కోసం టెండర్లు
- విశాఖలో ఇన్ఫోసిస్, విజయవాడలో యాక్సెంచర్ సంస్థల ఆసక్తి
- ఐటీ, పరిశ్రమల, వాణిజ్య సంస్థల కార్యకలాపాలు మరింత వేగం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశేష నగరంగా ప్రధాని ప్రశంసలందుకున్న విశాఖతో పాటు విజయవాడలోనూ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (నిక్సీ) నిర్ణయించింది. రాష్ట్రంలో పెరుగుతున్న ఇంటర్నెట్ వినియోగం నేపథ్యంలో అంతరాయ సమస్యలను అధిగమించేందుకు ఎక్స్ఛేంజీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. అయితే.. ఇంటర్నెట్ సేవలందించే సర్వీస్ ప్రొవైడర్లు ఎక్కువగా ముంబై, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో ఉన్నాయి. ఇకపై ఈ సమస్య ఉత్పన్నం కాకుండా విశాఖ, విజయవాడ కేంద్రంగా ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీ కార్యకలాపాలు మొదలుకానున్నాయి. నిక్సీ కేంద్రాలు ఏర్పాటైతే ఇంటర్నెట్ ఎకోసిస్టమ్ వృద్ధి చెంది.. ఐటీ పరిశ్రమలు తమ ఉత్పత్తుల దూకుడు పెంచేందుకు అవకాశాలూ మెరుగుపడనున్నాయి. ఇప్పటికే విశాఖలో ఇన్ఫోసిస్, విజయవాడలో యాక్సెంచర్ సంస్థలు కార్యకలాపాలను ప్రారంభించేందుకు ముందుకొచ్చాయి.

గతంలోనే పరిశీలన..

వాస్తవానికి విశాఖపట్నంలో నిక్సీ ఏర్పాటుపై గతంలోనే ఒకసారి ప్రయత్నాలు జరిగాయి. 2019 చివరి త్రైమాసికంలో నిక్సీ బృందం పలు దఫాలుగా విశాఖపట్నంలో పర్యటించింది కూడా. నిక్సీ ఢిల్లీ కేంద్రం టెక్నికల్ మేనేజర్ అభిషేక్ గౌతమ్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ నిఖిల్ విశాఖలోని ఐటీ పరిశ్రమల్ని ఇప్పటికే రెండు మూడు సార్లు సందర్శించి.. ఇక్కడ బ్రాంచ్ ఏర్పాటుకు గల అనుకూలతల్ని అడిగి తెలుసుకున్నారు. అయితే, తదనంతర కాలంలో కోవిడ్ పరిస్థితుల కారణంగా నిక్సీ కేంద్రం ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా ఏర్పాటు చేయనున్న నిక్సీ కేంద్రాల మధ్య కనెక్టివిటీ పెంచడం కోసం పాయింట్ టు పాయింట్ కనెక్టివిటీ కోసం చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే టెండర్లను కూడా నిక్సీ ఆహ్వానించింది. ఈ నెలాఖరులోగా ఈ టెండర్లను ఖరారు చేసి కనెక్టివిటీ పెంచిన తర్వాత కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఏమిటీ ఉపయోగం..

రోజురోజుకీ ఇంటర్నెట్ వినియోగం పెరుగుతోంది. ప్రతి చిన్న రోజువారీ అవసరాలకు ఇంటర్నెట్ తప్పనిసరిగా మారింది. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఇంటర్నెట్‌లో వేగం పెరగాల్సిన అవసరం కూడా ఉంది. ఎక్స్ఛేంజీ సేవలు రాష్ట్రంలో అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి డేటా కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీని కారణంగా ఆయా సంస్థలకు 40 శాతం అదనపు భారం పడుతోంది. నగర పరిధిలో ఏపీ ఈపీడీసీఎల్, జీవీఎంసీ, బ్యాంకులు, రైల్వే బుకింగ్ కేంద్రం, వివిధ పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య సంస్థలు.. మొదలైన సంస్థలు బల్క్ కేంద్రాలుగా ఇంటర్నెట్‌ని వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిక్సీ ఏర్పాటైతే.. తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందనున్నాయి.

బతుకులు కూల్చడం బాబుకు అలవాటే

- ఆర్థిక మంత్రి బుగ్గన ఎద్దేవా
- ఎన్టీఆర్, హరికృష్ణ ఉదంతాలే అందుకు ఉదాహరణ
- ఈ వయసులో ఓ వీధి రౌడీలా మాట్లాడారు.. పరిశ్రమలు, బడిపిల్లలపై పచ్చి అబద్ధాలాడారు
- కర్నూలుకు ఎన్నో వాగ్దానాలు చేసి ఏ ఒక్కటీ నెరవేర్చలేదు
- ఇప్పుడు హైకోర్టు రాకుండా అడ్డుకుంటూ అన్యాయం చేస్తున్నారు
- జిల్లా వాసులు సంస్కారవంతులు కావడంతో ఆయన్ను తిరగనిస్తున్నారు
- నేను అప్పుల మంత్రినైతే ఆయన్ను పాల నాయుడు, అబద్ధాల నాయుడని అనాలా?



సాక్షి, అమరావతి: ఎన్టీఆర్, హరికృష్ణ జీవితాలను కూల్చేసిన విపక్ష నేత చంద్రబాబుకు ఇళ్లు, జీవితాలను కూల్చేయడం అలవాటేనని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వ్యాఖ్యానించారు. కర్నూలు జిల్లా పర్యటనలో చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని, ఈ వయసులో ఓ వీధిరౌడీలా మాట్లాడారని మండిపడ్డారు. 73 ఏళ్ల వయస్సు, 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకునే చంద్రబాబు ఎన్నికల్లో గెలిస్తేనే రాజకీయాల్లో ఉంటాననడం ఆయన నిరాశ, నిస్పృహకు అద్దం పడుతోందన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తేనే రాజకీయాల్లో ఉంటానంటూ చంద్రబాబు ఎవరిని బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. ఏ రాజకీయ నాయకుడైనా తాను చేసింది చెప్పుకుంటూ భవిష్యత్తులో ఏం చేయనున్నారో ప్రజలకు వివరిస్తారని, చంద్రబాబు వైఖరి మాత్రం ప్రజలు తులసి తీర్థం పోస్తే బతుకుతా అనే మాదిరిగా ఉందని వ్యాఖ్యానించారు. గురువారం సచివాలయంలో బుగ్గన విలేకరులతో మాట్లాడారు.

స్కూళ్ల మూత బాబు పాలనలోనే..

రాష్ట్రంలో 6,000 పాఠశాలలను మూసి వేశారని, నాలుగు లక్షల మంది పిల్లలు బడి మానేశారంటూ చంద్రబాబు పచ్చి అబద్ధాలాడుతున్నారు. నిజానికి 2017లో చంద్రబాబు ప్రభుత్వమే 2,906 పాఠశాలలను మూసి వేసింది. ఈ ప్రభుత్వం ఒక్క పాఠశాలను కూడా మూసి వేయలేదు. చంద్రబాబు పాలనలో 37 లక్షల మంది మాత్రమే బడి పిల్లలు ఉండగా సీఎం జగన్ విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో విద్యార్థుల సంఖ్య 42 లక్షలకుపైగా పెరిగింది.

పెట్టుబడులు పెరిగాయ్..

పరిశ్రమల విషయంలోనూ చంద్రబాబు అసత్యాలు వల్లించారు. టీడీపీ హయాంలో ఏడాదికి సగటున పెద్ద పరిశ్రమల్లో రూ.11,994 కోట్లు పెట్టుబడులు వస్తే ఇప్పుడు సగటున రూ.13,200 కోట్లు పెట్టుబడులు వస్తున్నాయి. ఇవన్నీ డీపీఐఐటీ చెప్పిన గణాంకాలే.

డిస్టిలరీలకు గతంలోనే అనుమతులు..

రాష్ట్రంలో ఉన్న మద్యం డిస్టిలరీలన్నీ చంద్రబాబు హయాంలో ఇచ్చినవే. ఈ ప్రభుత్వం కొత్తగా అనుమతులు ఇవ్వలేదు.

పాల నాయుడా.. అబద్ధాల నాయుడా?

నన్ను అప్పుల మంత్రి అంటూ చంద్రబాబు విమర్శిస్తున్నారు. ఆర్థిక మంత్రులు ఎవరైనా అప్పులు చేస్తారు. ఏపీ డెయిరీని నిర్వీర్యం చేసి హెరిటేజ్ పెట్టి పాల వ్యాపారం చేసిన చంద్రబాబును పాల నాయుడు అని పిలవాలా? అప్పులపై అబద్ధాలు చెబుతున్నందుకు అబద్ధాల నాయుడని పిలవాలా? టీడీపీ హయాంలో ఆర్థిక మంత్రిగా ఉన్న యనమల సగటున ఏటా 20 శాతం మేర అప్పులు చేశారు. మరి ఆయన్ను పెద్ద అప్పుల మంత్రి అనాలా? ఈ ప్రభుత్వం సగటున ఏడాదికి 15 శాతమే అప్పులు చేసింది.

ముత్తాత కట్టిన ఇంట్లో ఉంటున్నా..

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి 60 అడుగుల రోడ్డు మధ్యలో గోడ కడితే కూల్చకుండా ఏం చేస్తారు? అది కూడా పద్ధతి ప్రకారమే నోటీసులు, ఉత్తర ప్రత్యుత్తరాల తరువాతే ఆక్రమణల తొలగింపు చేపట్టారు. రోడ్ల మధ్యలో గోడలు కట్టినా, ఆక్రమించినా ఏమీ చేయకూడదా? అందుకే నా ఇళ్లు, జీవితాన్ని కూల్చివేస్తానని చంద్రబాబు బెదిరిస్తారా? 1923లో మా ముత్తాత కట్టిన ఇంట్లో ఉంటున్నా. సొంతూరు, సొంత నియోజకవర్గంలోనే ఉంటా. చంద్రబాబుకు స్వగ్రామం నారావారి పల్లెలో ఇల్లు కూడా లేదు. ఏడాదికి ఒకసారి తల్లిని చూడటానికి వెళ్లి భారీ ప్రచారం చేసుకోవడం ఆయనకు అలవాటు. సెల్‌ఫోన్, కంప్యూటర్ తానే కనిపెట్టానంటూ మాట్లాడటాన్ని చూస్తుంటే వయసు మళ్లాక ఏదేదో ఆలోచనలు వస్తున్నట్లున్నాయి. రాజకీయాల్లో హుందాతనం ఉండాలి. నిజాలు మాట్లాడాలి.

పరిమితి దాటి గత సర్కారు అప్పులు

దేశంతో పాటు అన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు ఇబ్బందుల్లోనే ఉన్నాయి. కోవిడ్ వల్ల ఇబ్బందులు తలెత్తాయి. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం అనుమతికి మించి రూ.17 వేల కోట్లు ఎక్కువ అప్పులు చేసింది. ఆ అప్పులకుగానూ ఇప్పుడు రుణ పరిమితిలో కోతలు విధిస్తున్నారు. ఇది సరి కాదని కేంద్రానికి నివేదించాం.

బాబు.. జాబు ఉత్తదే

ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ నాడు చంద్రబాబు మోసగించగా ఈ ప్రభుత్వం వచ్చాక 2.10 లక్షల ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు మరో 10 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. గత సర్కారు హయాంలో మూడు నెలలు ఆర్నెల్లకు ఒకసారి వేతనాలు చెల్లించిన దుస్థితి నెలకొంది.

కర్నూలుకు అన్యాయం చేసి..

అధికారంలో ఉండగా కర్నూలు జిల్లాకు పలు వాగ్దానాలు చేసిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చకున్నా ప్రజలు సంస్కారంతో ఆయన్ను తిరగనిస్తున్నారు. హబ్‌లు, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, పర్యాటక పార్కులు, సోలార్ పవర్ అంటూ పలు వాగ్దానాలు చేసినా ఒక్కటీ నెరవేర్చలేదు. ఇప్పుడు కర్నూలుకు హైకోర్టు వద్దంటూ రాయలసీమకు అన్యాయం చేస్తున్నారు. విశాఖలో సచివాలయం వద్దంటూ ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తున్నారు. 8 రాష్ట్రాల్లో హైకోర్టులు వేరేచోట ఉన్నాయి. కర్నూలుకు హైకోర్టు రాకుండా చిత్తూరు జిల్లాకు చెందిన చంద్రబాబు అడ్డుపడటం సిగ్గుచేటు.

క్లుప్తంగా

గ్రామ సచివాలయ వ్యవస్థలో తొలి కారుణ్య నియామకం

కుప్పం మహిళకు కొత్త జీవితం



ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీషకు కృతజ్ఞతలు చెబుతున్న వసంతబాయి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: భర్తను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఇద్దరు బిడ్డలతో బతుకీడుస్తున్న ఓ అభాగ్యురాలికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కొత్త జీవితాన్ని ప్రసాదించింది. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పానికి చెందిన మహిళకు సచివాలయ వ్యవస్థలో మొట్టమొదటిసారిగా కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుపతి నగరం ముత్యాలరెడ్డిపల్లెలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గురువారం ఆ మహిళకు సచివాలయ అడ్మిన్ సెక్రటరీగా నియామక పత్రాన్ని అందించారు. వివరాల్లోకి వెళితే.. రామకుప్పానికి చెందిన మోహన్ అనే వ్యక్తి బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో తిరుపతి వచ్చి.. జీవకోన సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీగా ఉద్యోగం పొందాడు. మోహన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. అతని భార్య వసంతబాయి, ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి జీవకోన ప్రాంతంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించగా.. వసంతబాయి తన గోడు చెప్పుకుని కన్నీటి పర్యంతమైంది. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రీజనల్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వసంతబాయికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని కోరారు. సంబంధిత ఫైల్‌ను త్వరగా ఉన్నతాధికారులకు పంపించాలని మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలికి ఎమ్మెల్యే సూచించారు. యంత్రాంగం యుద్ధప్రాతిపదికన స్పందించి వసంతబాయిని తిరుపతి నగరంలోని సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సమస్య చెప్పిన 21రోజుల్లోనే తన భర్త ఉద్యోగాన్ని తనకు ఇప్పించిన ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి వసంతబాయి కృతజ్ఞతలు తెలిపింది.

ఈ జన్మకి మళ్లీ సీఎం కాలేవు చంద్రబాబూ!

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: కర్నూలు రోడ్ షోలో ప్రతిపక్ష నేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి మండిపడ్డారు. 'ఈ జన్మకి మళ్లీ ముఖ్యమంత్రివి కాలేవు చంద్రబాబు' అని తాడేపల్లిలో గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడుసార్లు సీఎంని చేస్తే ఏం పీకావ్ అని ప్రశ్నించారు. చివరి చాన్స్ ఇవ్వాలంటూ చంద్రబాబు మళ్లీ కొత్త బిచ్చగాడిలా జనం మీద పడ్డారన్నారు. కుల పిచ్చితో రాష్ట్రాన్ని మూడు దశాబ్దాలు సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. బెజవాడ ప్రజలు బండకేసి బాదినా బొండా ఉమా తీరుమారలేదన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత ఉమా తన ఇంటి ముందు బోండాల దుకాణం పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. రెండేళ్ల నుంచి ఆర్బీఐ అసలు రూ.2 వేలు నోట్లు ముద్రించ లేదన్న విషయం బొండా ఉమా మరిచారన్నారు.

22న స్టీల్‌ప్లాంట్ రక్షణకై నిరసనలు, దీక్షలు



ఐక్యత చాటుతున్న జేఏసీ నాయకులు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలంటూ విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తోన్న రిలే నిరసన దీక్షలు ఈ నెల 22 నాటికి 600 రోజులు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజున పెద్ద ఎత్తున నిరసనలు, దీక్షలు చేపట్టాలని అఖిల పక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం జగదాంబ జంక్షన్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన అఖిల పక్ష కార్మిక సంఘాల సమావేశంలో జేఏసీ ప్రతినిధులు మాట్లాడారు. ప్రధాని మోదీ విశాఖ ప్రజలకు తీవ్ర నిరాశే మిగిల్చారన్నారు. మోదీ స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 22న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలపుతామన్నారు. జేఏసీ చైర్మన్ ఎం జగన్నాయకుడు, వైస్ చైర్మన్ పడాల రమణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ నిజమే

- కామాక్షమ్మ సొంత ఇంట్లో ఉంటూ జెడ్పీ స్థలం ఆక్రమణ
- ఫిర్యాదులపై స్పందించిన అధికారులు
- ఆక్రమణ నిగ్గుతేల్చి కంచె ఏర్పాటు
- నెల తర్వాత ఆత్మహత్యాయత్నం..
- అప్పటికే గుండె సంబంధిత వ్యాధి
- చికిత్స అందిస్తుండగానే కోలుకోలేక మృతి
- ఫిర్యాదు చేసిన వారూ టీడీపీ సానుభూతిపరులే
- దీనిని రాజకీయం చేస్తోన్న టీడీపీ, పచ్చ పత్రికలు



జి.పి. ఫారం నెం.101
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - పంచాయతీరాజ్ శాఖ
ఇంటిపన్ను డిమాండు నోటీసు
2369 | గ్రామ పం: బలభద్రపురం
2369 | మండలము: బిక్కవోలు
10-84/1 | జిల్లా: తూర్పుగోదావరి
ఆర్థిక సం: 2022- 2023
శ్రీ / శ్రీమతి కోటిపల్లి కామాక్షమ్మ తం/భ కన్నారావు
596.00

కామాక్షమ్మ సొంత ఇంటికి చెల్లించిన పన్ను రశీదు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రతి చిన్న విషయాన్ని రాజకీయాలతో ముడిపెట్టి ప్రభుత్వంపై బురద జల్లడం ప్రతిపక్ష టీడీపీ, పచ్చ పత్రికలకు అలవాటుగా మారింది. తాజాగా తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురంలో చోటుచేసుకున్న సంఘటన ఇందుకు నిదర్శనం. ఆక్రమణలో ఉన్న జెడ్పీ స్థలం విషయంపై ఆ సరిహద్దులో ఉన్న టీడీపీ సానుభూతిపరులు ఇద్దరి మధ్య వివాదం చాలాకాలంగా నడుస్తోంది. పంచాయతీ అధికారులు ఆక్రమణ తొలగింపునకు ఉపక్రమిస్తే ఆక్రమణదారులైన తల్లి, కుమారుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా, తల్లి మృతి చెందింది.

ఇదీ వాస్తవం..

గత సెప్టెంబరు 19న కలెక్టరేట్ స్పందనలో బాదిరెడ్డి లక్ష్మి భర్త అప్పారావు జిల్లా పరిషత్ భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశాడు. ఆ భూమిని కోటిపల్లి కామాక్షమ్మ(60) భర్త కన్నారావు ఆక్రమించుకున్నాడని, ఈ విషయాన్ని అడుగుతుంటే ఇంటి పక్కనే ఉన్న తమను బెదిరిస్తున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఇదే ఆక్రమణపై సెప్టెంబరు 20న కిలపర్తి వీర్రాజు కూడా బిక్కవోలు ఎంపీడీవోకు జెడ్పీ భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని అభ్యర్థించారు. ఈ రెండు ఫిర్యాదులపై బిక్కవోలు ఎంపీడీవో, ఈవో (పీఆర్అండ్ఆర్డీ), బలభద్రపురం పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో అక్టోబర్ ఒకటో తేదీన స్థలాన్ని సందర్శించి.. కామాక్షమ్మ స్థలాన్ని ఆక్రమించారని గుర్తించారు. తాత్కాలికంగా వేసిన పాకలో ఉంచిన 2 కుర్చీలు, ట్రంక్ పెట్టె, బకెట్, స్టూల్‌ను తొలగించాలని వారు కోరారు. అందుకు ఆమె నిరాకరించి, ఫిర్యాదు చేసిన బాదిరెడ్డి అప్పారావుపై దుర్భాషలకు దిగింది. గత నెల 15న ఎట్టకేలకు కామాక్షమ్మ తన వస్తువులను తొలగించగా, పంచాయతీ కార్యదర్శి ఆ స్థలానికి కంచె వేయించి, అది గ్రామ పంచాయతీకి చెందిందని 16న ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.



కామాక్షమ్మ ఆక్రమించిన జడ్పీ స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కామాక్షమ్మ సొంత ఇల్లు

ఇందులో వేధింపులు ఎవరివి?

ఆక్రమణ స్థలంతో సంబంధం లేకుండా కామాక్షమ్మ సొంత ఇంట్లో (డోర్ నంబర్ 10–50, అసెస్మెంట్ నంబర్ 2,250, సర్వే నంబర్ 152/1) నివాసం ఉంటున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఇంటి పన్ను కూడా ఆమే చెల్లిస్తోంది. ఈ క్రమంలో ఆక్రమణలు తొలగించిన నెల తర్వాత నవంబరు 14న ఆమె తన కుమారుడు మురళీకృష్ణతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే మెరుగైన వైద్యం కోసం అధికారులు తొలుత అనపర్తి సీహెచ్‌సీ, ఆ తర్వాత కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆమెకు వైద్యం అందిస్తున్న క్రమంలో 16న గుండె పోటుతో మృతి చెందినట్టు కాకినాడ జీజీహెచ్ వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. టీడీపీ, పచ్చ పత్రికలు చెబుతున్నట్లు ఇందులో వైఎస్సార్‌సీపీ వేధింపులు ఎక్కడ ఉన్నట్లు?

ఇవే ఆఖరు ఎన్నికలని బాబుకు తెలిసొచ్చింది

- అమరావతి రియల్ ఎస్టేట్ అని తేలిపోయింది
- అందుకే పాదయాత్ర ఆగిపోయింది
- మనుగడ కోసమే సానుభూతి డ్రామాలు: మాజీ మంత్రి కన్నబాబు



కాకినాడ రూరల్: తన జీవితంలో 2024 ఎన్నికలే చివరివని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎప్పుడో ఫిక్స్ అయ్యారని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో ఈ విషయాన్ని ఆయనే బయట పెట్టారని చెప్పారు. కాకినాడ జిల్లా రమణయ్యపేట గ్రామంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న కన్నబాబు మీడియాతో మాట్లాడారు. టీడీపీతోపాటు తన గ్రాఫ్ పడిపోయిందనే విషయం చంద్రబాబుకు బాగా తెలిసొచ్చిందని, అందుకే సానుభూతి డ్రామాకు తెర తీశారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ప్రతిభ, ప్రభ, పరపతి ముందు ప్రజలు తనను చాలా చులకనగా చూస్తున్నారని చంద్రబాబుకు అర్థమైందని అన్నారు. 'ఈసారి ఆయనకు ఓటు వేయకపోతే రాజకీయాల్లో ఉండరట! రాజకీయాల్లో ఉండకూడదనే 2019లో 23 సీట్లు ఇచ్చి తిరస్కరించారు. అందువల్లే ఆయనలో రోజురోజుకూ ఫ్రస్టేషన్ పెరిగిపోతోంది. ఎవరూ ఏమీ అనకపోయినా, తన భార్యను అవమాన పరిచారని, తాను కంటతడి పెట్టుకున్నానని బేలగా మాట్లాడుతున్నారు. ఎల్లో మీడియా జాకీలు పెట్టి లేపుతున్నా ఎవరూ అర్థం చేసుకోరేంటని కర్నూలు ప్రజల ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు' అని చెప్పారు. '2019 ఎన్నికల తర్వాత అన్ని ఎన్నికల్లో కుప్పం సహా వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడం, సీఎం జగన్‌కు ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతుండటంతో బాబుకు నిద్ర కరువైంది. అమరావతి రాజధాని రియల్ ఎస్టేట్ వ్యవహారం అని తేలిపోయింది. పాదయాత్ర ఆగిపోయింది. అందుకే బాబు సానుభూతి డ్రామాలు. ఈ పరిస్థితిలో చంద్రబాబు అనుకున్నట్టు 2024 ఎన్నికలే ఆయనకు చివరివి' అని కన్నబాబు స్పష్టం చేశారు.

అంధకారంలో టీడీపీ భవిష్యత్

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బీజేపీతోనే కలిసి పోటీ చేయాలని తమ పార్టీ ఢిల్లీ పెద్దలు చెప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. 'జనసేన బీజేపీతోనే కలిసి పోటీ చేస్తుంది. పవన్ కళ్యాణ్ మాతోనే ఉంటారు. ఉండాలి. కుటుంబ పార్టీ టీడీపీతో కలవొద్దని కేంద్ర పార్టీ నుంచి పవన్‌కు స్పష్టంగా ఆదేశాలు అందాయి. టీడీపీతో కలిసేది లేదని పవన్ కళ్యాణ్‌కు ఢిల్లీ పెద్దలు చెప్పారు. కుటుంబ రాజకీయాలకు మేం వ్యతిరేకం. పవన్ కళ్యాణ్ మాతోనే ఉండేలా ఒప్పిస్తాం. 2024 ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాం' అని స్పష్టం చేశారు.

చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరివి

అవి టీడీపీకి సమాధి కట్టే ఎన్నికలు

- భార్యను బయటకు లాగి.. సానుభూతి డ్రామాలు
- ప్రజలు తులసి తీర్థం పోస్తే తప్ప రాజకీయంగా బతకలేనంటున్నారు
- ఏడాదిన్నర ముందే ఓటమిని అంగీకరించారు
- ఉత్తరాఖండ్‌లో హైకోర్టును మారుస్తున్నారు చూడండి
- పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

సాక్షి, అమరావతి: 'చంద్రబాబు తొలిసారి నిజం మాట్లాడారు.. 2024 ఎన్నికలే ఆయనకు చివరి ఎన్నికలు.. టీడీపీకి సమాధి కట్టే ఎన్నికలవి. ముందే కాడి పారేశారు. ప్రజలు తులసి తీర్థం పోస్తే తప్ప రాజకీయంగా బతకను అన్నట్లుగా కన్నీరు పెట్టుకున్నారు. పనిలో పనిగా ఆయన భార్యను కూడా రాజకీయాల్లోకి లాగారు. భార్యను అడ్డం పెట్టుకుని సానుభూతి పొందాలనుకోవడం దారుణం. ఇది సరైన పద్ధతి కాదని కుటుంబ సభ్యులైనా వారించాలి' అని రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. రాజకీయాల కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారతాడని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ చంద్రబాబు ఏడుపులు, గగ్గోలు చూసి జనం నవ్వుకుంటున్నారని చెప్పారు. వికేంద్రీకరణను పక్కదారి పట్టించేందుకే ఆయన పర్య



టిస్తున్నారని తప్పుపట్టారు. చంద్రబాబుకు దమ్ముంటే కర్నూలుకు హైకోర్టు వద్దని అక్కడే చెప్పగలరా? అని ప్రశ్నించారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే...

చంద్రబాబు పుట్టుకే 420

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పట్టుకుని వీధి రౌడీలు కూడా మాట్లాడలేని భాషను చంద్రబాబు మాట్లాడుతున్నారు. వెన్నుపోటు, నమ్మక ద్రోహమే పెట్టుబడిగా చంద్రబాబు రాజకీయాల్లో ఈ స్థాయికి వచ్చారు. నమ్మిన వారిని అధఃపాతాళానికి తొక్కేసిన నైజం బాబుది.
- మూడుసార్లు సీఎంగా చేసిన ఆయనకు, తన మార్క్‌గా చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్క పథకం లేదు. చేతికి మైకు దొరికితే.. 'సెల్‌ఫోన్ నేనే కనిపెట్టాను. సత్య నాదెళ్లకు నేనే ఉద్యోగం ఇప్పించాను. సానియా మీర్జాకు, పీవీ సింధూకు నేనే ఆట నేర్పించాను' అని చెప్పుకుంటూ తిరుగుతారు.
- చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారిని మోసం చేస్తున్నారు. మొన్న ఉత్తరాంధ్ర వెళ్లి అక్కడ రాజధాని పెట్టడానికి అవకాశం లేదని మాట్లాడారు. కేవలం 29 గ్రామాల కోసం, తన వాళ్ల కోసం గుంటూరు, కృష్ణా జిల్లాల వారిని కూడా చంద్రబాబు మోసం చేస్తున్నారు. ఇప్పుడు సీమ వాసులను రెచ్చగొడుతున్నారు.
- బీజేపీ పాలిత ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఇటీవలే హైకోర్టును మార్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేశారు. అక్కడ రాజధానిలో కాకుండా నైనిటాల్‌లో హైకోర్టు ఉంది. అక్కడి నుంచి హల్ద్వానికి మార్చుకోడానికి ఆ రాష్ట్రం ఇటీవల తీర్మానం చేసింది. ఇందుకు కేంద్రం అనుమతిస్తుంది.
- అక్కడ హైకోర్టు మార్చుకున్నప్పుడు మన రాష్ట్రంలో ఎందుకు మార్చుకోకూడదు? 'రాష్ట్ర రాజధాని విషయంలో కేంద్రం జోక్యం ఉండదు. మా పాత్ర శూన్యం' అని కేంద్రం పలు సందర్భాల్లో స్పష్టంగా చెప్పింది. సీఎం జగన్ చెప్పినట్లు రాజధానుల వికేంద్రీకరణ కచ్చితంగా అమల్లోకి వచ్చి తీరుతుంది. సీఎం జగన్.. ఎప్పుడూ చంద్రబాబులా బేల మాటలు మాట్లాడలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు చంద్రబాబును నమ్మరు.

బాబు మెంటల్‌గా బాగా వీక్

- ఏడాదిన్నర ముందే చంద్రబాబు తన ఓటమిని అంగీకరించారు. పార్టీ లేదు, బొక్కా లేదన్న అచ్చెన్న మాటలను నిజం చేశారు. ప్రధాని మోదీ డ్వాక్రా సంఘాలు భేష్ అన్నాడని తనకు తాను సర్టిఫికెట్ ఇచ్చుకుంటున్నారు. కానీ ప్రధాని ఎక్కడా ఆ మాట అనలేదు. ఎవరూ వినలేదు.
- దీన్ని బట్టే ఆయన మానసిక స్థితి ఏమిటనేది అర్థం అవుతోంది. శారీరకంగా ఫిట్‌గా ఉన్నారో లేదో తెలియదు గానీ, మెంటల్‌గా మాత్రం చాలా వీక్ అయ్యారు. డ్వాక్రా సంఘాలను పెట్టింది పీవీ నరసింహారావు. రాష్ట్రంలో వాటికి పునరుజ్జీవం తెచ్చింది దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్.

చిలకలూరిపేటలో రూ.కోటితో ముస్లింల శ్మశానవాటికకు స్థలం

సొంత నిధులతో రెండెకరాలు సమకూర్చిన మంత్రి రజిని



చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో ముస్లింల శ్మశానవాటికకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని రెండెకరాల స్థలాన్ని సమకూర్చారు. ముస్లింల ఇబ్బందులను గుర్తించిన మంత్రి సొంత నిధులు రూ.1.01 కోట్లతో ఈ స్థలాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు గురువారం రాత్రి పట్టణంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సభలో మంత్రి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముస్లింలకు ఎలాంటి మేలు చేయలేదని, పైగా అన్యాయం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు అవకాశం కలిగిన ప్రతిసారీ ముస్లిం సోదరులపై కక్ష తీర్చుకున్నారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీ మంత్రి పదవి కూడా ముస్లింలకు చివరిదాకా ఇవ్వలేదని చెప్పారు. చంద్రబాబుకు సంక్షేమం అనే పదానికి అర్థం తెలియదని, ఆయన అందించే సంక్షేమం ఎలా ఉంటుందో ప్రజలు చూశారని చెప్పారు. జగనన్న లక్షలాది మందికి ఉద్యోగాలిచ్చారని, ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే మూడేళ్లలో 45 వేల ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. బాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడైనా ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేశారా అని ప్రశ్నించారు. తియ్యగా మాట్లాడి గొంతుకోసే నాయకుడు చంద్రబాబు అని చెప్పారు.

గౌరవ సభ కాదు కౌరవ సభ.. అసెంబ్లీ

▶ మొదటి పేజీ తరువాయి

రెండో రోజైన గురువారం చంద్రబాబు ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో రోడ్డు షోలు, బహిరంగ సభలు నిర్వహించి ప్రసంగించారు. సీఎంఓలో అవినీతి పెరిగిపోయిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాసులకు కక్కుర్తి పడి అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మార్గదర్శితో సహా వివిధ చిట్‌ఫండ్ వ్యాపారాల అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందంటూ పరోక్షంగా ఈనాడు అధినేత రామోజీరావుకు వత్తాసు పలికారు. ఇక విశాఖపట్నంలో పేదల మెడపై కత్తిపెట్టి ఆస్తులు రాయించుకుంటున్నారని, రాయదుర్గంలో ఓ ముస్లిం కుటుంబంలో ముగ్గురు చనిపోవడానికి హెడ్‌కానిస్టేబుల్ కారణమయ్యాడంటే పాలన ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు.

బూతు పురాణం..

చంద్రబాబునాయుడు సీఎం జగన్, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై బూతు పురాణం అందుకున్నారు. 'ఎవడ్రా నువ్వు.. నా మీద కేసు పెట్టేంతటి పెద్ద మగాడివా'..



ఎమ్మిగనూరులో విద్యార్థుల నిరసన

అంటూ సీఎంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'కేసులు పెట్టుకుని ఏం పీక్కుంటారో పీక్కోండి'.. అంటూ ఊగిపోయారు. 'మీ తండ్రి, తాతలకే నా మీద కేసు పెట్టే ధైర్యం చాలలేదని, నీవు పెడతావా'.. అంటూ ఏకవచనంతో సంబోధించారు. ఆదోని సభలో.. మూడు రాజధానులతో ఏపీని దక్షిణాఫ్రికాలా మారుస్తారా.. అంటూ ప్రశ్నించారు. అక్కడ అవినీతి, ఆకలి పెరిగిపోయాయని ఆయన చెప్పారు. ఇక రాష్ట్రంలో మద్యం, ఇసుక విక్రయాల్లో సీఎంకు వాటాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామంలో 120 అడుగుల రోడ్డు అవసరమా అని ప్రశ్నించారు. ఇలాచేస్తే వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై ఫ్లైవర్ వేయిస్తానని హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో నకిలీ విత్తనాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

కర్నూలులో హైకోర్టుకు బీజేపీ ఆందోళన

మరోవైపు.. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు చంద్రబాబు మద్దతివ్వాలని బీజేపీ ఆందోళన చేసింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ న్యాయవాది పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు పర్యటనను ఎమ్మిగనూరులో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ప్లకార్డులు ప్రదర్శించి 'గో బ్యాక్ రాయలసీమ ద్రోహి' అంటూ నినాదాలు చేశారు. అయితే పోలీసులు వారిని అడ్డుకున్నారు. అలాగే, జూనియర్ ఎన్టీఆర్‌ను సీఎం చేయాలంటూ ఆయన ఫ్యాన్స్ ఎమ్మిగనూరులో ప్లకార్డులు ప్రదర్శించారు.

64 పట్టణాల్లో సర్వే మ్యాపింగ్ పూర్తి

సాక్షి, అమరావతి: పట్టణ ప్రాంతాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పటిష్ట అమలుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే శిక్షణ పొందిన సిబ్బంది 64 మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఆస్తుల మ్యాపింగ్ పూర్తి చేశారు. మరో 18 అర్బన్ లోకల్ బాడీల్లో (పట్టణ స్థానిక సంస్థల్లో) కొనసాగుతున్న మ్యాపింగ్ మరో వారం రోజుల్లో ముగియనుంది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతమున్న డోర్ నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్లను పాత రికార్డులతో సరిపోలుస్తున్నారు. ఓ పక్క ఈ ప్రక్రియ కొనసాగిస్తూనే మరోవైపు డ్రోన్‌తో సర్వే ప్రక్రియను కూడా వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే మే నాటికి మొత్తం ఆస్తుల సర్వే పూర్తిచేసి మొత్తం 123 యూఎల్బీల్లోని ఆస్తులకు సంబంధించిన హక్కు పత్రాలను వాటి యజమానులకు అందజేయనున్నట్లు సీడీఎంఏ (మున్సిపల్ పరిపాలన కమిషనర్ అండ్ డైరెక్టర్) ప్రవీణ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటికే శిక్షణ పొందిన వార్డు కార్యదర్శులు తమ తమ పరిధిలోని ఆస్తుల అసెస్‌మెంట్ నంబర్ల ఆధారంగా ఆన్‌లైన్ రికార్డులను ఒకటికి రెండుసార్లు పరిశీలించారు. ఆయా యూఎల్బీల్లో ఏర్పాటుచేసిన సెంట్రల్ మానిటరింగ్ యూనిట్ (సీఎంయూ) ఈ పనులను పక్కాగా నిర్వహిస్తోంది. మరోవైపు.. మున్సిపల్ శాఖ అధికారులు అన్ని పట్టణాలు, నగర పంచాయతీల్లో దాదాపు 40 లక్షల ఆస్తులను సర్వే చేసేందుకు ప్రణాళికను రూపొందించారు.

పక్కాగా సరిహద్దుల గుర్తింపు

సర్వే పనులు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుగోలు చేసేందుకు రూ.20 కోట్ల బడ్జెట్ కూడా మంజూరైందని, అవసరమైన పరికరాలకు ఒకటిరెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామని సీడీఎంఏ తెలిపారు. ఇందుకోసం ఆయా కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం కానున్నారు.

ఎవడు అల్లాహ్‌కు భయపడుతూ పనిచేస్తాడో,
అతనికి అల్లాహ్ కష్టాల నుండి గట్టెక్కే మార్గం చూపుతాడు.
అల్లాహ్‌ను నమ్ముకున్నవాడికి అల్లాహ్‌యే చాలు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, నవంబర్, 18

సవాళ్ళు... సదవకాశాలు

ప్రతి అవకాశాన్నీ సంక్షోభంగా మార్చుకోవడం పలువురు చేసే తప్పు. అందరూ సంక్షోభం అనుకొనేదాన్ని కూడా సదవకాశంగా మార్చుకోవడమే తెలివైన పని. ఈ నవంబర్ 15న పుట్టిన శిశువుల్లో ఒకరితో పుడమిపై జనాభా 800 కోట్లకు చేరిందన్న ఐక్యరాజ్య సమితి (ఐరాస) అంచనాను ఆ దృష్టితో చూస్తే కర్తవ్యం బోధపడుతుంది. ఇవాళ ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశాలుగా మొదట చైనా, తర్వాత భారత్ నిలిచినా, వచ్చే ఏడాదిలో మనం చైనాను అధిగమిస్తామట. ఈ మైలురాయి సవాళ్ళు విసురుతూనే, అవకాశాలూ అందిస్తోంది. ఎందుకంటే, జనాభా పెరుగుదలైనా, తగ్గుదలైనా పూర్తి మంచీ కాదు, చెడూ కాదు. ఆ జనాభాను ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యం. సవాళ్ళను అధిగమించే జనసామర్థ్యమే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనను నిర్ణయిస్తుంది.

చారిత్రకంగా చూస్తే – మానవ జాతి ఆవిర్భావం మొదలు క్రీ.శ. 1800వ సంవత్సరం నాటికి కానీ జనాభా వంద కోట్లకు చేరలేదు. కానీ, ఆ తర్వాత కేవలం రెండొందల పైచిలుకు ఏళ్ళలో మన సంఖ్యలో మరో 700 కోట్లు చేరాయన్నమాట. మెరుగైన ఆరోగ్యసంరక్షణ, ఒకప్పటితో పోలిస్తే తగ్గిన ప్రపంచ దారిద్ర్యం, మాతా శిశు ఆరోగ్యంలో వచ్చిన మెరుగుదల, ఆయుఃప్రమాణం పెరగడం ఇలాంటివి అనేకం దీనికి కారణం. తాజా 800 కోట్ల మార్కును ''మానవాళి సాధించిన విజయాలకు ఇది మైలురాయి'' అని ఐరాస జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) అన్నది అందుకే. వర్తమాన ధోరణులే గనక కొనసాగితే, 2080ల నాటికి జనాభా 1040 కోట్ల గరిష్ఠానికి చేరుతుందనీ, దాదాపు 1050 కోట్ల దగ్గర ప్రపంచ జనాభా స్థిరపడవచ్చనీ అంచనా. వర్ధమాన దేశాల్లో అధిక భాగం జనాభా నియంత్రణపై దృష్టి పెట్టినా, గత ఆరు దశాబ్దాల్లో ప్రపంచ జనాభా రెట్టింపైన మాట నిజమే. అలాగని ఈ లెక్కల్నే చూసి, సంపూర్ణ చిత్రాన్ని విస్మరిస్తే కష్టం.

ప్రపంచ జనాభా 2011లో 700 కోట్లుండేది. ఆ పైన పట్టుమని పన్నెండేళ్ళకే మరో వంద కోట్లు పెరిగి, ఇప్పుడు 800 కోట్లయింది.అయితే, ఈ సంఖ్య 900 కోట్లవడానికి కాస్తంత ఎక్కువ సమయమే పట్టనుంది. మరో పద్నాలుగున్నర ఏళ్ళకు, అంటే 2037 నాటికి గానీ అక్కడకు చేరుకోమని అంచనా. అంటే, జనాభా రేటు పెరుగుతున్న మాట నిజమే కానీ, ఆ పెరుగుదల వేగం తగ్గుతోందన్న మాట. 1950తో పోలిస్తే ఇప్పుడు జనాభా పెరుగుదల చాలా నిదానించి, 2020లో 1 శాతం కన్నా తక్కువకు పడిపోయిందని ఐరాస జనాభా నివేదికే వెల్లడించింది. ఒక్కమాటలో... నిదానంగానైనా జనాభా తగ్గుదల మార్గంలోనే పయనిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా తగ్గుతున్న సంతాన సాఫల్య రేటూ దీనికి నిదర్శనం. దాని ప్రభావం స్పష్టంగా తెలియడానికి కొంతకాలం పట్టవచ్చు. వెరసి వయసు పెరిగిన జనాభా ఎక్కువవడం ఈ శతాబ్దిలో ప్రధాన ధోరణి కానుంది.

వచ్చే 2023లో ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా అవతరించనున్న భారత్ ముంగిట సువర్ణావకాశం ఉంది. చైనా (38.4 ఏళ్ళు), జపాన్ (48.6) దేశాల్లోని సగటు వయస్కుల కన్నా చాలా తక్కువగా భారతీయుల సగటు వయసు 28.7 ఏళ్ళే కానుంది. చివరకు ప్రపంచ జనాభా సగటు వయసు 30.3 ఏళ్ళ కన్నా మన దేశంలోనే పిన్న వయస్కులుంటారు. అలాగే, మన జనాభాలో 27 శాతానికి పైగా 15 నుంచి 29 ఏళ్ళ వయసువాళ్ళయితే, 25.3 కోట్ల మంది 10–19 ఏళ్ళ మధ్యవయస్కులు. వచ్చే 2030 వరకు ప్రపంచంలోనే పిన్న వయస్కులున్న దేశం మనదే కావడం కలిసొచ్చే అంశం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. జనాభాను సమస్యగా భావించి ఆందోళన చెందే కన్నా ఆయుధంగా అనుకోవాలి. ఉత్పాదకత పెంచే శ్రామికశక్తిగా మలుచుకుంటే మంచి ఫలితాలుంటాయి. గతంలో చైనా చేసినది అదే!

ప్రస్తుతం చైనా జనాభాలో పెద్ద వయస్కుల సంఖ్య పెరుగుతోంది. పడిపోతున్న జననాల రేటు వల్ల జనాభా తగ్గుతోంది. అంటే, ఇప్పటిదాకా ఆ దేశ ఆర్థిక పురోగతికి ప్రధాన కారణమైన శ్రామిక శక్తి ఇక ఏ మేరకు అందుబాటులో ఉంటుందనేది ప్రశ్నార్థకం. ఒక బిడ్డే ఉండాలంటూ అనేక దశాబ్దాలు కఠిన విధానం అనుసరించిన చైనా గత ఏడాది నుంచి ముగ్గురు పిల్లలకు అనుమతించింది. మరింతమందిని కంటే ప్రోత్సాహకాలిస్తామనీ ప్రకటించే పరిస్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలో మన 141 కోట్ల పైచిలుకు జనాభాను సానుకూలతగా మలుచుకోవాలి. అయితే, భారత్‌లో పట్టణ జనాభా అంతకంతకూ అధికమవుతున్నందున సవాళ్ళూ ఎక్కువే. పట్టణ ప్రజావసరాలు తీర్చాలంటే రాగల 15 ఏళ్ళలో భారత్ కనీసం 84 వేల కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టాలని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక. అంటే సగటున ఏటా 5500 కోట్ల డాలర్లు. అందుకు సిద్ధం కావాలి. పట్టణాల్లో అలా వసతుల కల్పన నాణ్యమైన జీవనంతో పాటు ఉత్పాదక శక్తి పెంపునకూ దోహదం చేస్తుంది.

అయితే, జనాభాతో పాటు ధనిక, పేద తేడాలు పెరుగుతాయి. ఉద్రిక్తతలు హెచ్చే ముప్పుంది. ప్రపంచ ఆదాయంలో అయిదోవంతు కేవలం అగ్రశ్రేణి ఒక శాతం జనాభా గుప్పిట్లో ఉండడం పెను ప్రమాదఘంటిక. అత్యంత ధనిక దేశాల ప్రజలు, అతి నిరుపేద దేశాల వారి కన్నా 30 ఏళ్ళు ఎక్కువ జీవిస్తారట. పెరిగిన జనాభా కన్నా ఈ వ్యత్యాసాల పెరుగుదలే దుర్భరం. పెరిగిన జనసంఖ్య కోసమంటూ ప్రకృతి వనరుల విధ్వంసం ప్రపంచ సమస్య. అడవుల నరికివేత, భూగర్భ జలాల దుర్వినియోగం, చేజేతులా కాలుష్యాలు, వాతావరణ మార్పుపై అశ్రద్ధ లాంటివి అరికట్టాలి. 800 కోట్ల మంది కలసి బతుకుతూ, ఈ పుడమిని రాబోయే తరాలకూ నివాసయోగ్యంగా ఉంచడం కీలకం.

మూలాలన్నీ ఆదిమ సమాజంలోనే!

విశ్లేషణ


డా. కత్తి పద్మారావు

ప్రస్తుత ఆధునిక ప్రపంచం ఈ స్థితికి చేరడానికి కారణం తరతరాల పూర్వీకులు కూడబెట్టిన జ్ఞాన సంపదే. ఆ జ్ఞానం ఆధ్యాత్మికం కావచ్చు, భౌతికం కావచ్చు. అయితే ఇప్పుడు మనం చూస్తున్నదీ, అనుభవిస్తున్నదీ మాత్రమే జ్ఞానం కాదు. ఇప్పటికీ లిపి లేని ఎందరో ఆదిమ జాతుల వారు జీవనం సాగిస్తున్నారు. వారిది మౌఖిక విజ్ఞానం. ప్రకృతితో మమేకమవ్వటం, దాని పరిరక్షణ, దానిని ఉపయోగించుకోవడంలో వారు అగ్రగణ్యులు. సోకాల్డ్ ఆధునిక సమాజాలవారు ఈ జ్ఞానాన్ని గ్రహించి మరింతగా పురోగమించవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా విద్యాసంస్కృతి బహుముఖంగా విస్తరిస్తోంది. ఈ విద్యా సంస్కృతీ వికాసానికి మూలమైన తాత్త్వికులు లిఖిత విద్యనే ప్రమాణంగా తీసుకోలేదు. భారతదేశంలో గిరిజనులు మౌఖిక జ్ఞాన సంపన్నులు. దేశీయ భాషల్లో జీవం ఉంటుంది. నేల, నిప్పు, నీరు, గాలి, ఆకాశం, చెట్టూ, పుట్టా అన్నింటి విలువలు వీరి జ్ఞానంలో ఒదిగి ఉన్నాయి. అయితే వారి నుండి మనం పూర్తి జ్ఞానాన్ని పొందలేదు. ఆ విజ్ఞానం మన జీవితాన్ని సుసంపన్నం చేయాలంటే మౌఖిక జ్ఞాన సంపద లోతుల్లోకి మనం వెళ్ళాలి.

ప్రపంచ విజ్ఞానమంతా ప్రకృతిలో దాగి ఉంది. వృక్ష, జంతు, భూగర్భ శాస్త్రముల వంటి వన్నీ విస్తృతి చెందాలంటే మానవ సమాజ జీవన వ్యవస్థల లోతుల్లోకి ఇంకా పరిశోధనలు వెళ్ళాలి. మనం మన కళ్ళముందు ఉన్నదాన్ని గ్రహించ లేక మన జీవన వ్యవస్థల్లో భాగంగా ఉన్న భాష మీద ఆధిపత్యం లేక ఉపరితల అంశాల మీదే దృష్టి పెడుతున్నాం. మనకు జ్ఞానం ఎలా కలుగుతుంది? సమస్త జ్ఞానం ఇంద్రియానుభవం ద్వారానే సిద్ధిస్తుందా? ఈ తాత్త్విక, భౌతిక దృష్టి లోపించి ప్రయోజనవాద దృష్టి పెరిగింది. ఇది మానవులకు ఉపయుక్తం కాదు. మనిషి తప్పక వాస్త వాన్ని అంగీకరించే ధోరణి లోకి రావాలి. వాస్తవం ప్రకృతిలోనూ, ప్రాకృతిక జీవుల్లోనూ ఎక్కువ ఉంటుంది. తాత్త్విక దృక్పథం లేని వాళ్ళే భూమి పొరలను చీల్చి భూగర్భ ఖనిజాలను అమ్ముకుంటున్నారు. ప్రపంచం అంతా ఈ రోజు అస్తవ్యస్తం కావ డానికి ప్రపంచం మీద, దేశం మీదా అవగాహన లేని అవిద్యాపరుల భావనలే.

మనిషి స్వార్థపరుడు కావడానికి కారణం జ్ఞాన శూన్యతే. ప్లేటో చెప్పినట్టు వృక్షత్వం భావన నుంచి చెట్టు మూలం తెలుస్తుంది. చెట్టు మూలం తెలియని వాడు దాని వేర్లు నరుకుతాడు. చెట్టు మూలం తెలియని వాడు చెట్టు పెంచడు. కాగా, చెట్టు మూలం తెలిసిన వాడు దాని ఆకులోని ఔషధ గుణాన్ని స్వీకరిస్తాడు. చెట్టుకి మానవ సమాజానికి ఉన్న అంత స్సంబంధం తెలియని వాడు జ్ఞాని కాదు. నిజమైన జ్ఞానం వస్తువుకు మనకు ఉండే అంతస్సంబంధం నుండే జనిస్తుంది. చాలామంది తన చుట్టూ ఉన్న పరిసరాల మీద అవగాహనను పెంచుకోలేదు. తాము చూడని, కనని, వినని అజ్ఞాత దైవాల మీద, తమకు అనుభవం కాని కులం మీద, తాము అనుభవించని సంపద మీదా ఆలోచనలతో జీవిస్తూ ఉంటారు. అందుకే వాళ్ళు మూఢ విశ్వాసులుగా మారతారు. జ్ఞానానికి వారు అవరోధులు.

మౌఖిక జాతుల జీవన శాస్త్రాన్ని అధ్యయనం చేయడం ద్వారానే మనం భారతదేశాన్ని సుసంపన్నం చేయగలం. అనేక జాతులలో నిక్షిప్తమైయున్న జ్ఞానాన్నీ, విద్యనీ, సంస్కృతినీ మనం అర్థం చేసుకొనే



క్రమం నుండే మన దేశాన్ని మనం కాపాడుకోగలం.

ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో ఎంతో విలువైన ఖనిజ సంపద వుంది. ఎన్నో వృక్ష జాతులున్నాయి. గిరిజనులు ఈ ప్రకృతి సంపద పట్ల ఎంతో అవగాహన కలిగి సంరక్షించుకుంటూ ఉంటారు. ఈనాడు భారతదేశం సంక్షోభంలో వుండటానికి కారణం గిరిజనుల జ్ఞాన సంపదను అర్థం చేసుకోలేకపోవడమే. గిరిజనులు రక్షిస్తున్న అటవీ సంపదను బట్టి వారి నీతినీ, నిజాయితీనీ, వ్యక్తిత్వాన్నీ, రక్షణ స్వభావాన్నీ మనం అర్థం చేసుకోవచ్చు. గిరిజనులే నిజమైన మానవులు. వారు ప్రతి ఆకునూ ప్రేమిస్తారు. ప్రతి జంతువు స్వభావాన్నీ అధ్యయనం చేస్తారు. మాతృస్వామిక స్వభావం గలవారు. అందుకే శాస్త్రవేత్తలు లిఖిత భాషలోనే కాదు, అలిఖిత జాతులలో కూడా జ్ఞానం వుందని చెబుతున్నారు.

అరిస్టాటిల్ ప్రకృతి గురించి చెప్తూ... శుద్ధద్రవ్యం మొదటగా నాలుగు మూల పదార్థాలు – మట్టి, నీరు, గాలి, అగ్నిగా మారుతుందన్నాడు. ఇంతవరకు అరిస్టాటిల్‌కు పూర్వులైన గ్రీకులు కనిపెట్టినవే. కాని, అతడు అయిదవ మూల పదార్థం ఈథర్ కూడా ఉంటుందని ఊహించాడు. భారతీయ భౌతికవాదులు సాంఖ్యులు భూమి, నీరు గాలి, అగ్ని, శూన్యాలను కనిపెట్టారు. ఈ శూన్యంలో కూడా ఈథర్ అనే పదార్థం ఉంటుందని నేటి భౌతికవాదులు చెప్తున్నారు. అది కొంత స్థలాన్ని ఆక్రమిస్తుందని అంటున్నారు. అన్ని వస్తువులు పంచ భూతాల నుండే ఏర్పడతాయి. పదార్థ జ్ఞానాన్ని ఆదిమ వాసులు విస్తృతంగా అర్థం చేసుకొన్నారు. దేన్నైనా జీవితావసరం మేర మాత్రమే వాడుకుంటారు. కాని సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ స్వభావం వున్న వాళ్ళే వాటిని వ్యాపార దృక్పథంతో స్వార్థం కోసం ఉపయోగించు కొంటారు.


భౌతిక తత్వశాస్త్రం మొత్తం ఆదిమ జాతుల నుండే వచ్చింది. సాంఖ్య దర్శన రూపకర్త కపిలుడు దళితుడే. దళితజాతులు ఆదిమ జాతులకి దగ్గరగా వుంటాయి. గిరిజనుల్లో చాలాకాలం ప్రజలకు లిపి తెలియదు కాని, వారికి మనకంటే జ్ఞాపకశక్తి ఎక్కువగా వుండేది. వారు పాతకాలపు అద్భుత గాథలను చెప్పేవారు. వారు పోయినా ఆ గాథలు మాత్రం పోలేదు. ఆనోటా ఆనోటా ఆ గాథలు మారుతూ వుంటాయి. వాటిలో కొత్త సంగతులు చేరుతుంటాయి. నీరు పారి పారి రాళ్ళు నునుపు దేరినట్టు ఆ గాథలు రాను రాను నయం గానూ, నాజూకు గానూ అవుతూ ఉంటాయి. పరాక్రమ వంతుడైన ఒకానొక కులపెద్ద కథ కాలక్రమాన నీటికీ, నిప్పుకూ, బాణానికీ, బల్లేనికీ భయపడని వాడూ; సింహంలాగా అడవంతా పెత్తనం చెలాయించి డేగలాగ ఆకాశంలో ఎగిరిపోయేవాడూ అయిన ఏమాయా మానవుని వీరగాథ గానో మారుతుంది.

గిరిజనులు, దళితులు ఇంకా ఇతర మౌఖిక ఉత్పత్తికారులు మన సంస్కృతీ వికాసానికి, తత్వానికీ మూల ప్రకృతులు. మన కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలే కాక, మన విశ్వ విద్యాలయాలు, పరిశోధకులు, జ్ఞానులు, విద్యావంతులు మన మూల ప్రకృతులైన ఆదిమవాసులు, దళితులను అధ్యయనం చేయాలి. ఈ నేల పుత్రుల జీవన గాథలనూ, సాంస్కృతిక వికాసాన్నీ పునర్నిర్మించుకోవడానికి దళిత గిరిజన విశ్వ విద్యాలయాలను నిర్మించుకోవలసి వుంది. లిఖితేతర సమాజం వైపు నడపడమే నిజమైన శాస్త్ర దృష్టికి మూలం. ఆ వైపు నడుద్దాం.

వ్యాసకర్త దళిత ఉద్యమ నాయకులు । 9849741695

చెప్పు చేతులల్ల...

అట్లుంటది


తెలిదేవర భానుమూర్తి

లష్కర్ల రేల్ గాడి ఎక్కితె అద్ద గంటల మా వూర్కి బోవచ్చు. మా వూరు బోన్గిరి. బోన్గిరిల బాహర్‌పేటల మేము ఉండెటోల్లం. ఊల్లె నాకందరు సుట్టాలే. పొట్ట తిప్పలకు పట్నం మొచ్చి యాభై ఏండ్లయితున్నది. బోన్గిరిల పోశమ్మ గుడి ఎదురుంగ మా ఇల్లున్నది. మా పక్కింట్ల యాద్గిరి మామ ఉన్నడు. మామ అంటె సంత మామ గాదు. వర్సకు మామ. పనిబడ్తె గాయిన పట్నమొచ్చిండు. పనంత అయినంక ఆనంద్ బాగ్ల ఉంటున్న మా ఇంటికొచ్చిండు. గాయినను సూడంగనే నాకు మా వూరును సూసినట్లనిపిచ్చింది. పట్నం మంచి చెడ్డ లర్సుకునే తందుక్కు కుద్దు వూరే నడ్సుకుంట నాతాన్కి వొచ్చినట్లు గొట్టింది. 'మామా! బాగున్నావె' అని అడ్గిన. 'బాగున్నర' అని యాద్గిరి మామ అన్నడు. గా ముచ్చట గీ ముచ్చటైనంక గాయిన రాజకీయాలల్లకు దిగిండు.

'ఏం మామా! ఎప్పుడు రాజకీయాలు మాట్లాడ్తవేందే?'

'రాజకీయాలు గాన్ది ఏమన్న ఉన్నదా? రామాయనమంత రాజకీయమే. బారతమంత రాజకీయమే' అన్కుంట యాద్గిరి మామ సిగిలేట్ ముట్టిచ్చిండు. 'విబీషనుడు గోడ దుంకి రాముని దిక్కుకు వొచ్చిండు. గోడ దుంకె బట్కె అన్న జాగల లంకకు రాజైండు. గదే తీర్గ తెలుగు దేసం కెల్లి టీఆర్ఎస్లకు దుంకిన తలసాని, కాంగ్రెస్ కెల్లి దుంకిన సబితా ఇంద్రారెడ్డి అసుంటోల్లు మంత్రులయ్యింంద్రు. ఎలచ్చన్ల ముంగట గోడ దుంకుట్లు ఎక్వయితయి. గోడ దుంకెటోల్లందరు గల్సి విబీషనునికి గుడి గట్టియ్యాలె. గాయినకు మొక్కి నంకనే పార్టి ఫిరాయించాలె.'

'బారతం సంగతేందే?'

'గంత ఆత్రమైతే ఎట్లరా? కౌరవులు, పాండవుల నడ్మ జాగ పంచాతి అయింది. గా పంచాతిని తశ్వ జేసెతందుక్కు కిష్నుడు ఒక్క తీర్గ కోషిస్ జేసిండు. గాయినెంత కోషిస్ జేసినా సూది మొనంత జాగ గుడ్క పాండవులకిచ్చే సవాల్లేదని దురియోదనుడన్నడు. దాంతోని పాలోల్ల నడ్మ విద్దమొచ్చింది. కర్నున్ని ఎవ్వలు లేని జాగలకు కిష్నుడు దీస్క బోయిండు. నువ్వు సూతుని కొడుక్కువు గాదు. కుంతి కొడ్కువు. నువ్వు పాండవుల దిక్కుకొస్తివా అంటె పెద్దన్నా అన్కుంట గాల్లు నీ కాల్లు మొక్కుతరు. నిన్ను రాజును జేస్తరు అని కిష్నుడన్నడు. గాయిన ఎంత గనం జెప్పినా కర్నుడిన లేదు.

బీజేపీ దిక్కుకెల్లి ఇద్దరు సన్నాసి గాల్ల తోని ఇంకొకడు మొయినాబాద్ ఫాంహౌజ్‌కొచ్చింంద్రు. తలా నూరు కోట్ల రూపాయలే గాకుంట గనుల సుంటియి గుత్తకిప్పిస్తం అని ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి, గువ్వల బాలరాజు, రేగా కాంతా రావు, హర్షవర్దన్ రెడ్డిలను బుద్ద రిచ్చినా గాల్లు గోడ దుంక లేదు. ఇక ముంగట ఎవలన్న గోడ దుంకుమని అంటె చెప్పుతోని కొడ్తమని అనుంండ్రి అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే లకు కేసీఆర్ జెప్పింంద్రు' అన్కుంట యాద్గిరి మామ గిలాస్ నీల్లు దాగిండు.



'ఆంద్ర సంగతేంది?'

'ఆంద్రప్రదేస్ల పవన్ కల్యాన్ చెప్పు చేత్ల బట్కోని చెంగడ బింగడ ఎగురుతుండు. నాకు తిక్కుంది, గా దాన్కి లెక్క లేదు అన్కుంట శిగమూగుతుండు. విశాకపట్నం, చోళ హోటల్ల ప్రదాని మోదీని గల్సిండు. రొండు చేతులతోని చెప్పులు బట్కోని శిగమూగుత. ఒక చెప్పు మీరియ్యింండ్రి. ఇంకో చెప్పు చెంద్రబాబిస్తడు. చెప్పులను చేతులల్ల బట్టుకుంట. ముక్యమంత్రినైత అని అన్నడు.'

'శానేండ్ల కింద ముక్యమంత్రి కుర్సి కోసం చిరంజీవి ప్రజా రాజ్జెం బెట్టిండు. గప్పుడు గాయిన పార్టి గుర్తు సూర్యుడు. అరచేతి నడ్డుపెట్టి సూర్య కాంతి నాపలేరన్నడు. గని గా అరచెయ్యే సూర్యున్ని మాయం జేసింది. ప్రజా రాజ్జెంను దీస్కబోయి కాంగ్రెస్ల గల్పిండు. గాయిన తీర్గనే పవన్ కల్యాన్ గూడ జన సేనను తెలుగుదేసంల కల్పుతడేమో మామా'

'కల్పినా కల్పొచ్చురా. పవన్ అనేటి పతంగిని చెంద్రబాబు ఎక్కిస్తున్నడు. వైఎస్సార్‌సీపీ మోదీ కాల్లు మొక్కుతున్నదని జనసేన లీడర్ బొలివేటి అంటె మల్లీ పారి అంటివా చెప్పు తెగుతది అని మల్లాది విష్ను అన్నడు. వారీ! నువ్వు కొల్వు ఇడ్సి పెట్టి పాత చెప్పుల దుక్నం బెట్టురా! రేల్ గాడికి సైమమైంది. వొస్తరా!' అన్కుంట మామ బోయిండు.

తోక: మొన్న చాచా నెహ్రూ జయంతి అయ్యింది. 'బాల్ దివస్ శుభాకాంక్షలు' అని ఒక లీడర్‌కు జెబ్తె – 'నా బాల్ (జుట్టు) నల్లగున్నది' అని గాయిన అన్నడు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** బ.దశమి పూర్తి (24గంటలు), **నక్షత్రం:** పుబ్బ రా.8.30 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** తె.4.03 నుండి 5.44 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.07 వరకు తదుపరి ప.12.06 నుండి 12.51 వరకు, **అమృతఘడియలు:** ప.1.34 నుండి 3.20 వరకు.

సూర్యోదయం : 6.09
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ మీడియా

స్వాగతించాల్సిన నిర్ణయం



భిన్న దేశాలకు చెందిన 15 లక్షల మంది పర్యాటకులను 'ఫిఫా' ప్రపంచ కప్ ఎంజాయ్ చేసేందుకూ, తన ఘన సంస్కృతిని అన్వేషించేందుకూ ఖతార్ స్వాగతిస్తోంది. మధ్య ప్రాచ్యంలో నిర్వహిస్తున్న తొలి ప్రపంచ కప్ ఇది. మొత్తం ఆసియాలో రెండోది. ఖతార్ నాయకత్వాన్ని అభినందిస్తున్నాను.

– సుహైల్ షాహీన్, అఫ్గానిస్తాన్ ప్రతినిధి

మోసపు కథ



ఏ యువకుడైనా కొంత ఉదారవాది, ఫన్–లవింగ్, ఈజీ గోయింగ్ భాగస్వామిని కోరుకుంటాడు. ముస్లిం అబ్బాయిలకు ఇలాంటి భాగస్వామి తమ సమాజంలో దొరకడం కష్టం. అఫ్తాబ్ కేసు లవ్ జిహాద్ కాదు. సులభంగా విశ్వసించే గుణం ఉన్న యువతి స్థితిని ఒక దుష్టుడు అడ్వాంటేజీ తీసుకోవడం!

– మోహన్ సిన్హా, రచయిత

తక్కువేనా?



బాంద్రాలోని ఒక 2-బీహెచ్‌కే ఇంటిని మూడు కోట్ల రూపాయలకు అమ్మకానికి పెట్టారు. ధర చూస్తే పిచ్చెక్కడం లేదూ! ముంబయి రియల్ ఎస్టేట్ ధరలూ, 'మూడు కోట్లంటే తక్కువే కదా' అనే జనాలూ అర్థం కావడం లేదు.

– ఋతుపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మన 'సీమ'ది ఘన చరిత్ర

సందర్భం


మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

రాయలసీమ ప్రాంతం ఆది నుంచి అనాథ కాదు. నాటి నిజాం, ఆంగ్లేయుల పాలనతోనే కరువుసీమగా మారింది. నిజాం తమ అవసరాల కోసం సీమ ప్రజల అభిమతంతో సంబంధం లేకుండా ఈ ప్రాంతాన్ని ఆంగ్లేయులకు వదిలిపెట్టినారు. అలా సీడెడ్ ప్రాంతంగా, దత్తమండలాలుగా పిలవబడ్డ సీమకు రాయలసీమ అని నామకరణం జరిగిన రోజు 1928 నవంబర్ 18.

1800 సంవత్సరానికి పూర్వం రాయలసీమ రతనాల సీమ. రాక్షసి తంగడి యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం పతనం కావడం, వరుస దాడుల కారణంగా నైజాం నవాబు పాలనలోకి సీమ ప్రాంతం నెట్టబడింది. మరాఠాలతో యుద్ధ భయం ఉన్న నిజాం ఆంగ్లేయులతో సైనిక సహకార ఒప్పందం చేసుకున్నాడు. అందుకు ఆంగ్లేయులకు తగిన పరిహారం ఇవ్వలేక సీమ ప్రాంతాన్ని ఆంగ్లేయులకు వదిలివేసినాడు. బలమైన సైనిక సామర్థ్యం ఉన్న ఆంగ్లేయుల ముందు బలహీనమైన పాలెగాళ్లు నిలువలేకపోయినారు. అయినా ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించిన సీమ పాలెగాళ్లు తొలి స్వాతంత్ర్యోద్యమాన్ని నిర్వహించారు. అయినా ఈనాటికీ వారికి ఆ స్థానం లభించలేదు. ఆంగ్లేయులకు నైజాం వదిలించుకున్న ప్రాంతం కావడం వలన దీన్ని సీడెడ్ జిల్లాలుగా పిలిచారు. తెలుగులో దత్తమండలం అని పిలిచినా, సీడెడ్ అన్న పదానికి దత్త మండలం అన్న అర్థం సరికాదు. వదిలి వేయించుకున్న ప్రాంతం అనడం కన్నా, ఆంగ్లేయులు దత్తత తీసుకున్న ప్రాంతం అని పిలిస్తే సీమ ప్రజల మన్ననలను పొందవచ్చు అన్న ఉద్దేశం కావచ్చు.

నంద్యాల సభలో కీలక నిర్ణయం

1913లో ప్రారంభమైన ఆంధ్ర మహసభలు 1928లో నవంబర్ 17,18 తేదీలలో నంద్యాలలో జరిగాయి. రెండు రోజుల సభలలో ఒక రోజు దత్తమండలం సమస్యలపై అవకాశం ఇస్తేనే సహకరిస్తామన్న ఈ ప్రాంత నేతల ఒత్తిడి మేరకు 18న కడప కోటిరెడ్డి అధ్యక్షతన ప్రథమ దత్తమండల సమావేశం జరిగింది. అందులో పాల్గొన్న చిలుకూరి నారాయణరావు గొప్ప చరిత్ర కలిగిన ఈ ప్రాంతానికి దత్త ప్రాంతం అన్న పేరు బాగుండదనీ, రేనాడు రాజులు, విజయనగర రాజులు పాలించిన నేపథ్యం ఉన్నందున రాయలసీమ అన్న పేరు ఉంటే బాగుంటుందనీ ప్రతిపాదించినారు. దాన్ని పప్పూరి రామాచార్యులు బలపరచడంతో సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. నాటి నుంచి రాయలసీమ పేరు వాడుకలోకి వచ్చింది.

అన్నమయ్య, వేమన లాంటి గొప్ప వ్యక్తులు పుట్టిన ప్రాంతం రాయలసీమ. పప్పూరి తెలుగు ప్రజలు గర్వించదగ్గ దేశభక్తుడు. వారి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే సముచితంగా ఉంటుంది. తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి అని తెలుస్తున్నా, ఆ వైపుగా కేంద్రం దగ్గర అధికారిక గుర్తింపు వచ్చేలా ప్రయత్నం చేయాలి. గత ప్రభుత్వం దైవ కార్యక్రమం అయిన కృష్ణ పుష్కరాలను నది ప్రారంభమైన శ్రీశైలం దగ్గర కాకుండా సముద్రంలో కలిసే దగ్గర నిర్వహించింది. అదే వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణ ముఖ ద్వారం ఉన్న మహబూబ్ నగర్ జిల్లాలో కూడా పుష్కరాలు నిర్వహించారు. శ్రీశైలంలో నిర్వహిస్తే ప్రజలు పాల్గొని మన రాయలసీమలో పుష్కలంగా నీరు ప్రవహిస్తుందన్న చైతన్యం ప్రజలలో వస్తుంది.

1928లో రాయలసీమ అని నామకరణం జరిగిన సమయంలోనే, ఆంధ్రప్రాంతంతో కలిపి మద్రాసు నుంచి



తెలుగు రాష్ట్రంగా విడిపోవాలన్న చర్చలు నడుస్తున్న రోజులలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అనంతపురంలో స్థాపించాలని 1926లో జరిగిన ఆంధ్ర మహాసభ తీర్మానాన్ని, మద్రాసు శాసనసభ తీర్మానాన్ని సైతం ఉల్లంఘించి అనంతలో ఉండాల్సిన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మొదట విజయవాడ, అటు పిమ్మట వైజాగ్ తరలించారు. గత అనుభవాన్ని మరిచి అమాయక సీమ పెద్దలు శ్రీభాగ్ ఒప్పందం అవగాహనతో ఆంధ్ర రాష్ట్రంగా ఉండటానికి ఇష్టపడ్డారు. రాష్ట్రం ఏర్పడిన మూడు సంవత్సరాలకే తెలంగాణతో కలిపి ఆంధ్రప్రదేశ్‌గా మారినపుడు పెద్దమనుషుల ఒప్పందంలో కుదిరిన 'కర్నూలు రాజధాని' డిమాండును వదులుకున్నారు. కీలక సమయం వచ్చినపుడు తప్పటడుగుల కారణంగా రాయలసీమ తీవ్రంగా నష్టపోయింది. మళ్లీ 2014లోనైనా సీమకు రాజధాని రావాల్సి ఉంది. కానీ కనీసం హైకోర్టు కూడా రాలేదు.

వికేంద్రీకరణలో న్యాయం జరగాలి...

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వికేంద్రీకరణ విధానంలో భాగంగా రాజధానిలోని మూడు కీలక వ్యవస్థలను మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టుతో బాటు న్యాయ స్వభావం ఉన్న కార్యాలయాలను కర్నూలులో నెలకొల్పడానికి ముందుకు వచ్చారు. ఈ వెసులుబాటును కూడా రాయలసీమకు రావాడాన్ని వ్యతిరేకించే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూనే మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలి. 'కేఆర్ఎంబీ'ని కర్నూలులో ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వంలో రోజువారీ సమీక్షతో సంబంధం లేని పలు కమిషనరేట్‌లు రాయలసీమలో ఏర్పాటు చేయాలి. ప్రత్యేకంగా శ్రీభాగ్ ఒప్పందంలో కీలకమైన కృష్ణా, తుంగభద్ర నీటిని రాయలసీమకు అందించేలా ప్రాజెక్టుల నిర్మాణం చేయాలి. అది జరగాలంటే సిద్ధేశ్వరం, గుండ్రేవుల, పోతిరెడ్డిపాడు వెడల్పు, కాల్వల సామర్థ్యం పెంపు, చెరువుల పునరుద్ధరణ పనులు జరగాలి. కృష్ణా నీటిలో ఏపీ వాటానుంచి తమకు అధికంగా కేటాయింపులు కావాలని తెలంగాణ ప్రభుత్వం పోరాడుతున్న సమయంలో రాయలసీమ ప్రాజెక్టులైన గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ నిర్మాణం పూర్తి చేసి, రాష్ట్రానికి నీటి అవసరాల ప్రాధాన్యతను కోర్టుల ముందుంచాలి. లేకపోతే రాయల సీమ ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపు ప్రశ్నగా మిగిలిపోతుంది.

వ్యాసకర్త సమన్వయకర్త,
రాయలసీమ మేధావుల ఫోరం । 94904 93436
(నేడు 'రాయలసీమ'గా నామకరణం జరిగిన రోజు)

స్వప్న ఫలం

'భగవంతుడు కలలో కనిపిస్తే దానికి ఫలం ఏమిటి?' అన్న ప్రశ్నకు పెద్దలు 'తస్మిన్నేవ దృఢాభక్తిః జాయతే తస్య సంతతం' అని సమాధానం చెప్పారు. ఆ కలగన్న వారికి ఆ ఇష్టదైవం మీద భక్తి మరింత దృఢమౌతుంది అని. నిజమైన భక్తులు నిరంతరం భగవంతుడిని కోరేది 'నీ పాద కమలసేవలో మునిగి ఉండే నిత్యానంద స్థితి కావా'లని.

భగవచ్చింతనలో ఎక్కువ సమయం గడిపే భాగవతులకూ, తీవ్రమైన శ్రద్ధతో తీర్థయాత్రలు చేసేవారికీ, మహాకావ్యాల రచన గురించి మథనపడుతున్న కవీశ్వరులకూ, దేవాలయ నిర్మాణాల లాంటి బృహత్కార్యాలను నిర్వహించగల సమర్థులకూ, ఇష్టదైవం కలలో కనిపించి ఉపదేశమో, ఆదేశమో, మార్గనిర్దేశమో చేసిన ఉదంతాలెన్నో చరిత్రలో నమోదై ఉన్నాయి. ముక్కోటి ఏకాదశి నాడు ఉపవాసం చేసి, శ్రీకాకుళ ఆంధ్రవిష్ణువును దర్శించుకొని నిద్రించిన శ్రీకృష్ణ దేవరాయలకు, ఆ రాత్రి కలలో స్వామి సాక్షాత్కరించాడట. గోదాదేవి కథను కమనీయమైన కావ్యంగా రచించి, తన మరొక రూపమైన వేంకటపతికి అంకితం చేయమన్నాడట.

మర్నాడు ఉదయం నిద్రలేస్తూనే, రాయలవారు దైవజ్ఞులను రావించి, ఆ స్వప్నఫలం చెప్పమని కోరాడు. 'రాజా, నారాయణుడు స్వప్నంలో స్వయంగా సాక్షాత్కరించాడు. అంటే నీకు భక్తి ఇతోధికంగా (ఇంతకు మునుపు కంటే ఎక్కువగా) కలుగుతుంది. ఆయనే కావ్యం రాయమన్నాడు. కనక, నీకు ఇతోధికంగా అగాధ సారస్వత ఉద్బోధం (లోతయిన పాండిత్య ప్రాప్తి) కలుగుతుంది. లక్ష్మీ సమేతంగా కనిపించాడు, కాబట్టి 'అఖండ భాండాగార' సమృద్ధి కలుగుతుంది. కనక నిశ్చింతగా సాహితీ సమరాంగణ సార్వభౌముడివై సామ్రాజ్య పాలనతో పాటు, సత్కావ్య రచన కూడా ఆరంభించమని' చెప్పారు ఆస్థాన పండితులు. తథాస్తు దేవతలు కూడా తలలు ఊపారు కాబోలు, ఆముక్త మాల్యద అవతరించింది!

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా

విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని చినగంజాం–కరవది సెక్షన్‌లో మూడో లైన్‌లో విద్యుదీకరణ, ఇంటర్ లాక్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ నెల 19, 20, 21, 22, 25 తేదీల్లో విజయవాడ–ఒంగోలు(07461/07576) రైలు, 19 నుంచి 21 వరకు విజయవాడ–గూడూరు (07500/07458) రైలు, 19 నుంచి 22 వరకు విజయవాడ–బిట్రగుంట (07978/07977), విజయవాడ–గూడూరు (17260/17259) రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇది కదా జగనన్న పాలన..



జల్లు చంద్రమౌళికి బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అర్హత మాత్రమే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందనడానికి ఇది మరో ఉదాహరణ. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉర్లాంలో టీడీపీ సీనియర్ నాయకుడు, తెలుగు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జల్లు చంద్రమౌళికి మూడు న్నరేళ్లుగా ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తోంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఈ విషయాలన్నీ వివరించారు. చంద్రమౌళికి రైతు భరోసా కింద రూ. 38,500, సున్నా వడ్డీ కింద రూ.1,168, వైఎస్సార్ ఆసరా కింద రూ.11,640 ప్రయోజనం కలిగినట్లు వివరించారు. ఈ మేరకు బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే కృష్ణదాస్ జల్లు చంద్రమౌళికి ఇచ్చారు. ఇది కదా జగనన్న పాలన అంటే.. అని స్థానికులు చర్చించుకున్నారు.

భార్యను కత్తితో నరికి... మృతదేహానికి పూలమాల వేసి...

- తెనాలిలో ఓ భర్త కిరాతకం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు



ఘటనాస్థలంలో పూలమాలలు వేసి ఉన్న స్వాతి మృతదేహం (ఇన్‌సెట్‌లో) స్వాతి (ఫైల్)



నిందితుడు వెంకటకోటయ్య

తెనాలిరూరల్: ఓ వ్యక్తి తన భార్యను బతికున్నంతకాలం అనుమానంతో వేధించాడు. చివరికి ఆమెను కత్తితో నరికి చంపేశాడు. రక్తపుమడుగులో పడి ఉన్న మృతదేహంపై మాత్రం పూలు, పూలమాలలు ఉంచి నివాళి అర్పించాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ ఘటన గురువారం జరిగింది. తెనాలికి చెందిన స్వాతి (38)కి, ప్రకాశం జిల్లా పుల్లలచెరువుకు చెందిన లారీ డ్రైవర్ కాకర్ల వెంకట కోటయ్యతో సుమారు 17 ఏళ్ల కిందట వివాహమైంది. తెనాలిలో నివాసం ఉంటున్న వీరికి ఇంటర్, తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో స్వాతి పట్టణంలోని ఓ బ్యూటీ పార్లర్‌లో పని చేస్తూ అక్కడే బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంది. తొలుత తెనాలిలోని పాండురంగపేటలో ఉన్న వీరు ఇటీవల నాజరుపేటలో మరో అద్దె ఇంట్లో చేరారు. ప్రస్తుతం స్వాతి నందులపేట ఘంటావారివీధిలో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో స్వాతికి మరో యువకుడితో అక్రమ సంబంధం ఉందని వెంకట కోటయ్యకు అనుమానం ఏర్పడింది. భార్యతో తరచూ గొడవపడేవాడు. ఇటీవల ఇద్దరికీ ఘర్షణ జరగగా, స్వాతి పుట్టింటికి వెళ్లిపోయింది. కొద్దిరోజుల కిందట ఆమెను మళ్లీ తన వద్దకు తీసుకువచ్చిన వెంకట కోటయ్య తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. భార్యపై మరింత అనుమానం పెంచుకుని వేధిస్తూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో గురువారం స్వాతి బ్యూటీ పార్లర్‌లో ఉండగా, మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వెంకట కోటయ్య వెళ్లి గొడవపడి కత్తితో ఆమె ముఖం, మెడపై విచక్షణారహితంగా దాడి చేశాడు. స్వాతి అక్కడికక్కడే మృతిచెందింది. వెంకట కోటయ్య ముందుగానే తెచ్చుకుని బయట ఉంచిన పూలు, పూలమాలలను రక్తపు మడుగులో పడి ఉన్న స్వాతి మృతదేహంపై వేసి నివాళి అర్పించాడు. అనంతరం తాము అద్దెకు ఉండే ఇంటి సమీపంలోని తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భార్యను హత్య చేసినట్లు చెప్పి లొంగిపోయాడు. రూరల్ పోలీసులు ఈ విషయాన్ని టూ టౌన్ పోలీసులకు తెలియజేయడంతో సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్ఐ శివరామయ్య తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే స్వాతి హత్య జరిగినట్లు తెలుస్తోందని సీఐ తెలిపారు. తన కుమార్తె స్వాతిపై అనుమానంతోనే భర్త కోటయ్య ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఆమె తండ్రి వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ విషయమై ఇద్దరూ తరచూ గొడవపడేవారని తెలిపారు.

మార్క్‌అప్ ఉత్పత్తుల అమ్మకాలు పెంచాలి

మార్క్‌ఫెడ్ ఎండీ ప్రద్యుమ్న



కొరిటిపాడు(గుంటూరు): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు బజార్లలో మార్క్‌ఫెడ్ అనుబంధ సంస్థ మార్క్‌అప్ ఆధ్వర్యంలో విక్రయించే నిత్యావసర ఉత్పత్తుల అమ్మకాలను పెంచాలని మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్, మార్కెటింగ్‌శాఖ ప్రత్యేక కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. గుంటూరు మార్కెట్ యార్డులోని సమావేశ మందిరంలో మార్క్‌అప్ ఉత్పత్తుల అమ్మకాలపై రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్క్‌అప్ ప్రతినిధులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రద్యుమ్న మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు రైతుల నుంచి సేకరిస్తున్న ఆహార ఉత్పత్తుల అమ్మకంలో నష్టాలను అధిగమించే లక్ష్యంతోనే మార్క్‌ఫెడ్ రిటైల్ రంగంలోకి అడుగుపెట్టిందన్నారు. రైతుల నుంచి సేకరించే ఉత్పత్తులతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఇతర నిత్యావసర సరుకులను కూడా విక్రయించడం వల్ల అదనపు లబ్ధి చేకూరుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో 110 రైతు బజార్లున్నాయని, అన్ని రైతు బజార్లలో మార్క్‌అప్ ఉత్పత్తుల అమ్మకాలు పెరిగేలా చూడాలని ఆదేశించారు. రైతు బజార్లలోని రైతులకు కేటాయించిన కూరగాయల షాపుల్లో తప్ప మిగిలిన అన్ని షాపుల్లో మార్క్‌అప్ ఉత్పత్తులు విక్రయించేలా చూడాలన్నారు. ఏపీ రైతు బజార్ల సీఈవో ముల్లంగి నందకిషోర్, మార్క్‌అప్ ప్రతినిధి ఆదినారాయణ, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్లు కె.శ్రీనివాసరావు, రామాంజనేయులు, ఏడీఎంలు, డీడీఎంలు, రాష్ట్రంలోని అన్ని రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు తప్పిన ముప్పు



గద్వాల స్టేషన్‌లో నిలిచిపోయిన రైలు

కర్నూలు (రాజ్‌విహార్): కర్నూలు నుంచి సికింద్రాబాద్‌కు వెళుతున్న తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ (17024)కు ముప్పు తప్పింది. గురువారం మధ్యాహ్నం 3:05 గంటలకు రైలు కర్నూలు నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరింది. గద్వాల స్టేషన్ వద్ద రైలు ఇంజన్‌కు ఉన్న లింక్ హుక్ తెగిపోవడంతో బోగీలు విడిపోయాయి. అప్రమత్తమైన లోకో పైలెట్ రైలును నెమ్మదించి ఆపై నిలిపివేశారు. దీంతో ఇంజన్ సుమారు 10 మీటర్ల దూరం వెళ్లి నిలిచిపోయింది. రైల్వే అధికారులు మరో ఇంజన్‌కు బోగీలను అమర్చి పంపించారు. దీంతో రైళ్ల రాకపోకలకు గంటకు పైగా అంతరాయం ఏర్పడింది.

చాగంటికి గురజాడ విశిష్ట పురస్కారం



విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వెంకట అప్పారావు విశిష్ట పురస్కారాన్ని ఈ ఏడాది ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుకు అందజేస్తున్నట్లు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. విజయనగరంలోని గురజాడ స్వగృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఏటా నవంబర్ 30న గురజాడ సాహితీ చైతన్యోత్సవం పేరిట నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జేవీ సోమయాజులు, గొల్లపూడి మారుతీరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి, వంశీ, తనికెళ్ల భరణి, ఎస్పీ బాలు వంటి ప్రముఖులకు పురస్కారం అందజేసినట్లు చెప్పారు. రెండేళ్లుగా కోవిడ్ కారణంగా పురస్కారాలను అందజేయలేకపోయామని, 2022 సంవత్సరానికి గాను చాగంటికి గురజాడ పురస్కారం అందజేస్తామన్నారు. సమాఖ్య అధ్యక్షుడు పీవీ నరసింహరాజు (బుచ్చిబాబు), కోశాధికారి డాక్టర్ ఎ.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రామా కంపెనీ ఆర్టిస్టులతో అమరావతి ఉద్యమం

- 781వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: డ్రామా కంపెనీ ఆర్టిస్టులతో కొనసాగిన అమరావతి ఉద్యమం, దొంగ యాత్రలు అర్ధంతరంగా ముగిసిపోయాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 781వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో భ్రమరావతిని సృష్టించి రూ.లక్షల కోట్లు దోచుకున్న చంద్రబాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కులవాదంతో ఓ సామాజికవర్గం చేస్తున్న తప్పుడు ప్రచారానికి ప్రజల ఓట్లు రాలవన్నారు. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి కోసం 5 కోట్ల మంది ప్రజల అభీష్టం మేరకు మాత్రమే ప్రభుత్వం మూడు రాజధానుల నిర్ణయం తీసుకుందనేది బహిరంగ సత్యమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లోనూ పరాజయం పాలయితే తనను జనం ఎక్కడ తరిమికొడతారో అనే భయంతోనే బాబు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, పులిదాసు, ఈపూరి ఆదాం పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 30 గంటలు



తిరుమల: తిరుమలలో 25 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేని వారికి 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. బుధవారం అర్ధరాత్రి వరకు 74,412 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 27,626 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.27 కోట్లు వేశారు.

ప్రతి రెండు సెకన్లకో మరణం

- అంటు వ్యాధులు కాదు.. అంతం చేస్తున్న జీవనశైలి వ్యాధులు
- ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న శ్వాసకోశ, గుండెపోటు, మధుమేహం, కేన్సర్ బాధితులు
- 2030 నాటికి ఏటా ఈ మరణాలు 5.5 కోట్లకు చేరే అవకాశం
- ప్రస్తుతం భారత్‌లోనే ఏటా సుమారు 60 లక్షల మంది మృతి
- మొత్తం మరణాల్లో 74 శాతం ఈ కోవలోనివే..
- సరైన జాగ్రత్తలు పాటిస్తే వీటిని నియంత్రించవచ్చంటున్న నిపుణులు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ప్లేగు.. మలేరియా.. మశూచి వంటివి ఒకప్పుడు లక్షల ప్రాణాలు బలితీసుకున్నాయి. అవి ఒకరి నుంచి ఒకరికి వేగంగా సోకే లక్షణమున్న అంటు వ్యాధులు కావడం.. టీకాలు, మందుల్లాంటివి లేకపోవడమే దానికి కారణం. తర్వాత టీకాలొచ్చాయి.. మందులూ అందుబాటులోకి వచ్చాయి. అంటువ్యాధులతో ప్రాణాలు కోల్పోవడం తగ్గింది. కానీ మనిషిని మరో ప్రమాదం చుట్టుముడుతోంది. అది కొత్త ముప్పేమీ కాదు.. ప్రభుత్వాల నిర్లక్ష్యం, ప్రజల్లో అవగాహన లేమి, జీవనశైలి మార్పుల పుణ్యమా అని విజృంభిస్తున్న అసాంక్రమిక వ్యాధులు.. గుండెపోటు, మధుమేహం, కేన్సర్లు, శ్వాసకోశ సమస్యలే అవి. ఇప్పుడివే సరికొత్త సవాళ్లు విసురుతున్నాయి.

మీకు తెలుసా.. మీరు ఈ రెండు పదాలు చదివేలోపు భూమ్మీద ఓ ప్రాణం అసాంక్రమిక వ్యాధుల కారణంగా గాల్లో కలిసిపోయి ఉంటుంది. అవును.. ఇది నిజం. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం అసాంక్రమిక వ్యాధుల కారణంగా ఏటా 4.1 కోట్ల మంది మరణిస్తున్నారు. ఓపికగా లెక్కేస్తే.. ఇది రెండు సెకన్లకు ఒక్కరని స్పష్టమవుతుంది. ప్రపంచం మాటిలా ఉంటే.. ఇప్పటికే గుండెజబ్బులు, మధుమేహానికి రాజధానిగా మారిన భారత్‌లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. అసాంక్రమిక వ్యాధుల కారణంగా ఇక్కడ ఏటా సుమారు అరవై లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నిజానికి అసాంక్రమిక వ్యాధులతో ఇన్ని విలువైన ప్రాణాలు కోల్పోవాల్సిన అవసరమే లేదు. ఈ వ్యాధులు ఒక రకంగా మనం కోరి తెచ్చుకున్నవే. ప్రజల్లో ఆరోగ్యంపట్ల ఏ కొంచెం అవగాహన పెరిగినా కొన్ని లక్షల ప్రాణాలను కాపాడుకోవచ్చు. ప్రభుత్వాలు ఆరోగ్యంగా జీవించేందుకు అనువైన పరిస్థితులను కల్పిస్తే, ప్రోత్సహిస్తే.. తగిన విధానాలను రూపొందిస్తే ఆగే అకాల మరణాల సంఖ్య కోట్లలో ఉంటుంది. ఈ సంఖ్యలేవీ గాల్లోంచి పుట్టుకొచ్చినవి కావు. సాక్షాత్తు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలేసి చెప్పినవే! అసాంక్రమిక వ్యాధుల మరణాల్లో అల్ప, మధ్యాదాయ వర్గాల వాటా దాదాపు 86 శాతం. అంటే తగిన వైద్య సదుపాయాల్లేని పరిస్థితుల్లో పేదలే ఎక్కువగా బలవుతున్నారన్నమాట. ప్రపంచ సగటు ఆయుర్దాయం 2022లో 72.98 ఏళ్లకాగా.. అల్ప, మధ్యాదాయ దేశాల్లో బాగా తక్కువగా ఉండటం గమనార్హం.

వ్యాధుల నివారణకు చర్యలు అవసరం

అసాంక్రమిక వ్యాధులు పెచ్చరిల్లేందుకు ప్రధాన కారణం ఆహార అలవాట్లు. వాటి నియంత్రణతోపాటు వ్యాయామం, దురలవాట్లకు దూరంగా ఉండటం అవసరం. ప్రభుత్వాలు కాలుష్య రహిత నగరాలను ప్రోత్సహించాలి. అందరికీ ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని.. అసాంక్రమిక వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. బాధితుల్లో సగమందికిపైగా తమకు రక్తపోటు, మధుమేహం వంటివి ఉన్నట్టు తెలియడం లేదని ఇటీవలి అధ్యయనం ఒకటి చెబుతోంది. ప్రజల్లో ఆరోగ్యంపై ఉన్న అవగాహనకు ఇదో మచ్చుతునక. అసాంక్రమిత వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే మరణాలు తగ్గించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జీవితంలో మంచి ఉత్పాదక స్థితిలో ఉన్న ముప్పై ఏళ్లవారి నుంచి 70ఏళ్లవారి వరకూ అసాంక్రమిక వ్యాధుల బారిన పడకుండా చూసుకోవడం కష్టమేమీ కాదు. పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించడం ద్వారా వారిని ఈ అసాంక్రమిక వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. తద్వారా వారు తమ కుటుంబాలను సొంతంగా పోషించుకోగలరు. సామాజిక ఉత్పాదకతకూ భంగం ఏర్పడదు. అసాంక్రమిక వ్యాధుల బారినపడి చికిత్స, పోషణ తాలూకూ ఖర్చులు ప్రభుత్వంపై పడటం ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకువస్తే.. ప్రధానమైన ఈ నాలుగు అసాంక్రమిత వ్యాధుల నుంచి వారిని కాపాడవచ్చు.

భారత్‌లో పరిస్థితి ఇదీ..

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం.. భారత్‌లో సంభవిస్తున్న మరణాల్లో అసాంక్రమిత వ్యాధుల వల్లే 60.46 లక్షల మరణాలు (66 శాతం) నమోదవుతున్నాయి. ఇందులో గుండె సంబంధిత వ్యాధులతో 25.66 లక్షలు (28శాతం), తీవ్ర శ్వాసకోశ వ్యాధులతో 11.46 లక్షల (12 శాతం) మంది మరణిస్తున్నారు. ఇక కేన్సర్‌తో 9.20 లక్షల మంది, మధుమేహంతో 3.46 లక్షల మంది మరణిస్తున్నట్టు చెబుతున్నాయి.

ప్రపంచంలో పరిస్థితి ఇదీ..

ప్రపంచవ్యాప్తంగా మొత్తం మరణాల్లో 74 శాతం అసాంక్రమిక వ్యాధులతో సంభవిస్తున్నవే. ఏటా వీటితో దాదాపు 4.1 కోట్ల మంది మరణిస్తున్నారు. గుండె జబ్బులతో మరణాలు 1.80 కోట్లు, కేన్సర్‌తో 93 లక్షలు, శ్వాస సంబంధ వ్యాధులతో 41 లక్షలు, మధుమేహంతో 20 లక్షల మరణాలు ఉంటున్నాయి. అంటే అసాంక్రమిక వ్యాధుల మరణాల్లో 80 శాతం ఈ నాలుగు రకాల వ్యాధులే ఉండటం గమనార్హం. ఈ మరణాల్లో పొగాకు వినియోగం వల్ల 80 లక్షలు, ఉప్పు అధికంగా తీసుకోవడం వల్ల 18 లక్షలు, ఆల్కహాల్‌తో 30 లక్షలు, సరైన శారీరక శ్రమ చేయకపోవడం వల్ల 8.3 లక్షల మరణాలు సంభవిస్తున్నాయి.

తిరుమల కొండపై ఇంధన పొదుపు

- టీటీడీ భవనాల్లో విద్యుత్ ఆదా చేసే ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు
- తక్కువ విద్యుత్ వినియోగించుకునే 100 పంపుసెట్ల ఏర్పాటుకు చర్యలు
- తద్వారా ఏటా రూ 2.68 కోట్ల విలువైన 3.81 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగులు
- టీటీడీ పాఠశాలలు, కాలేజీలలో 2.20 మెగా వాట్ల సోలార్ రూఫ్ టాప్ సిస్టం

సాక్షి, అమరావతి: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కొలువు దీరిన తిరుమల కొండపై విద్యుత్ ఆదా చేసేందుకు టీటీడీ చర్యలు ప్రారంభించింది. 2070 నాటికి మన దేశాన్ని కాలుష్యరహితంగా మార్చే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీ ఎస్ఈసీఎం) సహకారంతో టీటీడీకి చెందిన వివిధ భవనాలు, సంస్థల్లో విద్యుత్ పొదుపు కార్యక్రమాలను ప్రారంభించింది. ఇవి పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతోపాటు విద్యుత్‌పై టీటీడీ చేసే వ్యయాన్ని తగ్గించడంలో కూడా సహాయపడనున్నాయి.

3.81 మిలియన్ యూనిట్ల ఆదా

మొదటి దశలో శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీలో ఏపీ ఎస్ఈసీఎం, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో సుమారు వెయ్యి ఎల్ఈడీ లైట్లు, 400 బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంటు (బీఎల్‌డీసీ) ఫ్యాన్లను అమర్చారు. దీనివల్ల ఏటా 1.64 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతోంది. రెండో దశలో టీటీడీ భవనాల్లో ఉన్న 5 వేల సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో బీఎల్‌డీసీ ఫ్యాన్లను అమర్చేందుకు టీటీడీ, ఇంధన శాఖకు చెందిన ఏపీ సిడ్కో మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 0.88 మిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు అవుతుందని, తద్వారా టీటీడీ రూ.62 లక్షలను ఆదా చేయగలుగుతుందని అధికారులు చెబుతున్నారు. అంటే ప్రాజెక్ట్‌పై టీటీడీ చేసే పెట్టుబడి వ్యయాన్ని 14 నెలల్లో రాబట్టుకునే అవకాశం ఉంది. అలాగే ప్రస్తుతం ఉన్న 100 సంప్రదాయ పంపుసెట్ల స్థానంలో తక్కువ విద్యుత్ వినియోగించుకునే (స్టార్ రేటెడ్) పంపుసెట్లను అమర్చనున్నారు. ఇందుకోసం రూ.2.70 కోట్ల వ్యయం చేయనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రూ.2.68 కోట్ల విలువైన 3.81 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని భావిస్తున్నారు. 12 నెలల్లో పెట్టుబడి తిరిగిరానున్న ఈ ప్రాజెక్టుకు ఏపీ సిడ్కో ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది.



టీటీడీ కళాశాలలో అమర్చిన ఎల్ఈడీ లైట్లు

అత్యుత్తమ సేవలు



భవిష్యత్‌లో టీటీడీని మరింత పర్యావరణ హితంగా మార్చేందుకు, భక్తులకు, పర్యాటకులకు ఆహ్లాదకర, ఆరోగ్యకర వాతావరణాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఏపీ ఎస్ఈసీఎం, బీఈఈ సహకారంతో ఎల్ఈడీ లైట్లు, విద్యుత్‌ను ఆదా చేసే బీఎల్‌డీసీ ఫ్యాన్లను ఏర్పాటు చేస్తున్నాం. నెడ్‌క్యాప్ ద్వారా టీటీడీ పాఠశాలలు, అనుబంధ కళాశాలల్లో 2.20 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్ టాప్ సిస్టం పెడుతున్నాం.

– ఏవీ ధర్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, టీటీడీ

క్లుప్తంగా...

సౌదీ వీసా కోసం పీసీసీ అక్కర్లేదు

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాకు వెళ్లాలనుకునే భారతీయ పౌరులు వీసా కోసం ఇకపై పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) సమర్పించాల్సిన అవసరం లేదు. భారతీయులకు పీసీసీ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఢిల్లీలోని సౌదీ రాయబార కార్యాలయం గురువారం ప్రకటించింది. రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకునే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది.

బెంగాల్ గవర్నర్‌గా సీవీ ఆనంద బోస్



న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా సీవీ ఆనంద బోస్(71)ను నియమించినట్లు రాష్ట్రపతి భవన్ గురువారం తెలిపింది. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నియామకం అమల్లోకి వస్తుందని ఒక సర్క్యులర్‌లో తెలిపింది. మణిపూర్ గవర్నర్ గణేశన్ జూలై నుంచి పశ్చిమబెంగాల్‌కు తాత్కాలి గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బెంగాల్ గవర్నర్‌గా ఉన్న ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన విషయం తెలిందే. రిటైర్డు ఐఏఎస్ అధికారి అయిన బోస్ కేరళలోని కొట్టాయంకు చెందినవారు.

బినోయ్‌బాబు కస్టడీ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బినోయ్‌బాబు, శరత్‌చంద్రారెడ్డిలకు ఈడీ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. వారిద్దరి కస్టడీ ముగియడంతో గురువారం జడ్జి నాగ్‌పాల్ ముందు ఈడీ హాజరుపరిచింది. మరో వారం రోజులపాటు వీరిద్దరినీ కస్టడీకి అనుమతించాలని ఈడీలాయర్ కోరారు. దర్యాప్తు పేరుతో రాజకీయ కక్ష సాధిస్తున్నారని బినోయ్‌బాబు, శరత్‌చంద్రారెడ్డి తరఫు న్యాయవాదులు ఆరోపించారు. అనంతరం బినోయ్‌బాబు, శరత్‌చంద్రారెడ్డిలను నాలుగు రోజులపాటు కస్టడీకి అనుమతించిన ధర్మాసనం తదుపరి విచారణను సోమవారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది.

జైన్‌కు చుక్కెదురు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు కోర్టులో చుక్కెదురైంది. ఆయనకు బెయిల్ నిరాకరించింది. నేరానికి సంబంధించిన వివరాలను ఉద్దేశపూర్వకంగా దాస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణవుతోందని ప్రత్యేక కోర్టు జడ్జి వికాస్ ధుల్ పేర్కొన్నారు. ఆయనతోపాటు సహనిందితులైన అంకుశ్ జైన్, వైభవ్ జైన్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్లను విచారించిన ప్రత్యేక కోర్టు జడ్జి ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించారు.

26న దేశవ్యాప్తంగా ఎస్‌కేఎం నిరసన ర్యాలీలు

న్యూఢిల్లీ: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేర్చకుండా దగా చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆరోపించింది. కేంద్రం వైఖరికి నిరసనగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌ల వరకు ర్యాలీలు నిర్వహిస్తామని గురువారం ప్రకటించింది. హరియాణాలోని కర్నాల్ పట్టణంలో డిసెంబర్ 8వ తేదీన సమావేశమై, భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేస్తామని వెల్లడించింది. మూడు నూతన వ్యవసాయ చట్టాల రద్దుకు ఏడాది నిండిన సందర్భంగా ఈ నెల 19న ఫతే దివస్(విక్టరీ డే) జరుపుకోనున్నట్లు పేర్కొంది.

'రాజీవ్' దోషుల విడుదలను పునఃసమీక్షించండి

న్యూఢిల్లీ: రాజీవ్ గాంధీ హత్య కేసులో ఆరుగురు దోషులను గడువుకు ముందే జైలు నుంచి విడుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వును పునఃసమీక్షించాలని సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు గురువారం పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో తాము(కేంద్రం) ఒక భాగమేనని, తమ వాదన వినకుండా దోషులను విడుదల చేయడం సబబు కాదని పేర్కొంది.కేసులో ప్రభుత్వాన్ని ఇంప్లీడ్ చేయకుండా దోషులు శిక్ష తగ్గింపును కోరారని వివరించింది. ఆరుగురు దోషులను జైలు నుంచి విడుదల చేస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 11న ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే.

మళ్లీ ఒడెసాపై రష్యా దాడులు

కీవ్: ఖేర్సన్‌ను కోల్పోయి ఆగ్రహంతో ఊగిపోతున్న రష్యా వాయుసేన ఉక్రెయిన్‌లోని దక్షిణప్రాంతం ఒడెసాపై విరుచుకుపడింది. ఒడెసాపై ఉక్రెయిన్ దాడిచేయడం గత కొన్ని వారాల్లో ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఒడెసా రీజియన్, నీప్రూ సిటీపై గగనతల దాడులతో స్థానికులను బెంబేలెత్తించింది. దీంతో బాంబు షెల్టర్లకు తరలిపోవాలని స్థానిక యంత్రాంగం పౌరులకు సూచించింది. వేర్వేరు ప్రాంతాల్లో క్షిపణులు, డ్రోన్ల దాడుల్లో గురువారం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఐరాస, తుర్కియే మధ్యవర్తిత్వంలో గతంలో ఉక్రెయిన్, రష్యాల మధ్య కుదిరిన ధాన్యం, ఎరువుల ఎగుమతి ఒప్పందాన్ని రెన్యువల్ చేస్తున్నట్లు ఐరాస ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెరస్ గురువారం ప్రకటించారు. నాలుగు నెలలపాటు నల్ల సముద్ర జలాల గుండా ఉక్రెయిన్ ఓడరేవుల నుంచి ప్రపంచదేశాలకు ధాన్యం, ఎరువుల సరఫరాపై గతంలో చేసుకున్న ఒప్పందం నవంబర్ 19వ తేదీతో ముగిసిపోనుంది. రెన్యువల్‌పై రష్యా స్పందించలేదు. ఒప్పందంలో కీలక మధ్యవర్తిగా ఉన్న తుర్కియే సైతం ఏం మాట్లాడలేదు.

బ్రిటిషర్లకు సావర్కర్ వత్తాసు

- క్షమాభిక్ష కోసం వారికి లేఖలు రాశారు
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- సావర్కర్ గొప్ప దేశభక్తుడన్న ఉద్ధవ్ ఠాక్రే
- పోలీసులకు సావర్కర్ మనవడి ఫిర్యాదు



అకోలాలో మీడియాతో మాట్లాడుతున్న రాహుల్

ముంబై/అకోలా: హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్(వీడీ) సావర్కర్ బ్రిటిష్ వలస పాలకులకు వంతపాడారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. జైల్లో ఉండగా క్షమాభిక్ష పెట్టాలంటూ వారికి లేఖలు కూడా రాశారని పేర్కొన్నారు. జోడో యాత్రలో భాగంగా గురువారం అకోలా జిల్లా వాడేగావ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. 1920లో బ్రిటిష్ పాలకులకు సావర్కర్ రాసినట్లున్న కొన్ని పత్రాలను ఆయన ఈ సందర్భంగా చూపారు. బ్రిటిషర్లకు సావర్కర్ రాసిన లేఖ కూడా తమ వద్ద ఉందన్నారు. ఆ లేఖలోని చివరి లైను..'నేను మీ అత్యంత విధేయుడైన సేవకుడిగా ఉంటానని వేడుకుంటున్నాను'అని ఉందని, దిగువన సావర్కర్ సంతకం కూడా చేశారని చెప్పారు. వలస పాలకులకు సావర్కర్ సాయం చేశారనేందుకు ఇదే సాక్ష్యమని రాహుల్ పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకులంటే భయంతోనే సావర్కర్ ఈమేరకు లేఖలు రాసినట్లు అవగతమవుతోందన్నారు. అదేసమయంలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్, నెహ్రూ లాంటి వారికి ద్రోహం చేశారని పేర్కొన్నారు. సావర్కర్‌పై తన వ్యాఖ్యలను తప్పుపడుతున్న శివసేన చీలిక వర్గం, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వానికి చేతనైతే మహారాష్ట్రలో జోడో యాత్రను అడ్డుకోవాలని సవాల్ విసిరారు. దేశంలో విద్వేషాలను, హింసను వ్యాపింపజేస్తోందంటూ బీజేపీని విమర్శించారు. జోడోయాత్రలో భాగంగా మంగళవారం వాషిమ్ జిల్లాలో జరిగిన సభలో కూడా సావర్కర్ పేరును రాహుల్ ప్రస్తావించారు. బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రతిరూపమంటూ వీడీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. 'అండమాన్‌లో రెండు మూడేళ్లు జైల్లో ఉండగానే సావర్కర్ క్షమాభిక్ష ప్రసాదించాలంటూ బ్రిటిషర్లకు లేఖలు రాయడం మొదలుపెట్టారు'అని పేర్కొన్నారు. 'తనను తాను ధైర్యవంతుడిగా చెప్పుకుంటూ మారుపేరుతో సావర్కర్ ఒక పుస్తకం కూడా రాసుకున్నారు. బ్రిటిషర్ల కోసం పనిచేస్తూ వారిచ్చిన పింఛను అందుకున్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేశారు'అని రాహుల్ చెప్పారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీకి చెందిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా స్పందించారు. సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారంటూ రాహుల్‌పై మండిపడ్డారు. ఇలా ఉండగా, అనుచిత వ్యాఖ్యలతో తన తాత వీడీ సావర్కర్‌ను రాహుల్ గాంధీ అవమానించారంటూ మనవడు రంజిత్ సావర్కర్ గురువారం ముంబైలోని శివాజీపార్క్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాహుల్ మాదిరిగానే వీడీ సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలేపైనా కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదులోని అంశాలపై విచారణ జరుపుతున్నామని, ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పారు. వందలాది మంది శివసేన షిండే వర్గం కార్యకర్తలు థానేలోని ఆనంద్‌మఠ్ వద్ద నిరసనకు దిగారు. నాగపూర్, నాసిక్‌లలో బీజేవైఎం కార్యకర్తలు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

సావర్కర్ గొప్ప దేశ భక్తుడు: ఉద్ధవ్ ఠాక్రే

సావర్కర్‌పై రాహుల్ వ్యక్తం చేసిన అభిప్రాయాలతో ఏకీభవించడం లేదని మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం సావర్కర్ పోరాడారని, ఆయన పట్ల తమకు ఎంతో గౌరవముందని చెప్పారు. సావర్కర్‌కు భారతరత్న పురస్కారం ఇప్పటిదాకా ఎందుకు ప్రకటించలేదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేని వారు సావర్కర్‌పై ప్రేమను వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలను ఉద్దేశించి ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. ఉద్ధవ్ కుమారుడు, మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే ఇటీవల రాహుల్‌తో కలిసి జోడోయాత్రలో పాల్గొన్న విషయం తెలిసిందే.

ప్రతినిధుల సభలో రిపబ్లికన్లదే పైచేయి

- రాబోయే రెండేళ్లు అధ్యక్షుడు జో బైడెన్‌కు సంకట స్థితి
- ఆయన నిర్ణయాలను ప్రతిపక్షం అడ్డుకొనే అవకాశం



బైడెన్

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో తుది ఫలితాలపై స్పష్టత వచ్చింది. 435 మంది సభ్యులున్న ప్రతినిధుల సభలో(హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ పైచేయి సాధించింది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. రిపబ్లికన్లు 218 సీట్లు, అధికార డెమొక్రాట్లు 211 సీట్లు గెలుచుకున్నారు. మరో 6 స్థానాల్లో ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది. అమెరికా పార్లమెంట్(కాంగ్రెస్)లో కీలకమైన ప్రతినిధుల సభలో ప్రతిపక్షం మెజారిటీ సాధించడం అధ్యక్షుడు జో బైడెన్‌కు కొత్త చిక్కులు తెచ్చిపెట్టనుంది. ఆయన పదవీ కాలం మరో రెండేళ్లు ఉంది. బైడెన్ నిర్ణయాలు, చర్యలను ప్రతిపక్షం నిలువరించే అవకాశం కనిపిస్తోంది. చట్టసభలో రిపబ్లికన్ పార్టీ బలం పుంజుకోవడంతో అధ్యక్షుడి దూకుడుకి అడ్డుకట్ట పడనుంది. ప్రతినిధుల సభలో రిపబ్లికన్లు మెజారిటీ సాధించడం 2018 తర్వాత ఇదే మొదటిసారి. ప్రతినిధుల సభ స్పీకర్‌గా రిపబ్లికన్లు తమ నాయకుడు కెవిన్ మెక్‌కర్తీని ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఈ పదవిలో డెమొక్రటిక్ పార్టీ నేత నాన్సీ పెలోసీ ఉన్నారు. కొత్త దిశ కోసం అమెరికన్లు సిద్ధంగా ఉన్నారని, రిపబ్లికన్లు వారిని ముందుకు నడిపించబోతున్నారని మెక్‌కర్తీ ట్వీట్ చేశారు. స్పీకర్‌గా ఎన్నికైన మెక్‌కర్తీకి ప్రతిపక్ష నేత, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు తెలియజేశారు. ప్రతినిధుల సభలోని రిపబ్లికన్లతో కలిసి పనిచేస్తానని ఉద్ఘాటించారు. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో తాను మళ్లీ పోటీ చేస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

సెనేట్‌పై డెమొక్రాట్ల పట్టు

మధ్యంతర ఎన్నికల ఫలితాలపై అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. అమెరికా ప్రజలు వారి ఆకాంక్షలను వ్యక్తం చేశారని చెప్పారు. ధరలు, జీవన వ్యయం తగ్గాలని వారు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎవరితోనైనా కలిసి పని చేస్తానని పేర్కొన్నారు. జనం ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా కాంగ్రెస్‌లోని మరో సభ అయిన సెనేట్‌లో అధికార డెమొక్రాట్లు పట్టు నిలుపుకొనే అవకాశం కనిపిస్తోంది. మొత్తం 100 స్థానాలకు గాను, వారు ఇప్పటిదాకా 50 స్థానాలు దక్కించుకున్నారు. జార్జియా రాష్ట్రం కూడా వారి ఖాతాలో పడనుంది. దీంతో సెనేట్‌లో మెజారిటీ సాధించబోతున్నారు.

ఈడీ డైరెక్టర్ పదవీ కాలం మరో ఏడాది పొడిగింపు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వ విచారణ సంస్థ అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా(62) పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 1984 బ్యాచ్ ఐఆర్‌ఎస్ అధికారి అయిన సంజయ్ కుమార్ మిశ్రా 2023 నవంబర్ 18వ తేదీ వరకూ లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసేదాకా ఆ పదవిలో కొనసాగుతారని వెల్లడించింది. ఆయన పదవీ కాలం పొడిగింపునకు కేంద్ర మంత్రివర్గ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదం తెలియజేసింది. 2018 నవంబర్ 19న ఈడీ డైరెక్టర్‌గా నియమితులైన సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని కేంద్రం ఇప్పటికే పలుమార్లు పొడిగించింది.



విక్రమ్-ఎస్ ప్రయోగం నేడే

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగాల్లో ప్రైవేట్ రంగానికి నాంది పలుకుతూ ప్రైవేట్‌రంగంలో రూపొందిన తొలి రాకెట్ విక్రమ్-ఎస్‌ను శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని సౌండింగ్ రాకెట్ ప్రయోగవేదిక నుంచి నింగిలోకి పంపేందుకు సర్వం సిద్ధమైంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ రూపొందించిన ఈ రాకెట్‌కు అంతరిక్ష ప్రయోగాలకు ఆద్యులైన డాక్టర్ విక్రమ్ సారాభాయ్ పేరిట విక్రమ్-ఎస్ అని నామకరణం చేశారు. ప్రైవేట్‌రంగంలో తొలి రాకెట్ కావడంతో దీనిని ప్రారంభ్ అని కూడా పిలుస్తున్నారు. ఈ రాకెట్ మూడు అతిచిన్న పేలోడ్లను అంతరిక్షంలోకి మోసుకెళ్లనుంది. ఈ పేలోడ్స్ రోదసీలో భూమికి అతి తక్కువ దూరం అంటే 81 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో ఉండి వాతావరణాన్ని అధ్యయనం చేస్తాయి. స్కైరూట్ ఏరోస్పేస్ రూపొందించిన విక్రమ్-ఎస్ రాకెట్ మొత్తం బరువు 545 కేజీలు. ఎత్తు ఆరు మీటర్లు. ఇది 83 కేజీల మూడు పేలోడ్స్‌ను నింగిలోకి మోసుకెళ్లనుంది. ఘన ఇంధనంతో కూడిన సింగిల్ స్టేజ్ రాకెట్ కావడం దీని ప్రత్యేకత. ఈ రాకెట్ ద్వారా స్పేస్‌కిడ్జ్ అనే ఏరోస్పేస్ స్టార్టప్ సంస్థకు చెందిన 2.5 కేజీల ఫన్-శాట్‌ను కక్ష్యలోకి పంపుతున్నారు. దీనిని ఐటీ విద్యార్థులు, అమెరికా, సింగపూర్, ఇండోనేసియా విద్యార్థులు సంయుక్తంగా తయారుచేయడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్-స్పేస్ టెక్, ఆర్మేనియాకు చెందిన బజూమ్‌క్యూ స్పేస్ రీసెర్చ్ ల్యాబ్‌కు చెందిన పేలోడ్లను రాకెట్ మోసుకెళ్లనుంది.

గడ్కరీకి అస్వస్థత



సిలిగురి: పశ్చిమబెంగాల్‌లో పర్యటన సందర్భంగా గురువారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సిలిగురిలో రూ.1,206 కోట్ల విలువైన మూడు జాతీయ రహదారి ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన్ను ఒంట్లో బాగోలేదని చెప్పడంతో వెంటనే స్థానిక ఎంపీ రాజు బిస్త ఇంటికి తీసుకెళ్లారు. వైద్యుల చికిత్స అనంతరం కొద్దిసేపటి తర్వాత ఆయన కారులో వెళ్లిపోయారని బీజేపీ ఎమ్మెల్యే నీరజ్ చెప్పారు. ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఈడీ ముందుకు హేమంత్ సోరెన్



రాంచీ: అక్రమ గనుల తవ్వకం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరయ్యారు. రాంచీ కార్యాలయంలో ఆయనను దాదాపు 9 గంటలకుపైగా ప్రశ్నించింది. ఈడీ కేసులో ప్రశ్నించేందుకు గతంలో ఆయనకు పలుమార్లు దర్యాప్తు సంస్థ సమన్లు జారీచేయగా వ్యక్తిగత, అధికారిక కారణాలు చూపుతూ ఇన్నాళ్లూ గైర్హాజరైన విషయం విదితమే. గురువారం రాంచీలోని ఈడీ కార్యాలయానికి వచ్చిన సోరెన్.. ఈడీకి ఒక లేఖ రాశారు. నిజాలేవిటో నిర్ధారించుకోకుండా 'సంచలన ప్రకటనలు' చేయొద్దని లేఖలో సూచించారు. 'మొత్తం జార్ఖండ్‌లో గత రెండేళ్లలో గనులు, ఖనిజాల తవ్వకం ద్వారా ప్రభుత్వానికి వచ్చింది కేవలం రూ.750 కోట్లు. మీరేమో రూ.1,000 కోట్ల అవినీతి జరిగిందంటున్నారు. ఇంతటి భారీ స్థాయిలో అవినీతి చేయాలంటే ఒక్క సాహెబ్‌గంజ్‌లోనే 8 కోట్ల మెట్రిక్ టన్నుల రాళ్లను తవ్వాలి. చట్టబద్ధంగా తవ్విన దానికంటే ఇది ఏకంగా నాలుగు రెట్లు ఎక్కువ. ఇది సాధ్యమా?' అంటూ లేఖలో సీఎం పేర్కొన్నారు. 'జేఎంఎం పార్టీ నుంచి నేను గెంటేసిన రవి కేజ్రీవాల్ బీజేపీ తరఫున మాట్లాడుతూ నాపై చేసిన ఆరోపణలు పూర్తిగా అబద్ధం. ఈ కేసును ఎలాంటి రహస్య అజెండా లేకుండా దర్యాప్తుచేయండి' అని ఈడీని కోరారు. తనపై బీజేపీ కుట్ర పన్నుతోందని అంతకుముందు మీడియాతో అన్నారు. దర్యాప్తును ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభావితం చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది.

నార్కో పరీక్షలకు కోర్టు అనుమతి

ఢిల్లీ హత్య కేసులో అఫ్తాబ్ కస్టడీ ఐదు రోజులు పొడిగింపు

ఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్య కేసులో నిందితుడైన అఫ్తాబ్ అమీన్ పూనావాలాకు నార్కో పరీక్షలు నిర్వహించడానికి గురువారం ఢిల్లీ కోర్టు అనుమతిచ్చింది. ఇందు కోసం మరో అయిదు రోజులు పోలీసు కస్టడీని పొడిగించింది. మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ శుక్లా నార్కో పరీక్షలకు నిర్వహించడానికి అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అఫ్తాబ్ విచారణ జరిగినప్పుడు కోర్టు వెలుపల భారీ సంఖ్యలో నిరసనకారులు చేరుకొని వెంటనే అతనిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. దీంతో అఫ్తాబ్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. పెళ్లి చేసుకొమ్మని ఒత్తిడి తెచ్చినందుకు తనతో సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్‌ను గొంతు నులిపి హత్య చేసి, ఆమె శరీరాన్ని 35 ముక్కలుగా కోసి, ఫ్రిజ్‌లో ఉంచి కొన్ని రోజుల పాటు దాచి తర్వాత అఫ్తాబ్ ఆ ముక్కలను పారేయడం తెలిసిందే. హత్యాయుధం దొరక్కపోవడంతో పోలీసులు నార్కో పరీక్షలకు అనుమతి కోరారు.

ముఖాన్ని కాల్చేసి..

పోలీసుల విచారణలో అఫ్తాబ్ అమీన్ ఒళ్లు జలదరించే విషయాలు బయటపెడుతున్నాడు. సాక్ష్యాధారాలు లేకుండా చేయడానికి ఎన్నో హేయమైన చర్యలకు దిగాడు. ఆమె ముఖం ఎవరూ గుర్తు పట్టకుండా కాల్చినట్టుగా పోలీసుల ఎదుట అంగీకరించాడు. కట్టెలా బిగుసుకుపోయిన మృతదేహం కొయ్యడానికి వీలుగా వేడినీళ్లలో బ్లీచింగ్ పౌడర్ కలిపి వేశానని, అప్పుడే శవాన్ని కొయ్యగలిగానని పోలీసులు దగ్గర చెప్పినట్టుగా తెలుస్తోంది. ఢిల్లీలో నెలకి 20వేల లీటర్ల వరకు నీళ్లు ఉచితమైనా అతని ఫ్లాట్‌కి నీటి బిల్లు రూ.300 పైగా రావడానికి కారణాలను కనుగొన్నారు. మృతదేహాన్ని కోస్తున్నప్పుడు చప్పుడు బయటకు వినిపించకుండా నీళ్ల పైపులు తిప్పి ఉంచాడని, ఇంట్లో మరకలు కనిపించకుండా తరచూ ఫ్లాట్‌ని కడిగేవాడని పోలీసులు విచారణలో తేలింది. వారిద్దరి మధ్య తరచూ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి గొడవలు అవుతూ ఉండేవని తెలుస్తోంది.



ఢిల్లీలోని మెహ్రౌలీలో శ్రద్ధా వాకర్‌కు హిందూ ఏక్తా మంచ్ కార్యకర్తల నివాళి

ఎంహెచ్17 విమాన ఘటనలో ముగ్గురికి యావజ్జీవం

స్కిఫోల్: 298 మంది మృతికి కారణమైన ఎంహెచ్17 మలేసియా ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ఘటనలో నెదర్లాండ్స్ కోర్టు ఇద్దరు రష్యన్లు, ఒక ఉక్రెయిన్ వేర్పాటువాదికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 2014 జూలై 17న నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డ్యామ్ నుంచి మలేసియాలోని కౌలాలంపూర్‌కు బయలుదేరిన బోయింగ్ 777 విమానాన్ని రష్యా అనుకూల ఉక్రెయిన్ వేర్పాటువాదులు బక్ మిస్సైల్ ప్రయోగించి, కూల్చేశారు. విమానం ఉక్రెయిన్ భూభాగంలో కూలిపోయింది. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సహా మొత్తం 298 మంది మరణించారు.

రూ. 10 వేలు కట్టండి.. ఖర్చులు భరించండి

- లిఫ్ట్‌లో చిన్నారిని కరిచిన పెంపుడు శునకం
- కుక్క యజమానికి గ్రేటర్ నోయిడా అథారిటీ జరిమానా

నోయిడా: బహుళ అంతస్తుల భవంతి లిఫ్ట్‌లో ఆరేళ్ల విద్యార్థిపై పెంపుడు శునకం దాడి ఘటనలో కుక్క యజమానిపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. చిన్నారి చేతికి గాయం కావడంతో చికిత్సకయ్యే ఖర్చంతా భరించాలని, మరో రూ.10,000 పరిహారంగా చెల్లించాలని ఆయనను గ్రేటర్ నోయిడా అథారిటీ ఆదేశించింది. గ్రేటర్ నోయిడా(పశ్చిమం)లోని విలాసవంత లా రెసిడెన్షియా సొసైటీలో మంగళవారం ఈ ఘటన జరిగింది. సొసైటీలో ఉండే ఒకావిడ తన కొడుకుతో కలిసి లిఫ్ట్‌లో వెళ్తుండగా అప్పుడే ఒకతను తన కుక్కతో సహా లిఫ్ట్‌లోకి వచ్చాడు. వచ్చీరాగానే బాలుడిని కుక్క కరిచేసింది. దీంతో సీసీటీవీ ఫుటేజ్ సాక్ష్యంతో ఐపీసీ సెక్షన్ 289 కింద కేసు నమోదుచేసినట్లు పోలీసులు చెప్పారు. 'కుక్కను అదుపుచేయడంలో మీరు విఫలమయ్యారు' అని అతడికి పంపిన నోటీసులో గ్రేటర్ నోయిడా అథారిటీ ఆరోగ్యవిభాగాధిపతి డాక్టర్ ప్రేమ్‌చంద్ పేర్కొన్నారు. రూ.10వేలు, చికిత్స ఖర్చు ఏడు రోజుల్లో చెల్లించకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

లాస్ ఏంజెలిస్ మేయర్‌గా నల్లజాతి మహిళ

చరిత్ర సృష్టించిన కరీన్ బాస్



లాస్ ఏంజెలిస్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భాగంగా జరిగిన లాస్ ఏంజెలిస్ మేయర్ పదవిని మొట్టమొదటిసారిగా ఒక నల్లజాతి మహిళ కైవసం చేసుకుంది. లాస్ ఏంజెలిస్‌కు ఒక మహిళ మేయర్ కావడం ఇదే తొలిసారి. 40 లక్షల జనాభా ఉన్న లాస్‌ఏంజెలిస్‌ను పలు సమస్యలు చుట్టుముట్టిన వేళ రిపబ్లికన్ అభ్యర్థి, కుబేరుడు రిక్ కరుసోపై డెమొక్రటిక్ మహిళా అభ్యర్థి కరీన్ బాస్ దాదాపు 47,000 ఓట్ల ఆధిక్యతతో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 70 శాతానికిపైగా ఓట్ల లెక్కింపు పూర్తవడంతో కరీన్ బాస్ గెలుపు దాదాపు ఖరారైనట్లే. రెండేళ్లక్రితం అధ్యక్ష ఎన్నికల వేళ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చెందిన ఉపాధ్యక్ష అభ్యర్థుల షార్ట్ లిస్ట్‌లోనూ కరీన్ పేరు ఉండటం గమనార్హం. లాస్ ఏంజెలిస్ మేయర్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా రిక్ కరుసో ఏకంగా దాదాపు రూ.817 కోట్లకుపైగా ఖర్చుపెట్టినట్లు వార్తలొచ్చాయి. 'ఈ ఎన్నికలు మనీకి సంబంధించినవి కాదు. మనుషులకు సంబంధించినవి' అని ప్రచారం సందర్భంగా కరీన్ బాస్ వ్యాఖ్యానించడం ప్రస్తావనార్హం.

ఆప్ సత్తా ఎంత?

- కింగ్ మేకరైనా అవుతారా?
- ఎవరి ఓట్లు కొల్లగొడతారు?

2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు గుజరాత్ మోడల్ గురించి నరేంద్ర మోదీ విస్తృతంగా ప్రచారం చేసి ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత ఇప్పుడు అదే తరహాలో నడుస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ గుజరాత్‌లో ఢిల్లీ మోడల్ అనే ప్రచారంతో దూకుడు ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ముక్కోణపు పోటీకి తెరతీశారు. ఇంతకీ ఆమ్ ఆద్మీ పార్టీ కింగా? కింగ్‌మేకరా? రానున్న ఎన్నికల్లో ఏం జరగబోతోంది?



గురువారం అహ్మదాబాద్‌లో ఓటింగ్‌పై పాఠశాల విద్యార్థినుల రంగోళీ

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ గుజరాత్ ఎన్నికల్ని స్వయంగా తన భుజస్కంధాలపై మోస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో పూర్తి స్థాయిలో దిగాలని నిర్ణయించిన దగ్గర్నుంచి వారానికి ఒకసారి రాష్ట్రానికి వస్తూ రోడ్డు షోలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆప్‌లో మరో నేత సందీప్ పాఠక్ బూత్ మేనేజ్‌మెంట్, సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షిస్తుంటే నిరంతరం సీట్ల వారీగా అంతర్గత సర్వేలు చేయిస్తూ వ్యూహాలు మార్చుకుంటూ ముందుకెళుతున్నారు.

సంక్షేమ మంత్రం

కొత్తగా గుజరాత్ గోదాలోకి దిగిన పార్టీ కావడంతో ప్రజల్ని తమవైపు ఆకర్షించడానికి ఆప్ సంక్షేమ మంత్రాన్ని జపిస్తోంది. ఢిల్లీ మోడల్ పరిపాలనను చూపిస్తూ విద్య, ఆరోగ్య రంగ రూపురేఖల్ని మార్చేస్తామని చెబుతోంది. గృహాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,, నిరుద్యోగ భృతి నెలకి రూ.3 వేలు, 18 ఏళ్ల వయసు పైబడిన మహిళలకు వెయ్యి రూపాయల ఆర్థిక సాయం, కొత్తగా ప్రాక్టీసు మొదలు పెట్టే లాయర్లకి స్టైఫండ్ , ప్రతీ సర్పంచ్‌కి నెలకి రూ.10 వేల వేతనం ఇలా ఒక్కోసారి ఒక్కో హామీని ఇస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ కాకుండా ఆప్ అవతరించినా అది పార్టీ సాధించే అతి పెద్ద విజయమని భావిస్తోంది. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో కూడా ఆప్ రాకతో కాంగ్రెస్ భారీగా నష్టపోవడం చూశాం. గుజరాత్‌లో కూడా అదే జరుగుతుందన్న అంచనాలున్నాయి. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఉచిత హామీలు ఇచ్చే వలలో పడవద్దంటూ ప్రచారం చేస్తున్నారు. అవలలో పడితే స్వయంసృమద్ధి సాధించి గుజరాత్ ఆత్మ గౌరవాన్ని కాపాడుకోలేమంటూ కేజ్రీవాల్‌కి చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎవరి ఓట్లను చీలుస్తుంది ?

ఇప్పటివరకు నిర్వహించిన వివిధ సర్వేలు ఆప్ 22% వరకు ఓటు షేరు సాధిస్తుందని చెబుతున్నాయి. కాంగ్రెస్‌కి అండదండగా ఉండే ముస్లింలు, ఎస్సీ, ఎస్టీలు ఆప్ ఉచిత హామీలతో ఆప్ వైపు మొగ్గు చూపించవచ్చు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు 22% ఉంటే, ఓబీసీలు 40% వరకు ఉన్నారు. ఈ ఓటు బ్యాంకులో అత్యధికం ఆప్‌కు మళ్లిపోయే అవకాశాలున్నాయి. ఢిల్లీ మోడల్ పాలనపై ఆసక్తి ఉండే అర్బన్ ఓటర్లను కూడా తమ వైపు తిప్పుకోవడానికి ఆప్ ప్రయత్నిస్తోంది.అర్బన్ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్య రంగాల్లో ఢిల్లీలో వచ్చిన మార్పుల్ని ఆప్ వివరిస్తోంది. గత 20 ఏళ్లుగా వరసపెట్టి బీజేపీ విజయాలు సాధిస్తున్న 66 పట్టణ స్థానాలపై ఆప్ ఎక్కువగా దృష్టి సారించింది. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఏడు కార్పొరేషన్లలో కలిపి ఆప్ 14% ఓటు షేరు సాధించింది. రాజ్‌కోట్‌లో 19%, అహ్మదాబాద్‌లో 20%, సూరత్‌లో 28% ఓటు షేరు సాధించిన ఆత్మవిశ్వాసంతో కనీసం కింగ్ మేకర్‌గా నిలుస్తామని ఆప్ ధీమాగా ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

గుజరాత్ సమరం

అనుకూలం

- ఆప్ పరిపాలన కొత్తగా ఉండబోతోందని దిగువ మధ్యతరగతి ప్రజల్లో బలమైన అభిప్రాయం ఏర్పడడం
- ఆప్ ఇచ్చే ఉచిత పథకాల పట్ల వివిధ వర్గాల ప్రజల్లో ఆకర్షణ
- ఢిల్లీ మోడల్ పాలన చూపించి ఓటర్లను తమ వైపు తిప్పుకునే నేర్పరితనం
- రెండు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించి విస్తృతంగా ప్రచారం చేయడం

ప్రతికూలం

- క్షేత్రస్థాయిలో పార్టీకి బలం లేదు, ప్రజాదరణ కలిగిన నాయకులెవరూ ఆప్‌లో చేరలేదు
- గుజరాత్ రాజకీయాలపై సీనియర్ నాయకులకు అవగాహన లేమి
- ఎన్నికల బరిలో మొదటిసారి దిగడంతో నిర్థారంగా ఓటు బ్యాంకు లేదు.
- బీజేపీకి బీ టీమ్ ఆప్ అంటూ కాంగ్రెస్ చేస్తున్న విస్తృత ప్రచారం

గత ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ సాధించిన సీట్లు (ప్రాంతాలవారీగా)

2012 ఎన్నికలు

పార్టీ	గ్రామీణం	సెమీ అర్బన్	అర్బన్
బీజేపీ	44	36	35
కాంగ్రెస్	49	8	4

2017 ఎన్నికలు

పార్టీ	గ్రామీణం	సెమీ అర్బన్	అర్బన్
బీజేపీ	36	30	33
కాంగ్రెస్	57	14	6

సాక్షి
విజయనగరం
శుక్రవారం । 18 । నవంబర్ । 2022

రోడ్డుపైనే పార్కింగ్



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలోని పలు షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. షాపింగ్ కాంప్లెక్స్‌లలో పార్కింగ్ సదుపాయం ఉన్నా.. పలువురు వాహనచోదకులు రోడ్డుపైనే ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్ అంతరాయంతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనికి ఈ చిత్రమే సాక్ష్యం.
– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



రాళ్లపై తాబేళ్లు

విజయనగరం జిల్లా కేంద్రంలోని అయ్య కోనేరువైపు వెళ్లేవారికి తాబేళ్లు కనువిందు కలిగిస్తున్నాయి. చెరువు మధ్యలో కనిపించే రాళ్లపై సేదతీరుతూ చూపరులను ఆశ్చర్యపరుస్తున్నాయి.
– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

గ్యాస్ సిలిండర్ పేలి..



దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురానికి చెందిన ఈదుబిల్లి ఈశ్వరమ్మ ఇంటిలో గ్యాస్ సిలిండర్ గురువారం రాత్రి పేలింది. మంటలు వ్యాపించడంతో పూరిల్లు దగ్ధమయింది. స్థానికులు మంటలు అదుపుచేయడంతో పెద్దప్రమాదం తప్పిందని సర్పంచ్ బేత శ్రీదేవి తెలిపారు.

న్యూస్‌రీల్

20న షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్–19 బాల, బాలికల షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 20న నిర్వహించనున్నట్టు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.కృష్ణమూర్తి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరం శివారులోని జమ్మునారాయణపురం బ్యాంకు కాలనీలోని ఎంజేపీబీడబ్ల్యూఆర్ స్కూల్ ఆవరణలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపిక పోటీలకు 2004 జనవరి 1 అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 89195 42463 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఈ నెల 30న గురజాడ వర్ధంతి

- ఈ ఏడాది చాగంటికి గురజాడ పురస్కారం
- వివరాలు వెల్లడించిన గురజాడ సాంస్కృతిక సమాఖ్య



గురజాడ విశిష్ట పురస్కార వివరాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సాంస్కృతిక సమాఖ్య సభ్యులు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడకు సమున్నత రీతిలో నివాళులర్పించేందుకు గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఏటా నవంబర్ 30న గురజాడ సాహితీ చైతన్యోత్సవం పేరుతో ఆయన వర్ధంతిని నిర్వహిస్తోందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. గురజాడ స్వగృహంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులను గురజాడ విశిష్ట పురస్కారం పేరుతో గౌరవించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది శారదా జ్ఞానపుత్రులు చాగంటి కోటేశ్వరరావును గురజాడ విశిష్ట పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. మహాకవి వాడిన వస్తువులతో వారి స్వగృహం నుంచి ఊరేగింపుగా వెళ్లి వారి విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రా రచయితలకు నిర్వహించిన కవితల పోటీ విజేతల స్వీయ కవితా పఠనం, బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు పీవీ నరసింహరాజు (బుచ్చిబాబు), కోశాధికారి డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ జక్కురామకృష్ణ, చక్రవర్తి, గురజాడ ప్రసాద్, ఇందిర దంపతులు పాల్గొన్నారు.

ఇప్పటివరకూ పురస్కారం పొందిన వారిలో..

2000వ సంవత్సరం నుంచి గురజాడ సాంస్కృతిక సమాఖ్య గురుజాడ విశిష్ట పురస్కారాలను ప్రదానం చేస్తోంది. అవార్డులు అందుకున్న వారిలో జేవీ సోమయాజులు, గొల్లపూడి మారుతీరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి, కె.విశ్వనాథ్, గుమ్మడి, షావుకార్ జానకి, మల్లెమాల, అంజలీదేవి, రావికొండలరావు, వంశీ, తనికెళ్లభరణి, చాట్ల, మొదలి నాగభూషణశర్మ, సుద్దాల అశోక్‌తేజ, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గరికిపాటి నరసింహారావు, డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి ఉన్నారు.

భయపెడుతున్న బెబ్బులి



- వరుసగా దాడులు
- రాత్రివేళ అటవీ ప్రాంతంలో సంచారం
- పశువుల శాలలపై పంజా
- ఆవులను హతమార్చుతున్న వైనం
- తాజాగా మేకలమంద, ఆవుపై దాడి
- పులిని బంధించేందుకు అటవీశాఖ అధికారుల విశ్వప్రయత్నం
- బోన్లు, సీసీ కెమెరాల ఏర్పాటు

బొండపల్లి/దత్తిరాజేరు/మెంటాడ:

జిల్లా ప్రజలను బెబ్బులి భయపెడుతోంది. వరుస దాడులతో అలజడి రేపుతోంది. కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. నిర్మానుష్య ప్రాంతాలు, గ్రామాలకు దూరంగా ఉన్న పశువుల శాలలే లక్ష్యంగా దాడిచేస్తోంది. ఆవులపై పంజా విసిరి హతమార్చుతోంది. పది రోజుల్లో ఐదు ఆవులను హతమార్చిన పెద్దపులి... గురువారం రాత్రి ఓ ఆవు, మేకల మందపై దాడిచేసింది. ఆవును హతమార్చగా... మేకల మంద వద్ద ఉన్న కుక్కలు వెంటబడడంతో మేకను విడిచిపెట్టి పరుగుతీసింది.

పులి దాడిలో ఆవు మృతి



దత్తిరాజేరు: పులిదాడిలో మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

దత్తిరాజేరు మండలంలోని భూపాలరాజపురంలో గెద్ద తిరుపతిరావుకు చెందిన పశువుల శాలపై గురువారం అర్ధరాత్రి వేళ పులి పంజా విసిరింది. ఆవును పొట్టనబెట్టుకుంది. ఘటనా స్థలాన్ని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాబూరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి దాడిలో ఆవు చనిపోయినట్టు నిర్ధారించారు. ఘటనా స్థలానికి సమీపంలో బోను ఏర్పాటు చేయించారు. రాత్రి సమయంలో ఎవరూ బయట తిరగొద్దని సూచించారు.

మేకల మందపై దాడి



బొండపల్లి: ముద్దూరులో పులిదాడిలో గాయపడిన మేక

బొండపల్లి మండలంలోని ముద్దూరు గ్రామంలో కొండపక్కన ఉన్న కొవ్వాడ రామునాయుడుకి చెందిన మేకల మందపై పెద్దపులి గురువారం వేకువజామున దాడిచేసింది. ఓ మేకను నోటకరిచి పట్టుకుపోయే ప్రయత్నం చేసింది. మంద కాపలాదారులు గట్టిగా కేకలు వేయడం, కుక్కలు వెంటపడడంతో మేకను విడిచిపెట్టి పులి వెళ్లిపోయిందని కాపలాదారు తెలిపారు. గాయపడిన మేకను వైద్యం నిమిత్తం బొండపల్లి పశువైద్యశాలకు తీసుకెళ్లారు.

వరుస దాడులు ఇలా...

- మెంటాడ మండలంలో ఈ నెల 3న అమరాయవలసకు చెందిన మద్దిరెడ్డి పోలయ్య, 4న కొండలింగాలవలస పంచాయతీ శీలవలసకు చెందిన పనుకు పెంటయ్య, 7న గజంగుడ్డివలసకు చెందిన రాకోడి లక్ష్మి పశువుల శాలలపై పులి దాడిచేసి రెండు ఆవులను, ఒక దూడను హతమార్చింది.
- బొండపల్లి మండలం గరుడుబిల్లిలో ఈ నెల 15న, తాజాగా ముద్దూరు, దత్తిరాజేరు మండలం భూపాలరాజపురంలో దాడిచేసింది. ఇక్కడ కూడా రెండు ఆవులను పొట్టనపెట్టుకోగా, మేకను గాయపరిచింది.
- బొండపల్లి మండలంలో సెప్టెంబర్ 2న వెదురువాడ, సెప్టెంబర్ 16న కొత్తపనసలపాడులో దాడిచేసి రెండు ఆవులను హతమార్చింది.

చురుగ్గా సంచారం

పులి రాత్రివేళ చురుగ్గా కదులుతున్నట్టు అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. దీనికి గురువారం పులి జరిపిన దాడులే నిదర్శనం. దత్తిరాజేరు మండలం భూపాలరాజపురానికి బొండపల్లి మండలం ముద్దూరుకు అడ్డదారిలో వెళ్లినా సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఒకే రాత్రి రెండు చోట్ల పులి దాడిచేసింది. అంటే... సుమారు 20 కిలోమీటర్ల పరిధిలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

అప్రమత్తతే ప్రధానం

పులి దాడిచేస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్ సూచించారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో ఆవును చంపిన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామస్తులకు, అధికారులు పలు సూచనలు చేశారు. పులిని బంధించేందుకు ఇక్కడ బోను ఏర్పాటుచేశామని, రాత్రివేళ గ్రామస్తులెవ్వరూ సంచరించవద్దని సూచించారు. ఆయన వెంట అటవీశాఖ రేంజర్ కె.వి.ఎస్.రాజు, ట్రేకర్ అమర్, సిబ్బంది ఉన్నారు.



బొండపల్లి: గరుడుబిల్లి గ్రామస్తులకు సూచనలిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్

● బాధ్యతల స్వీకరణ



విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా బి.లింగేశ్వరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో డిప్యూటీ డీఈఓగా, సర్వశిక్ష అభియాన్ పీఓగా సేవలందించిన ఆయన నేడు తిరిగి డీఈఓగా బాధ్యతలు స్వీకరించడంపై కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యాప్రమాణాలు మరింత మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని డీఈఓ తెలిపారు. – విజయనగరం ఫూల్‌బాగ్

మారిన మెనూ



- ఈనెల 21 నుంచి 'జగనన్న గోరుముద్ద'లో మార్పులు
- విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన భోజనం
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- జిల్లాలో 1,63,561 మంది విద్యార్థులకు ప్రయోజనం

విజయనగరం ఫూల్‌బాగ్:

సర్కారు బడుల్లో ఈ నెల 21 నుంచి కొత్త మెనూ అమలుకానుంది. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన 'గోరుముద్ద'ను ప్రభుత్వం వడ్డించనుంది. ఈ మేరకు పాఠశాల విద్యావిభాగం మిడ్ డే మీల్స్ డైరెక్టర్ నిధీమీనా ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు కొత్తమెనూ అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని 1781 పాఠశాలల్లో చదువుతున్న 1,63,561 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

కొత్తమెనూ ఇలా..

సోమవారం:	హట్ పొంగల్, ఉడకబెట్టిన గుడ్డు/ కూరగాయల పలావ్, గుడ్డుకూర, చిక్కి
మంగళవారం:	పులిహోర,/టమాట లేదా దొండకాయ కూర, ఉడకబెట్టిన గుడ్డు
బుధవారం:	కూరగాయలతో అన్నం, బంగాళదుంప కూర్మ, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కి
గురువారం:	సాంబార్‌బాత్, ఉడకబెట్టిన గుడ్డు
శుక్రవారం:	అన్నం, ఆకుకూరతో పప్పు, ఉడకబెట్టినగుడ్డు, చిక్కి
శనివారం:	ఆకుకూర, అన్నం, పప్పుచారు, స్వీట్‌పొంగల్

చెరకు క్రషింగ్‌కు శ్రీకారం

- ప్రత్యేక పూజలు చేసిన సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్



ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో చెరకు క్రషింగ్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నాగేశేషారెడ్డి

రేగిడి: సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ముహూర్తం ప్రకారం గురువారం ఉదయాన్నే సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశేషారెడ్డి ప్రత్యేక పూజలు జరిపి చెరకు క్రషింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో సాగుచేస్తున్న చెరకు పంటను సకాలంలో క్రషింగ్ జరిపేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. చెరకును నరికేందుకు యంత్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి చెరకు కూలీలను ఇప్పటికే తీసుకొచ్చామన్నారు. క్రషింగ్ సమయంలో కర్మాగారానికి వాహనాల ద్వారా చెరకును తరలించేటప్పుడు ప్రజలకు, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ట్రాక్టర్లు, లారీలు, టైరు బళ్లతో పరిమితికి మించి చెరకును తరలించకుండా డ్రైవర్లకు సూచనలు ఇచ్చామన్నారు. ఫీల్డ్ సిబ్బందిని కూడా అప్రమత్తం చేసినట్టు వెల్లడించారు. కర్మాగారం ఆవరణలో చెరకును తీసుకొచ్చిన రైతులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు క్రషింగ్ జరుగుతున్న సమయంలో యాజమాన్యానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం రమేష్‌రెడ్డి, ఏజీఎం కేన్ అప్పారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ సంతకం ఫోర్జరీ

- ఉపాధ్యాయునికి మెమో జారీ

గంట్యాడ:

ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయ్ హెల్త్‌స్కీమ్) బిల్లు కోసం ఎంఈఓ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఉపాధ్యాయుడికి ఎంఈఓ విజయలక్ష్మి గురువారం మెమో జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సిరిపురం ఎంపీయూపీ స్కూల్‌లో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న వై.శంకరగిరినాయుడు ఈహెచ్‌ఎస్ బిల్లు కోసం ఆన్‌లైన్‌లో ఎంఈఓకు దరఖాస్తు చేశారు. దీనిని ఎంఈఓ ఆన్‌లైన్‌లో పరిశీలించిన తర్వాత కౌంటర్ సంతకం చేసి డీఈఓకు పంపిస్తారు. ఎంఈఓ కౌంటర్ సిగ్నేచర్‌ను ఉపాధ్యాయుడే ఫోర్జరీ చేసి పెట్టేశాడు. దీనిని గమనించిన ఎంఈఓ.. ఉపాధ్యాయుడికి మెమె జారీ చేశారు. ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్టు ఎంఈఓ తెలిపారు.

ముగిసిన పాలిటెక్ ఫెస్ట్–2022





మొదటి బహుమతి అందుకుంటున్న విజయనగరం ప్రభుత్వ, అవంతి పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు

- ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతుల ప్రదానం

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌జీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్–2022 గురువారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లాల పరిధిలోని 22 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 230 మంది హాజరై 54 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టులుగా విజయనగరం ఎంఆర్‌జీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఇన్ ఇంజినీరింగ్ హైడ్రాలిక్ ఫుట్‌పాత్ ప్రాజెక్టుతో పాటు, అవంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్పీడ్ బ్రేకర్ ఎలక్ట్రిసిటీ జనరేషన్‌లు ఎంపికై మొదటి బహుమతి సాధించాయి. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని జీఎల్ పురం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ఫైర్‌ఎక్స్‌టిన్విసింగ్ మోడల్ ఫర్ రూరల్ కమ్యూనిటీ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. వీరికి వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో జేఎన్‌టీయూ జీవీ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ టి.వంశీమోహన్, విశ్రాంత ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఎస్ మూర్తి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి 15 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌జీఆర్ ప్రభుత్వ ప్రిన్సిపాల్ జె.ఆశారాణి, చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెవెలుగులో ఈ–సేవలు

- జిల్లాలో 94 పల్లెవెలుగు బస్సులు
- రెండు డిపోల పరిధిలో తొలివిడతగా 4 సర్వీసుల్లో ఈ–సేవలు
- డిజిటల్ పేమెంట్స్‌తో తీరనున్న ప్రయాణికుల చిల్లర కష్టాలు



రాజాం సిటీ: బస్సులో ప్రయాణం చేయాలంటే చిల్లర తప్పనిసరన్న రోజులకు కాలం చెల్లనుంది. బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉండి, జేబులో సెల్‌ఫోన్, ఏటీఎం కార్డులు ఉంటే చాలు. సుఖవంతమైన ప్రయాణం సాగించవచ్చు. ఇప్పటివరకు డీలక్స్, లగ్జరీ బస్సుల్లో అమలులో ఉన్న డిజిటల్ పేమెంట్స్‌ను ప్రభుత్వం తాజాగా పల్లెవెలుగు బస్సుల్లోనూ ప్రారంభించింది. జిల్లాలోని విజయనగరం, ఎస్.కోట డిపోల పరిధిలో ఈ–సేవలు గురువారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో మొత్తం 94 పల్లెవెలుగు సర్వీసులు నడుస్తుండగా, ట్రయల్‌రన్‌గా నాలుగు సర్వీసుల్లో ఈ–టిక్కెట్ విధానంను అధికారులు అమల్లోకి తెచ్చారు. ఫోన్‌పే, గూగుల్ పే, ఏటీం కార్డులను వినియోగించి బస్సు టిక్కెట్ డబ్బులు చెల్లించే అవకాశం కల్పించారు. త్వరలో అన్ని సర్వీసుల్లోను డిజిటల్ ఈ పాస్ మిషన్లతో టిక్కెట్లు జారీచేయనున్నట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.



కండక్టర్లకు అందజేసిన డిజిటల్ పేమెంట్స్ డివైజ్

ప్రయాణికులకు సౌకర్యం

డిజిటల్ పేమెంట్‌లతో ప్రయాణికులకు మేలు చేకూరుతుంది. చిల్లర సమస్య తలెత్తదు. విజయనగరం డిపో నుంచి సింహాచలం వెళ్లే నాలుగు సర్వీసుల్లో ట్రయల్ రన్‌గా ఈ–టిక్కెట్ విధానం అమలు చేశాం. మరో రెండు మూడు రోజుల్లో అన్ని రూట్‌లలోని సర్వీసులకు కూడా డిజిటల్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తెస్తాం.
– జె.శ్రీనివాసరావు, డిపో మేనేజర్, విజయనగరం ఆర్టీసీ డిపో

క్లుప్తంగా

రామతీర్థంలో గీతాపారాయణ ఉపన్యాసం ప్రారంభం



గీతా పారాయణ ఉపన్యసిస్తున్న రాధాకృష్ణమాచార్యులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో గీతా పారాయణ ఉపాన్యాసాలను గురువారం ప్రారంభించారు. వచ్చే నెల 4న గీతా జయంతి సందర్భంగా టీటీడీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 18 ప్రముఖ దేవాలయాల్లో గీతా పారాయణాలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో రామతీర్థంలోని సీతారామస్వామి సన్నిధిలో దివ్య ప్రబంధ అధ్యాపకుడు రాధాకృష్ణమాచార్యులు గీతా పారాయణ ఉపాన్యాసం ప్రారంభించారు. వచ్చే 4వరకు ప్రతి రోజు దేవాలయం పారాయణాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలాజీ

విజయనగరం ఫోర్ట్: చెడు అలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా హెచ్ఐవీ ఎయిడ్స్ బారిన పడకుండా తప్పించుకోవచ్చని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ తెలిపారు. ఈ మేరకు స్థానిక స్వాధార్ హోంలో గురువారం సాయంత్రం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని హితవు పలికారు. హెచ్ఐవీ వచ్చిన తర్వాత కంటే రాకముందే జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

పార్వతీపురం టౌన్: పాత కక్షలతో జరిగిన కొట్లాటలో ముగ్గురికి గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై . పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పెదమాదివీధికి చెందిన పాట్నూరు అశోక్‌కు దగ్గరి బంధువైన కుర్మాన అఖిల్ పాత కక్షలను మనసులో ఉంచుకుని అశోక్‌పై గొడ్డలితో చంపాలని దాడి చేయగా భార్య సోనీ, కొడుకు వాసు అడ్డుకోవడంతో ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన వారు వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రాగా వైద్యులు చికిత్స అందించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



కిలపర్తి ఉదయ్‌కిరణ్(ఫైల్)

బొబ్బిలి రూరల్: మండలంలోని జె.రంగరాయపురం (కునుకువానివలస) గ్రామానికి చెందిన కిలపర్తి ఉదయ్‌కిరణ్(21) విద్యుత్ షాక్‌కు గురై బుధవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని రామయ్యగారితోటకు స్నేహితులతో కలిసి వెళ్లిన ఉదయ్‌కిరణ్ కొబ్బరికాయల కోసం చెట్టు ఎక్కగా పక్కనుంచి వెళ్తున్న విద్యుత్ తీగతగలడంతో స్పృహకోల్పోయి పడిపోయాడు. స్నేహితులు వెంటనే గ్రామస్తులకు, ఉదయ్‌కిరణ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరరించారు. ఉదయ్‌కిరణ్ బొబ్బిలిలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆర్మీకి ఎంపికై మెడికల్ టెస్టుకు వెళ్లాల్సి ఉంది. తల్లిదండ్రులు పోలమ్మ, గురునాథ పేదకుటుంబానికి చెందినవారు కావడం, ఆదుకుంటాడనుకున్న కుమారుడు మృతిచెందడంతో భోరున విలపిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,640–00
బంగారం(22సి. 10గ్రా.)	48,260–00
వెండి (కిలో)	67,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఆటలతో ఆదాయం

- వినూత్నంగా ప్రైజ్ మనీతో క్రీడల పోటీలు
- తొలిసారిగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- రాణించిన క్రీడాకారులకు మంచి భవిష్యత్
- సాక్షితో స్పోర్ట్స్'అథారిటీ జిల్లా చీఫ్ కోచ్



క్రీడల జిల్లా చీఫ్ కోచ్ అప్పలనాయుడు

రాజాం: ఇంతవరకూ శాప్‌తో పాటు ఎస్ఎస్ఏ, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలు కేవలం మెరుగైన క్రీడాకారుల గుర్తింపుకోసమే క్రీడాపోటీలు నిర్వహించేవని, ఇప్పుడు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రైజ్ మనీతో క్రీడలు నిర్వహించడంతో అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్‌కోచ్ పైల అప్పలనాయుడు అన్నారు. జగనన్న క్రీడా సంబరాలు 2022లో భాగంగా జరుగుతున్న ప్రైజ్‌మనీ క్రీడల నియోజకవర్గ టీమ్ ఎంపికను తొలుత రాజాంలో ప్రారంభించారు. ఈ ఎంపికలకు హాజరైన ఆయన సాక్షితో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో 42 టీమ్‌లు ఎంపిక చేయాల్సి ఉందని అన్నారు. ఒక్కో నియోజకవర్గంలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ టీంల ఎంపిక చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రాజాం నియోజకవర్గం నుంచి ఈ ఎంపికలు ప్రాంభించామని తెలిపారు. మహిళలు, పురుషుల జట్లు వేర్వేరుగా ఉంటాయని వివరించారు. ఒక్కో నియోజకవర్గంలో ఆరు టీమ్‌లు సిద్ధం చేయగా, ఈ టీమ్‌లు తమ నియోజకవర్గం తరఫున డిసెంబర్ నెలలో జిల్లా కేంద్రంలో ఆడతాయని పేర్కొన్నారు. 17 సంవత్సరాలు పైబడినవారే ఈ క్రీడలకు అర్హులని వెల్లడించారు. ఏమీ చదవకపోయినా క్రీడల్లో పాల్గొనవచ్చని, ఆధార్ కార్డు ప్రామాణికంగా తీసుకుంటామని వివరించారు. నియోజకవర్గ టీమ్ జిల్లాలో రాణిస్తే ఆ నియోజకవర్గం తరఫున జోనల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని, ఈ పోటీలకు జిల్లా నుంచి మహిళలు, పురుషుల విభాగాల నుంచి ఆరు టీమ్‌ల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఇవి కాకుండా బాడ్మింటన్ టీంలు నేరుగా జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తామని, అవి ఒక రెండు టీమ్‌లు జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తాయని అన్నారు. శాప్, సర్వశిక్షాఅభియాన్, స్కూల్ ఎడ్యుకేషన్‌ను సమన్వయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైజ్‌మనీ పోటీలు నిర్వహిస్తోందని వివరించారు.

బహుమతి ప్రదానం ఇలా

రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు కన్సొలేషన్ విభాగంలో కూడా ప్రైజ్ మనీ ఉంటుందని స్పష్టం చేశారు. వాలీబాల్ టీమ్‌కు 12 మంది, క్రికెట్‌కు 15 మంది, కబడ్డీకి 12 మంది టీమ్‌తో పాటు బాడ్మింటన్‌కు ఇద్దరేసి చొప్పున ఎంపిక చేస్తున్నామని చెప్పారు. కబడ్డీ, క్రికెట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిస్తే రూ.5 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిస్తే రూ.3 లక్షలు, తృతీయ స్థానంతో పాటు కన్సొలేషన్ విభాగంలో రూ.లక్ష ప్రైజ్ మనీ ఉంటుందని తెలిపారు. వాలీబాల్ విభాగంలో రూ.3 లక్షలు, రూ.1.50 లక్షలు, రూ.50 వేలు చొప్పున వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, కన్సొలేషన్‌కు స్థానానికి ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. బాడ్మింటన్‌లో ప్రథమ స్థానంలో నిలిస్తే రూ.1 లక్ష, ద్వితీయ స్థానంలో నిలిస్తే రూ.50 వేలు, తృతీయ, కన్సొలేషన్ స్థానాల్లో నిలిస్తే రూ.25 వేలు చొప్పున ప్రైజ్ మనీ ఉంటుందని వివరించారు. ఈ పోటీల్లో రాణించే వారికి గుర్తింపు పత్రాలతో పాటు ప్రైజ్ మనీ కూడా అందనుండడంతో క్రీడాకారులు ఆసక్తిగా పాల్గొంటున్నారని వివరించారు.

ఏఓబీ గ్రామాల్లో దాడులు

- సంయుక్తంగా పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా ఎక్సైజ్ అధికారులు
- 10,200లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లం ఊటలను పారబోస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో పార్వతీపురం ఎస్ఈబీ అధికారులు, ఒడిశా ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించి భారీగా బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ ఎంపీ గోపాలకృష్ణ స్థానిక ఎస్ఈబీ జిల్లా కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ సరిహద్దు గ్రామాలైన బొత్తరాపల్లి, జైకోట, ఎగువభద్రాపల్లి, నాగళ్లవలసల్లో సారా బట్టీలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఒడిశా ఎక్సైజ్‌అధికారుల సమన్వయంతో దాడులు నిర్వహించి సారా తయారీకి ఉపయోగిస్తున్న 10,200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశామని తెలిపారు. జిల్లా ఏర్పడిన తరువాత సారా రక్కసిపై ఉక్కుపాదం మోపేందుకు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో దాడులను ముమ్మరం చేశామని చెప్పారు. రానున్న రోజుల్లో సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పూర్తి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి జిల్లాలోని మైదాన ప్రాంతాలకు సారా రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పట్టుబడిన సారా నిందితులపై ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నామన్నారు. రెండుమూడు సార్లు కన్నా ఎక్కువగా పట్టుబడినట్లైతే పీడీయాక్ట్ ప్రయోగించి జైలుపాలు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్సైలు రాజశేఖర్, శేఖరం, వీవీ రమణ, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

నోడల్ ఆఫీసర్‌గా జయకృష్ణ



ఎస్.జయకృష్ణ

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎస్.జయకృష్ణ పార్వతీపురం మన్యం జిల్లా స్పోకెన్ ఇంగ్లీష్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర డైరెక్టర్ ప్రతాపరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేందుకు అహర్నిశలు కృషిచేస్తున్న జయకృష్ణ నోడల్ ఆఫీసర్‌గా నియమితులు కావడంతో హెచ్ఎం ముద్దాడ రమణమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఇంగ్లీష్‌లో విద్యార్థులు పట్టుసాధించే విధంగా కృషిచేస్తానని జయకృష్ణ ఈ సందర్భంగా వెల్లడించారు.

25న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో నిర్వహించనున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ శశిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ఫ్యాన్ వైండింగ్, కారు డ్రైవింగ్ (30 రోజులు)లో శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు లేడీస్ టైలరింగ్ (30 రోజులు)లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాతోపాటు విశాఖపట్నంకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాలలోపు స్త్రీ పురుషులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు 10వ తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో అభ్యర్థులు హాజరు కావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 9989953145, 9491741129, 9866913371, 9989057451 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వీఆర్వోపై విచారణ

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి కొండంపేట వీఆర్వోగా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన గెడ్డాపు శ్రీనివాసరావుపై భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలోని డి పట్టా భూములకు సంబంధించి తప్పుడు సర్వే నంబర్లతో క్రయవిక్రయాలకు సహకరిస్తున్నాడని గ్రామస్తులు విచారణలో ఆరోపించారు. మూడు నెలల క్రితం వీఆర్వోపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ సస్పెన్షన్ విధించిన విషయం విదితమే. ఈ మేరకు పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని డీటీ తెలిపారు.

విలువలతోకూడిన విద్యనందించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు



బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు అభిప్రాయ పడ్డారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ స్థానిక లయన్స్ క్లబ్ సమావేశమందిరంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వయస్సుగల బాలబాలికలకు ఏవైనా సమస్యలు ఎదురైనా వారి హక్కులకు భంగం కలిగినా కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు కుటుంబ విలువలుకూడా తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకుని చదవాలని హితవు పలికారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాలు, సెల్‌ఫోన్లకు బానిస కావద్దని చెప్పారు. బాలికలను మోసంచేసే కేసులు ఎక్కువగా వస్తున్నాయని, తల్లిదండ్రులు పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని స్పష్టం చేశారు.

'ప్రపంచాన్ని మార్చే శక్తి చదువుకే ఉంది

శాసనసభ్యుడు అలజంగి జోగారావు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే శక్తి చదువుకే ఉందని నెల్సన్‌మండేలా చెప్పారన్నారు. విద్యకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని బాల,బాలికల విద్యను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి పథకం అమలు చేస్తున్నామని చెప్పారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ట్రైబల్ వెల్‌ఫేర్‌పాఠశాల విద్యార్థి ఎం.సాగర్ అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయనం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డిప్యూటీ డీఈఓ బాపూజీ, ఎంఈఓ పీవీ.ప్రసాద్ ఆలిండియా పేరెంట్స్ కమిటీ సభ్యుడు ఐ.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.వరహాలు, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకుడు వి.సూర్యనారాయణ, జట్టుట్రస్టీ డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నతంగా బతకాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గద్దం ఉమ



నరవ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో ముచ్చటిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు ఉమ



వన్‌స్టాప్‌సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ ఉమ

గంట్యాడ: సమాజంలో మహిళలు ఉన్నతంగా బతకాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గద్దం ఉమ పేర్కొన్నారు. మండలలోని కొఠారుబిల్లిలో కేజీబీవీని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా తరగతి గదులు, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. వసతి, బోధన, భోజనాలు ఏవిధంగా ఉన్నాయో విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు బాగున్నాయని విద్యార్థినులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు . ఏసమస్య ఉన్నా ధైర్యంగా చెప్పాలని విద్యార్థినులకు భరోసా ఇచ్చారు. సమస్యలు చెబితే పరిష్కరించడానికి అస్కారం ఉంటుందన్నారు. ఆడ, మగ వివక్ష ఎందుకు చూపుతున్నారని తల్లిదండ్రులను నిలదీయాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా తల్లిదండ్రులకు మాత్రమే చెప్పాలని హితవు పలికారు. అంతకుముందు ఆమె నరవ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ప్రతి రోజూ ఏమి పెడుతున్నారు? వంటలు రుచికరంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. పిల్లలు స్వచ్ఛందంగా కేంద్రాలకు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి, సీడీపీఓలు జి.ప్రసన్న, డోకుల ఉమాభారతి, కేజీబీవీ ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, నరవ సర్పంచ్ పతివాడ భాస్కరరావు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌కు వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విజయనగరం ఫోర్ట్: దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ పేర్కొన్నారు. స్థానిక దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను గురువారం సాయంత్రం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు వచ్చిన కేసుల రికార్డులను పరిశీలించారు. అదే సమయంలో తన భర్త వేధిస్తున్నాడని దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు వచ్చిన ఓ మహిళకు ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రేమతో మాట్లాడి భర్తను మార్చుకోవాలని సూచించారు. మహిళలపై వేధింపులను అరికట్టేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దిశ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అదేవిధంగా బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారి కోసం పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు ఈచట్టాలను వినియోగించుకోవాలని కోరారు. దిశ యాప్ మహిళలకు వజ్రాయుధం లాంటిదని, మహిళల రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి.శాంతకుమారి, సీడీపీఓలు డోకుల ఉమాభారతి, గుల్లిపల్లి ప్రసన్న, వన్‌స్టాప్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి, కౌన్సిలర్ రమాదేవి, వెంకటలక్ష్మి, అనిత, లక్ష్మి, ఆదినారాయణ తదితరులు పాల్నొన్నారు.

అథ్లెటిక్స్ మీట్‌లో సత్తా చాటిన విద్యుత్ ఉద్యోగులు



పతకాలు సాధించిన ఉద్యోగులను అభినందిస్తున్న ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఉద్యోగులు సత్తా చాటారు. ఇటీవల విశాఖలో జరిగిన పోటీల్లో 55 సంవత్సరాల విభాగంలో పాల్గొన్న ఆర్వీ రమణ 5 కిలోమీటర్ల వాకింగ్‌లో వెండి పతకం దక్కించుకోగా..50 సంవత్సరాల విభాగంలో పి.పైడిరాజు 5 కిలో మీటర్ల వాకింగ్‌లో వెండిపతకాన్ని, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా 40 సంవత్సరాల విభాగంలో పి.ఆంజనేయులు షాట్‌పుట్, డిస్క్‌త్రో విభాగాల్లో బంగారు పతకాలు దక్కించుకోగా.. 50 సంవత్సరాల విభాగంలో ఎస్.శ్రీనివాసరావు, 200 మీటర్ల పరుగు పోటీలో కాంస్య పతకం, 400 మీటర్ల పరుగు పోటీలో వెండి పతకం దక్కించుకున్నాడు. 30 సంవత్సరాల విభాగంలో పి.యశ్వంత్ సాయి 5 కిలోమీటర్ల విభాగంలో వెండి పతకం కైవసం చేసుకున్నాడు. రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన ఉద్యోగులను విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.నాగేశ్వరరావు, ఈఈ ఎస్.కృష్ణమూర్తి, పీఓ జి.శ్రీనివాసరావులు అభినందించారు.

బాలోత్సవ్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థిని చందనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

గంట్యాడ: గుంటూరులో ఉన్న వీవీఐటీ సంస్థ నిర్వహించిన ప్రపంచ తెలుగు బాలల పండుగ –2022(బాలోత్సవ్)లో గంట్యాడ మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ కేటగిరిల్లో పాల్గొని బహుమతులు గెలుపొందారు. చలన చిత్ర గీతాలాలాపనలో బి.మేఘన (10 వతరగతి), తెలుగులోనే మాట్లాడదాంలో కె. చందన(8వ తరగతి)లు ప్రథమస్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందారు. బహుమతులు గెలుపొందిన విద్యార్థినులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణారావు గురువారం అభినందించారు.

విద్యాప్రమాణాల మెరుగే లక్ష్యం

- డిప్యూటీ డీఈవో తిరుపతినాయుడు



కొట్టక్కి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో తిరుపతినాయుడు

రామభద్రపురం: పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్ది వారి విద్యాప్రమాణాలు మెరుగు పర్చడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ డీఈవో తిరుపతిరాయుడు అన్నారు. మండలంలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలను గురువారం ఆయన వార్షిక ఇన్‌స్పెక్షన్ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ రికార్డులు, పాఠశాలకు వచ్చిన బడ్జెట్‌కు సంబంధించిన బిల్లులు, రికార్డులు, పిల్లల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల విద్యాబోధన ఎలా ఉంది? బాగా చదువుతున్నారా? పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయా? మధ్యాహ్నభోజనం రుచికరంగా ఉంటోందా? అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు జగనన్న విద్యాకానుక కింద ఏటా లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తూ విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేయడంతో పాటు నాడు నేడు కింద పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా టీచర్లు విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలప్రసాద్, హెచ్ఎం రావాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులే టార్గెట్‌గా దివ్యాంగుడి మోసాలు

- ఉద్యోగాలిప్పిస్తానని డబ్బు వసూలు చేసిన నిందితుడి అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్ (వెనుక మాస్క్‌లో నిందితుడు)

రాజాం సిటీ: అతనో దివ్యాంగుడు. నిత్యం ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టు ప్రాంగణంలో తిష్ఠ వేస్తుంటాడు. ఎవరైనా పనిపై కార్యాలయాలకు వచ్చిన దివ్యాంగులను పరిచయం చేసుకుని వారి బలహీనతలు తెలుసుకుంటాడు. అనంతరం వారికి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులివ్వాలని వసూలు చేస్తాడు. అలా డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డి.నవీన్‌కుమార్ గురువారం వెల్లడించారు. రాజాం మండలం ఎం.జెవలస పంచాయతీ గెడ్డవలసకు చెందిన ముదిలి వెంకటరమణ దివ్యాంగులను టార్గెట్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. కోర్టు సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న దివ్యాంగులతో పరిచయాలు పెంచుకుని ప్రభుత్వ పరంగా పథకాలతోపాటు లోన్లు చేయించడం, ఉద్యోగాలు ఇప్పించడం వంటివి చిటికెలో పని అంటూ నమ్మిస్తాడు. అందులో భాగంగా రేగిడి ఆమదాలవలస మండలం లచ్చారాయపురం గ్రామానికి చెందిన దివ్యాంగ మహిళ మజ్జి రాముడుకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ఆశ పడిన ఆమె సుమారు రూ.7.50 లక్షల వరకు ముట్టజెప్పింది. మూడేళ్లయినా ఇంతవరకు ఉద్యోగం లేదు. సరికదా డబ్బులు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించి ఈ నెల 15న రేగిడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ విషయంపై ఆరా తీయడంతో మరిన్ని వివరాలు బయటపడ్డాయి. ఆమె ఒక్కరే కాకుండా మరికొంతమంది బాధితులు కూడా ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాధితుల్లో బొద్దాం గ్రామానికి చెందిన గంగ్రేటి కమల (రూ.10వేలు), రాగోలు చందు (రూ.5వేలు), బంగారి బుజ్జి (రూ. 25వేలు), సురవరం వెంకటరమణ (రూ.15వేలు)లు ఉన్నారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ నవీన్ కుమార్ సూచించారు. మజ్జి రాముడు ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

రెండు పూటలా ఉపాధి పని

● డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి



వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

డెంకాడ: ఉపాధి పనులు రెండు పూటలా చేపట్టాలని డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి అన్నారు. మండలంలోని పెదతాడివాడ పంచాయతీ చుక్కవానిచెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొలతల ప్రకారం పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కొత్త పనులు గుర్తించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వై.వెంకటరమణ, టీఏ డి.సునీత, ఎఫ్ఏ ఏ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

డెంకాడ: వచ్చే నెల 3,4 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీహెచ్ పావని తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థి



రాష్ట్ర జట్టుకు ఎంపికైన ప్రసాద్

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పి. ప్రసాద్ ఈ నెల 16న పార్వతీపురం ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న పోటీల్లో ప్రసాద్ పాల్గొంటాడు. ఈ మేరకు ప్రసాద్‌ను పాఠశాల హెచ్ఎం కె. సూర్యనారాయణ, వసతిగృహ సంక్షేమాధికారి అనురాధ, పీడీ రామచంద్రుడు, పీఈటీ జయకర్ జాన్సన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రొఫెసర్ శాంతమ్మ సేవలు వెలకట్టలేనివి



ప్రొఫెసర్ శాంతమ్మను సత్కరిస్తున్న మహర్షి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థుల అభ్యున్నతికి ప్రొఫెసర్ శాంతమ్మ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహర్షి సాగర్ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో 89 ఏళ్ల ప్రొఫెసర్ శాంతమ్మను గురువారం ఘనంగా సన్మానించారు. వయసు మళ్లినప్పటికీ నేటికీ విద్యార్థులకు పాఠాలు బోధించడం సామాన్య విషయం కాదని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ డిస్కాన్ సమావేశాలకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ బీపీఎస్ రామయ్య

విజయనగరం: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఐదు జిల్లాలకు సంబంధించిన డిస్కాన్ సమావేశం ఈ నెల 20వ తేదీన సూజాత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ బీపీఎస్.రామయ్య తెలిపారు. గురువారం స్థానిక పంచముఖ హనుమాన్ ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సమావేశానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు శంకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ డిమ్స్ రాజు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఏవీ కృష్ణారావు, జోన్ చైర్మన్ కుసుమంచి వెంకటరావు, సభ్యులు పెంటపాటి కామరాజు, సముద్రాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానార్జన

విజయనగరం అర్బన్: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ అన్నారు. జిల్లా గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే పస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. సామాజిక పరివర్తన, మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయకర్త బి.రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

,చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

నెల్లిమర్ల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదిత్య పాఠశాల విద్యార్థులకు గురువారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తకపఠనం వల్ల కలిగే ప్రయోజనాలను పాఠశాల ప్రిన్సిపాల్ వి.అమృత, లైబ్రేరియన్ లక్ష్మి వివరించారు.

క్విజ్ పోటీలు

డెంకాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ ఎం. మోహన్‌రావు, ఎస్ఎస్ఎస్ పీఓ ఎం. హనుమంతురావు, ప్రిన్సిపాల్ ఎం.ఆదినారాయణ, పీడీ ఎం.గోవిందరావు, అధ్యాపకులు ఆర్‌వీ రమణమూర్తి, ఆర్.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



డెంకాడ: క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న చిత్రలేఖనం పోటీలు

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో వందమంది వరకు పాల్గొని వివిధ అంశాలపై గీసిన చిత్రాలు ఆలోచింపజేశాయి. గ్రంథాలయ కార్యదర్శి ఎస్.లలిత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యమల్లె పుస్తకావిష్కరణ

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'నిత్యమల్లె' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, పుస్తక రచయిత కొంకెపూడి అనురాధ, సాహితీవేత్తలు, రచయితలు దూరి వెంకటరావు, జీఎస్ చలం , వీవీఎల్ సుబ్బారావు, సంఘ వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, మాజీ కార్యదర్శి బాలకృష్ణ, సాహితీవేత్తలు చీకటి దివాకర్, చంద్రికారాణి, మానాపురం రాజా, చంద్రశేఖర్, ఇనపకుర్తి చిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

● మనజు సంస్థ స్టేట్ కన్సల్టెంట్ కంచన్ భగవత్



పరీక్షను పరిశీలిస్తున్న కంచన్ భగవత్

విజయనగరం ఫోర్ట్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని మనజు సంస్థ స్టేట్ కన్సల్టెంట్ కంచన్ భగవత్ అన్నారు. ఆత్మ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీలో వ్యవసాయ అధీకృత డీలర్లకు గురువారం నిర్వహించిన డిప్లమా కోర్సు ఫైనల్ ఇయర్ పరీక్షను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు అందించే డీలర్లకు వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కోర్సు ప్రవేశపెట్టిందని తెలిపారు. 48 వారాల పాటు కోర్సు నిర్వహిస్తారని చెప్పారు. శిక్షణలో విత్తన, ఎరువులు, పురుగు మందుల చట్టాల గురించి వివరిస్తారన్నారు. అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలకు ఆశిస్తున్న తెగుళ్లు, తీసుకోవాల్సిన చర్యలపై అవతగాహన కలిప్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్, ఫెసిలిటేటర్ గులిపల్లి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడికి నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో నియమితులైన సభ్యులకు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నియామకపత్రాలు అందజేశారు. ఇటీవల కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో పలువురు ఎన్జీఓ సభ్యులను నియమించగా..విజయనగరం యూత్ ఫౌండేషన్ ప్రతినిధి రాము ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాతూ సామాజిక సేవ కార్యక్రమాల్లో ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకున్న విజయనగరం యూత్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు కమిటీలో స్థానం దక్కించుకోవటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్, సభ్యులు అశోక్, సాయి, శరత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమం



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం ఫూల్‌బాగ్: కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమం తప్పదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. గురువారం స్థానిక అమర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో భవన నిర్మాణరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నవంబర్ 26 నుంచి రాజమండ్రిలో జాతీయ స్థాయి ఏడో మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సభలకు సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మజ్జి ఆదిబాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.గురువారెడ్డి, కార్యదర్శి ఆల్తి మారయ్య, సరగడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నీ మనసైన కథలే..

విజయనగరం టౌన్: రచయిత జీవీ శ్రీనివాస్ రాసిన కథలన్నీ మనసైనవేనని సహజ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు ఎన్‌కే బాబు అన్నారు. గురువారం స్థానిక గురజాడ గ్రంథాలయంలో సహజ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మనసైన కథలు పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ, మంచి వక్తిత్వంతో రాసిన కథలన్నీ హృద్యంగా ఉంటాయని చెప్పారు. అనంతరం రచయితను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి



విద్యార్థులకు హిందీ ప్రమాణ పత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం శ్యామలాసాయి

చీపురుపల్లి: విద్యార్థులు రాజభాష అయిన హిందీపై పట్టు సాధించాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్యామలాసాయి అన్నారు. దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో 2022 సెప్టెంబర్‌లో నిర్వహించిన హిందీ పరీక్షకు పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు హాజరై ఉత్తీర్ణత సాధించారు. వారికి పాఠశాలలో గురువారం హిందీ ప్రమాణ పత్రాలు పంపిణీ చేశారు. హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలోని ఏ ప్రాంతంలో అయినా ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీపీఎస్ లక్ష్మి, పి.రవిశంకర్, పి.కుమారస్వామి, ఎం.శ్రీనివాసరావు, ఏవీఎస్ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం వి.పి.రేగ పంచాయతీ విజయరాంపురం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొనిశ కృష్ణంనాయుడు గురువారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.1500 చొప్పున సాయం అందజేవారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. వారి వెంట ఎంపీటీసీ కడుమల రాంబాబు, వైస్ సర్పంచ్ పాసి రాము, తాటిగూడ పీఏసీఎస్ అధ్యక్షుడు యడ్ల అప్పారావు, వలిరెడ్డి లక్ష్మణ, అలమండ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

ఎన్ఈపీపై అవగాహన తప్పనిసరి



పవర్‌ప్రెజెంటేషన్‌తో అవగహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ సీతారామరాజు

విజయనగరం అర్బన్: నూతన జాతీయ విద్యా విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల రిసోర్స్‌పర్సన్ డాక్టర్ పీఎస్ సీతారామరాజు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక మహరాజా అటానమస్ కళాశాల ఆవరణలో 'నూతన విద్యావిధానం – 2020' అనే అంశంపై గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి దోహదపడే సంస్కరణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఈపీపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ రచన 'మహాప్రస్థానం', అబ్దుల్ కలాం రచించిన 'వింగ్స్ ఆఫ్ ఫైర్' పుస్తకాలపై విద్యార్థులకు రివ్యూ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, లైబ్రేరియన్ డి.ఎరుకునాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను సందర్శించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి

విజయనగరం రూరల్: నవరత్నాలు – అందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లను ప్రతి శనివారం అధికారులు పరిశీలించాలని మండల ప్రత్యేకాధికారి బి. అరుణకుమారి ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాల పరిశీలనకు తొమ్మిది మంది అధికారులతో కూడిన మండల బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ప్రతి శనివారం కాలనీల్లో పర్యటించి లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. డిసెంబర్ 20 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంతో పనిచేయాలి



చెల్లూరులో ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరావు, తదితరులు

● ఎంపీడీఓ గంటా వెంకటరావు

విజయనగరం రూరల్: గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత చేపట్టాలని ఎంపీడీఓ గంటా వెంకటరావు ఆదేశించారు. మండలంలోని బియ్యాలపేట, చెల్లూరు గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వచేసి, గ్రీన్ అంబాసిడర్లకు అందించేటట్లు ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, చెల్లూరు, బియ్యాలపేట పంచాయతీ కార్యదర్శులు పి.రామకృష్ణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసకులను సిద్ధం చేయండి

● వయోజన విద్య డీడీ సుగుణాకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సుగుణాకరరావు

నెల్లిమర్ల: చిట్టి గురువులు కార్యక్రమం ద్వారా త్వరలో నిర్వహించనున్న పరీక్షకు అభ్యాసకులను సిద్ధం చేయాలని వయోజన విద్య డీడీ కోట్ల సుగుణాకరరావు ఆదేశించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని 20 వార్డులకు సంబంధించి మరో 15 రోజుల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. అప్పటికి అభ్యాసకులను సిద్ధం చేయాలని సూచించారు. తద్వారా పట్టణాన్ని సంపూర్ణ అక్షరాస్యత పట్టణంగా తీర్చిదిద్దడానికి సహకరించాలన్నారు. పరీక్ష పేపర్ విధానం, నిర్వహణ, తదితర అంశాలను ఎంఎల్ఓ ఆల్తి మురళీకృష్ణ వివరించారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, మెప్మా సీఎంఎం డి. గోవిందరావు పాల్గొన్నారు.

రెల్లివలసలో కుంటుపడిన అభివృద్ధి



మాట్లాడుతున్న పతివాడ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస సర్పంచ్ అసమర్థత వల్లే గ్రామంలో అభివృద్ధి కుంటుపడిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్ర భవని నిర్మిస్తున్నా ఉపాధి బిల్లులు మంజూరు చేయడానికి సర్పంచ్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. అలాగే మరుగుదొడ్ల ఏర్పాటుకు ప్రైవేట్ స్థలం కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నా సహకరించడం లేదన్నారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, కొత్తకోట శ్రీరాములు, టొంపల సీతారాములు పాల్గొన్నారు.

వెలమల ఐక్యతను చాటిచెప్పాలి




సమావేశంలో మాట్లాడుతున్న లగుడు

విజయనగరం ఫోర్ట్: వెలమల ఐక్యతను చాటిచెప్పాలని వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 20న విశాఖపట్నంలోని ముడసర్లలోవలో నిర్వహించనున్న కార్తీక వనసమారాధన కార్యక్రమానికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ హాజరై వెలమల ఐక్యతను చాటిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, బొత్స స్వామినాయుడు, జుత్తు లక్ష్మి, తదితతరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల జీవితాలకు భరోసా

● ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
● భీమాళిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవితాలకు చక్కటి భరోసా లభించిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని భీమాళి గ్రామంలో గురువారం రెండో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఉపాధిహామీ నిధులు, ఆరోగ్యశాఖ నిధులు రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గడపగడకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా?అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు అగ్రిగోల్డ్ బాధితులు తాము అగ్రిగోల్డ్‌లో దాచుకున్న డబ్బులు తిరిగి చెల్లించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపాయన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మూడున్నరేళ్ల పాలనలో మేనిఫెస్టోలో పెట్టిన హామీలలో 98 శాతం హామీలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్, ఉప సర్పంచ్ కొయ్యాన కృష్ణ, మిడతాన గణేష్, ఎంపీటీసీ ఎం.శ్రీనురాజు, పార్టీ నాయుకులు పెదిరెడ్ల వెంకటేష్, జెక్కాన సింహాద్రప్పుడు, కశిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భీమాళిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెలే కడుబండి శ్రీనివాసరావు

'అపే క్లాసిక్' ధర రూ.2.88 లక్షలు

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో అపే క్లాసిక్ డీజిల్ ఆటో ధరను రూ.2,88,722గా నిర్ణయించినట్లు పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలిపింది. ఇప్పటికే 30 లక్షలకు పైగా విక్రయించిన క్లాసిక్ ఆటోలను వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఆధునీకరించిన ఫీచర్లతో, తాజా నియంత్రణ ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా మార్కెట్‌లోకి తిరిగి విడుదల చేసినట్లు పేర్కొంది. 435 సీసీ ఇంజన్, 10 లీటర్ల ఇంధన ట్యాంక్ సామర్థ్యంతో లభించే ఈ ఆటోలను 42 నెలల వారెంటీతో అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఆటోలో విశాలవంతమైన డ్రైవర్ కేబిన్, తగినంత లగేజీ స్పేస్ ఉండటం వల్ల ప్రతి ప్రయాణం సౌకర్యంగా ఉండటంతో పాటు వినియోగదారులకు అధికాదాయాన్ని అందిస్తుందని పేర్కొంది.

ముత్తంశెట్టి ఆడియో వ్యవహారంలో యూట్యూబ్ చానల్‌కు నోటీసులు

పీఎంపాలెం: భీమిలి ఎమ్మెల్యే, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా ఆడియో ప్రచారం చేసిన యూట్యూబ్ చానళ్లపై విశాఖ నగర సైబర్ క్రైమ్ విభాగం దర్యాప్తు వేగవంతం చేసింది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఎనిమిది యూట్యూబ్ చానళ్లకు గత నెల 25న, మరో యూట్యూబ్ చానల్‌కు బుధవారం నోటీసులు పంపించింది. దీనికి సంబంధించిన వివరాలు సైబర్ క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ తెలిపిన మేరకు.. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా కొన్ని యూట్యూబ్ చానళ్లు ఆడియోను ప్రచారం చేశాయి. అప్పట్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆధారాలు లేకుండా ప్రచారం చేసి.. మంత్రి (ప్రస్తుతం ఎమ్మెల్యే) ప్రతిష్టకు భంగం కలిగించిన చానళ్లపై చర్యలు తీసుకోవాలని ఆయన పీఏ రామారావు 2021 ఆగస్టు 19న సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తంబోల టీవీ, చట్టం, ఓపెన్ టాక్, ఆంధ్రా టీవీ, సీఎంటీవీ, టాప్ ట్రెండింగ్, మూవీ బ్లాండ్స్, టాప్ తెలుగు టీవీ యూట్యూబ్ చానళ్లకు గత నెల 25న నోటీసులు జారీచేశారు. ఆడియో ఎక్కడ నుంచి, ఎలా వచ్చిందో తెలపాలని నోటీసులో నిర్దేశించారు. సైబర్ క్రైమ్ పోలీసుల నోటీసులు అందుకున్న సీఎంటీవీ, టాప్ తెలుగు టీవీ యూట్యూబ్ చానళ్లు తమ తప్పును అంగీకరిస్తూ.. తమ చానళ్ల నుంచి ఆడియో రికార్డ్‌ను డిలీట్ చేస్తున్నట్లు క్రైమ్ పోలీసులకు వివరణ ఇచ్చాయి. గత 27న సీఎంటీవీ, 31న టాప్ తెలుగు చానళ్ల నిర్వాహకులు నోటీసులకు సమాధానం ఇచ్చారు. తాజాగా అనిల్‌కుమార్ యాదవ్ దేశ్‌ముఖ్ తన యూట్యూబ్ చానల్ ద్వారా పాత ఆడియోనే అటు ఇటు చేసి ప్రచారం చేశాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి పీఏ కోలా చంద్రశేఖర్ ఈ నెల 11న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం కేసు నమోదు చేసి ఆ యూట్యూబర్‌కు నోటీసులు ఇచ్చారు.

దేశ చరిత్రలోనే 'గృహ'త్తర అధ్యాయం

- జగనన్న ఇళ్లపై మేధావులు, ప్రజా సంఘాల నేతల మనోగతం
- మహిళా సాధికారతకు నిదర్శనం
- రాజకీయాలకు అతీతంగా అందరూ స్వాగతించాలని హితవు



గుంటూరులో పేదల ఇళ్లు - రాజకీయ సవాళ్లపై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పాత గుంటూరు : గతంలో ఇంటి స్థలం కావాలంటే రోజుల తరబడి పోరాడాల్సి వచ్చేదని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని మేధావులు, ప్రజా సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. 'పేదల ఇళ్లు – రాజకీయ సవాళ్లు' అంశంపై మేధావులు, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని ఎన్జీవో హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజా పార్టీ వ్యవస్థాపకుడు జి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పేదల ఇళ్లపై రాజకీయం చేస్తున్న పలు పార్టీల వైఖరిని ఎండగట్టారు.

విపక్షాల రాద్ధాంతం తగదు



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడి అర్హులందరికీ ఇళ్లు కట్టించి ఇస్తుండటం గొప్ప విషయం. విపక్షాలు విజ్ఞత కోల్పోయి విమర్శలు చేయడం తగదు.

– ఆచార్య డీఏఆర్ సుబ్రహ్మణ్యం, మహాత్మా గాంధీ కళాశాల వ్యవస్థాపకుడు

బాబు, పవన్ రాజకీయాలకు తగరు



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని సీఎం వైఎస్ జగన్ ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నారు. నా దృష్టిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ రాజకీయ నేతలే కారు. ప్రజల బాధలు పట్టనోళ్లు రాజకీయాలకు తగరు.

– ఆచార్య గురవయ్య, ఏసీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్

ఇది స్వర్ణయుగం



గుప్తుల స్వర్ణ యుగం గురించి మనం పుస్తకాలలో చదువుకున్నాం. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ పాలనలో దానిని ప్రత్యక్షంగా చూస్తున్నాం. అందరికీ ఇళ్లు ఇవ్వడం అనేది అతిపెద్ద యజ్ఞం.

– చక్రపాణి, విశ్రాంత ఎస్పీ

పేదల ఇళ్లు - పవర్‌స్టార్ కన్నీళ్లు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇళ్లను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం మహిళా సాధికారతకు నిదర్శనం. పేదల ఇళ్లు–పవర్ స్టార్ కన్నీళ్లు అనే నినాదంతో మహిళలంతా ఉద్యమిస్తే కానీ వాళ్లకు బుద్ధి రాదు.

– మంజుల, సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త

సీఎం నిజమైన ప్రజా పాలకుడు



ఏకంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు కట్టించి ఇచ్చే బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టడం గొప్ప విషయం. జగనే నిజమైన ప్రజా పరిపాలకుడు.

– గోళ్లమూడి రాజసుందరబాబు, విద్యా వ్యవస్థాపకులు

రాజకీయాలకు అతీతంగా హర్షిద్దాం



గతంలో ఇళ్ల స్థలాలు కావాలంటే రోజుల తరబడి ఆందోళన చేయాల్సి వచ్చేది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఇది అందరూ హర్షించదగ్గ అంశం.

– జి.శ్రీనివాస్, ఆంధ్ర రాష్ట్ర ప్రజా పార్టీ వ్యవస్థాపకుడు

గొప్ప విషయం



ప్రజలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం 71,811 ఎకరాల భూమి సేకరించింది. నిరుపేదల ఇళ్ల కోసం మొత్తం 25 వేల ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. రూ.11 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇది వాస్తవం.

– పరిశపోగు శ్రీనివాసరావు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు

పవన్ ఆందోళన హాస్యాస్పదం



జగనన్న ఇళ్లపై పవన్ కళ్యాణ్ ఆందోళన హాస్యాస్పదం. జగనన్న ఇళ్లు – జనసేనాని కన్నీళ్లు అని కార్యక్రమం పేరు మార్చితే బాగుంటుంది.

– భగవాన్ దాస్, రాష్ట్ర విద్యార్థి ఉద్యమ నేత

గూడు చెదరగొట్టే కుట్ర



అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలకు ముఖ్యమంత్రి జగన్ కల్పిస్తున్న గూడు చెదరగొట్టేందుకు రాష్ట్రంలో ఒక పెద్ద కుట్ర జరుగుతోంది. దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

– తిప్పాబత్తుని గోవింద్, ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఇది సరికొత్త చరిత్ర



తాడి తన్నేవాడి తల తన్నేవాడే జగన్. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్ని ఎత్తులు వేసినా.. వాటికి పైఎత్తు వేసి చిత్తు చేయగల సమర్థుడు. ఇళ్ల నిర్మాణం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించారు.

– వేముల భారతి, అస్మిత మహిళా మండలి అధ్యక్షురాలు

పవన్‌కొచ్చిన నొప్పేంటి?



సొంత ఇంటి కోసం ఎన్నో ఇక్కట్లు పడ్డాం. సీఎం జగన్ పుణ్యాన ఇప్పుడు సొంతింటిలో దర్జాగా ఉంటున్నాం. మాలాంటోళ్లకు జగనన్న ఇళ్లు ఇస్తే మీకొచ్చిన నొప్పేమిటి?

– రత్నకుమారి, ఇంటి లబ్ధిదారురాలు

• తెలంగాణ

'లైగర్' పెట్టుబడులపై ఈడీ నజర్

- విచారణకు హాజరైన నిర్మాతలు పూరీ జగన్నాథ్, చార్మి
- పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చాయన్న దానిపై సుదీర్ఘ విచారణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఒక్కసారిగా దూకుడు పెంచింది. లిక్కర్ స్కామ్, కేసినో కేసుల్లో వరుసగా సోదాలు, విచారణలు చేస్తున్న ఈడీ గురువారం పాన్ ఇండియా మూవీ లైగర్‌లో పెట్టుబడులపై ఆ చిత్ర నిర్మాతలను సుదీర్ఘంగా ప్రశ్నించింది. లైగర్ చిత్ర నిర్మాణంలో ఎవరెవరు పెట్టుబడులు పెట్టారన్న అంశంలో విచారణ చేపట్టింది. ఈ సినిమాలో రాజకీయ ప్రముఖులు పెట్టుబడులు పెట్టారని వచ్చిన ఫిర్యాదు, ఈడీ అధికారులు సేకరించిన సమాచారం ఆధారంగా లైగర్ దర్శకుడు, నిర్మాత పూరీ జగన్నాథ్‌తోపాటు మరో నిర్మాత చార్మిని అధికారులు గురువారం విచారించారు. ఉదయం పదిన్నర గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు 10 గంటల పాటు విచారణ సాగింది. ఈ సినిమా పెట్టుబడుల్లో మనీ లాండరింగ్ జరిగినట్లు, ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు అందిన సమాచారం మేరకు పూరీ జగన్నాథ్, చార్మిలకు పదిహేను రోజుల కిందటే ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి పిలిచి విచారణ చేపట్టారు. ఓ రాజకీయ పార్టీకి చెందిన నేత పెట్టుబడుల అంశంపై ప్రశ్నించారు. సినిమాకు చేసిన వ్యయం.. చెల్లింపులు ఎలా జరిగాయి.. ఆ డబ్బంతా ఎక్కడ నుంచి సమకూర్చుకున్నారు.. ఫైనాన్స్ చేసిన వాళ్లు ఎవరు.. వారు ఎంత పెట్టుబడి పెట్టారు.. నగదు లావాదేవీలెలా జరిగాయి... తదితర అంశాలపై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. వారి నుంచి మొత్తం సమాచారం రాబట్టుకోవడానికి అధికారులు ప్రయత్నించినట్లు తెలిసింది. ఇక్కడి రాజకీయ ప్రముఖులతోపాటు, విదేశీ పెట్టుబడులు ఏమైనా వచ్చాయా? అనే దానిపై కూపీ లాగినట్లు సమాచారం. పలు సంస్థల నుంచి వీరి అకౌంట్లోకి నిధుల రాక, నిర్మాతలుగా వీరు చేసిన చెల్లింపులు, బ్యాంక్ అకౌంట్ల వివరాలను వారి ముందుంచి విచారించినట్లు చెబుతున్నారు.

కేసీనో కేసులోనూ..

విదేశాలకు తీసుకెళ్లి చీకోటి ప్రవీణ్‌కుమార్ కేసినో ఆడించిన కేసులో మరో ఇద్దరిని ఈరోజు ఈడీ విచారించింది. అనంతపురం మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఊర్వశి బార్ యజమాని యుగంధర్‌ను కూడా ఈడీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఫెమా చట్ట నిబంధనల ఉల్లంఘన, హవాలా చెల్లింపులపై సేకరించిన వివరాల ఆధారంగా వారిని ప్రశ్నించారు.

బీఎల్ సంతోష్‌కు సిట్ నోటీసులు

- తుషార్, బండి అనుచరుడు శ్రీనివాస్‌కు కూడా..
- ఎమ్మెల్యేలకు ఎర కేసులో కీలక మలుపు

సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర' కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసుకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డ్‌లలో రామచంద్రభారతి పలుమార్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, తుషార్ పేర్లు ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈనెల 3న సీఎం కేసీఆర్ విడుదల చేసిన ఆడియో, వీడియో రికార్డ్‌లలోనూ వీరి పేర్లు బహిర్గతమయ్యాయి. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ వీరిని విచారించాలని నిర్ణయించింది. ఈ మేరకు బీఎల్ సంతోష్, తుషార్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వీరితోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమీప బంధువు, అనుచరుడైన శ్రీనివాస్‌కు కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ కేసులో నిందితులు రామచంద్రభారతి, తిరుపతికి చెందిన స్వామి సింహయాజీలు హైదరాబాద్ వచ్చేందుకు శ్రీనివాస్ విమాన టికెట్లు బుక్ చేసినట్టుగా విచారణలో గుర్తించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే శ్రీనివాస్‌కు కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. బీఎల్ సంతోష్, తుషార్, శ్రీనివాస్ ముగ్గురూ ఈ నెల 21న రాజేంద్రనగర్‌లోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక సిట్ కార్యాలయంలో హాజరు కావాలని అధికారులు ఆదేశించారు. కాగా తెలంగాణ హైకోర్టు సిట్ దర్యాప్తును పర్యవేక్షిస్తోంది. ఈ నెల 29 నాటికి సీల్డ్ కవర్‌లో దర్యాప్తు పురోగతి నివేదికను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.

ఇంట్లో లేని తుషార్..

తుషార్ కేరళలో బీజేపీకి మిత్రపక్షమైన భరత్ ధర్మ జనసేన (బీడీజేఎస్) అధినేత. కాగా కేరళలో కొచ్చి ప్రాంతానికి చెందిన ఓ వైద్యుడు రామచంద్రభారతి, తుషార్‌కు మధ్యవర్తిత్వం వహించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆయనకోసం నల్లగొండ ఎస్పీ, సిట్ సభ్యురాలు రెమా రాజేశ్వరీ బృందం కేరళలో దిగింది. పోలీసుల రాకను ముందుగానే పసిగట్టిన వైద్యుడు పరారైనట్లు తెలిసింది. దీంతో స్థానిక పోలీసులు సహాయంతో సిట్ బృందం పరారీలో ఉన్న వైద్యుడి కోసం గాలిస్తోంది.

పట్నా హైకోర్టుకు జస్టిస్ అభిషేక్‌రెడ్డి బదిలీ

సాక్షి, ఢిల్లీ: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్ రెడ్డిని పట్నా హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ సిఫార్సుపై రాష్ట్రపతి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. జస్టిస్ అభిషేక్‌రెడ్డి 2019, ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

సీఎం మేలు మరచిపోలేం


సమావేశమైన పాస్టర్లు

సాలూరు: పాస్టర్లకు గౌరవ వేతనంగా ప్రతి నెలా 5 వేల రుపాయలు అందజేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ మేలును మరచిపోలేమని ఏపీపీఎఫ్ మన్యం జిల్లా ప్రెసిడెంట్ రవ్వ జయరాజ్ తెలిపారు. మండలంలోని బట్టివలసలో మండల ట్రైబల్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ తిమోతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌరవ వేతనం అందుకోని పాస్టర్లు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు జి.సూర్యనారాయణ, సువార్తరావు ఉన్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

కొత్తవలస రూరల్: మండలంలోని మంగళపాలెం గ్రామంలో 8 కిలోల గంజాయిని కొత్తవలస పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొడ్డి వెంకట లక్ష్మి, అతని కుమారుడు రాజేంద్రపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ క్రమంలో రాజేంద్రకు చెందిన చైన్, మండచైన్ కనిపించకుండా పోయాయి. దాడిచేసిన వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించే క్రమంలో... పెందుర్తికి వెళ్లేందుకు ఓ ఆటోను మంగళపాలెం గ్రామస్తులు బుక్ చేశారు. ఆటోలో గంజాయిని గుర్తించారు. దాడి చేసినవారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

నేడు చినమేరంగిలో జాబ్‌మేళా

పార్వతీపురం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చినమేరంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు స్కిల్‌డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ వి.సాయికుమార్ తెలిపారు. పది ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని చెప్పారు. 13 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని, ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.10వేలు నుంచి రూ.30వేలు వరకు వేతనం చెల్లిస్తాయన్నారు. నిరుద్యోగులైన అభ్యర్థులు తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు వారి బయోడేటా, ఒరిజనల్ సర్టిఫికెట్స్, జెరాక్స్‌లు, నాలుగు ఫొటోలు తీసుకుని జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 89788 78557, 63051 10947, 63034 93720, 85559 09899 నంబర్లను సంప్రదించాలన్నారు.

పీఎం శ్రీతో విద్యార్థుల సమగ్ర ప్రగతి

- యూడైస్ 2021 – 22 ప్రామాణికంగా పాఠశాలల అర్హత
- ఎంపికైన పాఠశాలలకు కేంద్రం ఆర్థిక సహకారం
- జిల్లాలో 259 పాఠశాలలకు దరఖాస్తు చేసుకునే అర్హత
- నేటితో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి


పిఎం శ్రీకి ఎంపికైన పాలకొండ పెద్దకాపువీది జెడ్పీ ఉన్నత పాఠశాల

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలలను మనబడి నాడు – నేడు పథకం కింద జగనన్న ప్రభుత్వం బాగుచేస్తోంది. అదనపు హంగులు అద్దుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం-శ్రీ) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యంత నాణ్యతతో కూడిన విద్యను ఈ పథకం కింద అందనుంది. యూడైస్ 2021 – 22 ద్వారా విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థుల సమగ్ర ప్రగతికి పీఎం శ్రీ పథకం కింద నిధులు అందుతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పథక అమలు బాధ్యతలు చూసేందుకు జిల్లా విద్యాశాఖాధికారి నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 686 పాఠశాలలు అర్హత సాధించగా పార్వతీపురం మన్యంలో 259 పాఠశాలలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత సాధించాయి. ఉమ్మడి జిలాల్లో ఇప్పటివరకు 238 పాఠశాలలు దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేశాయి.

దశల వారీగా నిధులు

పీఎం శ్రీ పథకంలో దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను నిపుణుల కమిటీ ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపికైన పాఠశాలలకు దశల వారీగా నిధులను అందజేస్తారు. ఆ నిధులతో పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలను సమకూర్చుకోవచ్చు. ఎంపికైన పాఠశాలలను పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ స్కూల్స్‌గా మార్చుకోవాల్సి ఉంటుంది. పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్లను, ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి స్వయంగా సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకు కూరలు పండించాలి. పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి. వేస్ట్ మేనేజ్‌మెంట్, నీటి నిర్వహణ మొదలైనవి చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించాలి. అర్హత పొందిన పాఠశాలల్లో కేంద్రం అందించిన నిధులతో డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు తదితర సౌకర్యాల కల్పన, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ, ఎంపికైన పాఠశాలలకు ఆర్థిక, సాంకేతిక సహకారం పొందవచ్చు.

రిజిస్ట్రేషన్ ఇలా..

పీఎం శ్రీలో ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలు చేపట్టాల్సిన పనులపై జిల్లా విద్యాశాఖాధికారులకు వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించాలి. స్టెప్–1లో భాగంగా పాఠశాలలను రిజిస్ట్రేషన్ చేయాలి. స్టెప్–2లో పరిశీలన ప్రక్రియ ఉంటుంది. హెచ్ఎం లాగిన్ పీఎం శ్రీ పోర్టల్‌ను నమోదు చేసిన వెంటనే ఫోన్ నంబర్ ఓటీపీ వస్తుంది. దాని ద్వారా లాగిన్ అయిన తర్వాత అందులో పేర్కొన్న 42 అంశాలను పూర్తి చేయాలి. వీటితో పాటు హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శి, విద్యార్హత పత్రాలను అప్‌లోడ్ చేయాలి. తర్వాత కేంద్ర విద్యాశాఖ ఆయా పాఠశాలలకు మార్కులు వేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు 60 శాతం, పట్టణాల్లో ఉన్న పాఠశాలలకు 70 శాతం మార్కులు వస్తే ఈ పథకానికి అర్హత పొందుతాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 18లోపు పూర్తి చేయాలి.

అర్హత సాధించిన మొత్తం పాఠశాలలు	259
ట్రైబుల్ వెల్ఫేర్ ఆశ్రమ, రెషిడెన్షియల్ పాఠశాలలు	33
మోడల్ పాఠశాలలు	04
మినీ గురుకులాలు	02
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	28
ప్రైమరీ పాఠశాలలు	164
యూపీ పాఠశాలలు	28

ఎంపిక ఇలా..

- అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది.
- కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల నిర్వహణలోని పాఠశాలలు దరఖాస్తుకు అర్హత కలిగి ఉంటాయి.
- మూడంచెల ప్రక్రియ ద్వారా పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఆయా పాఠశాలలే నిర్దేశించిన ఫార్మేట్లో సంబంధిత వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఎంపికైన పాఠశాలలను జియో ట్యాగింగ్ చేసి, ఆయా పాఠశాలల్లోని కార్యకలాపాలను సమీక్షిస్తారు.
- ఏడాదిలో నాలుగుసార్లు ఈ పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్ ఓపెన్ అవుతుంది. ఆ సమయంలో మాత్రమే పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకోవచ్చు.
- అయితే పక్కా భవనం, బాలురకు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, తాగునీటి, విద్యుత్ సౌకర్యం, ఆట స్థలం వంటి వసతులు పాఠశాలల్లో కచ్చితంగా ఉండాలి.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి



ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలతో విద్య అందుబాటులోకి వస్తుంది. యూడైస్ ప్రకారం పాఠశాలల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన పాఠశాలలకు నేరుగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. అర్హత పొందిన పాఠశాలలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నాడు – నేడు ద్వారా ఇప్పటికే పాఠశాలలు నవీకరణ చెందాయి. పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు మరెన్ని నిధులు సమకూరటం ద్వారా అభివృద్ధి బాటలో నడిచే అవకాశం ఉంది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయని వారు వేగవంతం చేయాలి.

– ఎస్‌డీ రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంట


- ఏపీ కమ్యూనిటీ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రీజనల్ టెక్నికల్ ఆఫీసర్

రేగిడి: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సాగు పెట్టుబడి తగ్గడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని ఏపీ కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో సర్పంచ్ కరణం గోవిందరావు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని గురువారం సందర్శించి, ఆయనను అభినందించారు. అదే గ్రామానికి చెందిన ఐసీఆర్‌పీగా పనిచేస్తున్న పైల తవిటినాయుడు సాగుచేస్తున్న కూరగాయల సాగును, నాటుకోళ్ల పౌల్ట్రీ వంటి ప్రకృతి విత్తన, వనరుల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతులు ఇంటికి అవసరమైన కూరగాయలు, పండ్లు, అరటి కాయలను చక్కగా పండించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం పెద్దగా పెట్టుబడి అవసరం లేని వ్యవసాయమన్నారు. జీరో పెట్టుబడితో సేంద్రియ ఎరువును ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద తయారు చేసుకోవచ్చన్నారు. ఆవుపేడ, వేపాకులు, గోమూత్రం వంటి వాటితో జీవామృతాలు తయారు చేసుకుని పంటలకు వినియోగిస్తే ఫలసాయం ఎక్కువగా ఉంటుందని వివరించారు. రబీలో డ్రైవ్ సోయింగ్ పంటలను సాగు చేసుకోవడం ద్వారా నేలలు సారవంతంగా మారి, అవసరమైన ఖనిజాలను నిక్షిప్తం చేస్తాయన్నారు. సాగులో రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గి, ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ట్రైనీ మాస్టర్లు రమాదేవి, సీహెచ్.శారద, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనిబిల్లి రమణ, గుండాల రవి, పెనుబాక సురేష్, సింహాచలం పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణకు సహకరించాలి

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: పట్టణ పరిధిలో ఉన్న జాతీయ రహదారి విస్తరణ పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో రోడ్డు విస్తరణ పనులపై స్థానికులతో సమీక్షించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవనాలను యజమానులే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. శని, ఆదివారాల్లో పనులు ప్రారంభించుకోవాలన్నారు. దీనిపై ఇప్పటికే గజపతినగరంలో చాటింపు వేయడం జరిగిందన్నారు. రహదారి విస్తరణ పనులకు ఆటంకం కలిగించొద్దని, పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆయనతో పాటు స్థానిక సీఐ అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, డీఈఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.

23న శ్రీకాకుళంలో సీఎం పర్యటన


ప్రభుత్వ కళాశాల వద్ద సీఎం సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 23న నరసన్నపేటకు రానున్నారని కలెక్టర్ శ్రీ కేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు తెలిపారు. తొలుత 25న వస్తారని అనుకున్నా రెండు రోజులు ముందుగానే పర్యటన ఖరారైందని వీరు తెలిపారు. ఈ మేరకు గురువారం హెలీప్యాడ్, సభాస్థలి కోసం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధికలతో కలిసి ఎమ్మెల్యే కృష్ణదాస్ స్థల పరిశీలన చేశారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానం వద్ద విలేకరులతో మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, జమ్ము వద్ద హెలీప్యాడ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జమ్ము కూడలి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కళాశాల మైదానం వరకూ సీఎం రోడ్ షో ఉంటుందని అన్నారు. సభా ఏర్పాట్లను గురువారం రాత్రి నుంచే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, ఆర్డీఓ బి.శాంతి, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
శుక్రవారం ॥ 18-11-2022

ఫ్యాషన్

చలిని తట్టుకోవడానికి స్వెటర్ ఎంపిక సాధారణంగా ఉండాలని కోరుకోవడం లేదు నేటి నవతరం.
వాటి రంగులు, డిజైన్లు... ఆధునిక హంగులతో పోటీపడాలనుకుంటున్నారు.
యాంకిల్ లెంగ్త్‌లో హుషారెత్తించాలనుకుంటున్నారు.
సీతాకోక రెక్కలను ఒంటికి చుట్టేసుకున్నట్టు..
బబుల్ స్లీవ్స్‌తో 'భలే' అనిపించాలనుకుంటున్నారు.
అందుకు తగినట్టే... ఈ శీతకాలాన్ని శత హొయలు పోయేలా ఊలుదారాల అల్లికలను
తమదైన సృజనతో మెరిపించాలని పోటీపడుతున్నారు డిజైనర్లు.

వెచ్చని అల్లికలు









ఇంటిప్స్



ఇంట్లో స్విచ్ బోర్డులు నల్లగా అసహ్యంగా కనిపిస్తుంటే.. చూస్తూ కూడా వాటిని ముట్టుకుంటే షాక్ కొడుతుందన్న భయంతో ఏమీ చేయలేం. అయితే ఒక చిట్కా ఉంది. ముందుగా కరెంటును సరఫరా చేసే మెయిన్ స్విచ్‌ను ఆపాలి. తరువాత నెయిల్ పాలిష్ రిమూవర్ ను దూదితో తీసుకుని స్విచ్‌బోర్డు, స్విచ్‌లపైన రుద్దితే వాటి మీద ఉన్న మురికి, మరకలు పోతాయి.



స్టవ్‌మీద పాలు లేదా టీ పెట్టి మర్చిపోయినప్పుడు అవి మరిగి మరిగి గిన్నె కూడా నల్లగా మాడి పోతుంది. ఇలా మాడిన గిన్నెను శుభ్రం చేయాలంటే.. మాడిన గిన్నెలో సగానికి పైగా నీళ్లపోసి.. ఒక స్పూను వంటసోడా వేసి బాగా కలపాలి, తరువాత రెండు స్పూన్ల వెనిగర్ లేదా నిమ్మరసం వేసి మరోసారి నీళ్లను బాగా కలిపి స్టవ్ వెలిగించి ఈ గిన్నెను పెట్టాలి. ఐదు నిమిషాలు పెద్దమంట మీద ఉంచి తరువాత సన్నని మంటమీద నీళ్లను మరగనివ్వాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు గరిటతో తిప్పుతూ ఉండాలి. అప్పుడు గిన్నెకు అతుక్కున్న మాడిన పదార్థాలు ఊడి వస్తుంటాయి. నీళ్లు మరిగేటప్పుడే గరిటతో మాడిన చోట గీకేయాలి. దాదాపు వదిలింది అనుకున్న తరువాత స్టవ్ ఆపేసి నీళ్లను చల్లారనివ్వాలి. చల్లారాక నీళ్లను పారబోసి సబ్బుతో రుద్దాలి. ఇంకా ఏవైనా మచ్చలు మిగిలితే పీతాంబరి పొడివేసి రుద్దితే పూర్తిగా వదులుతాయి.

బ్యూటిప్



బ్లాక్‌హెడ్సా? భయం వద్దు..!

టొమోటోను నిలువుగా రెండు ముక్కలుగా కట్‌చేసి.. తురుముకోవాలి. తరువాత టమోటా తురుమును వడగట్టి రసాన్ని వేరు చేయాలి. ఈ రసంలో రెండు స్పూన్ల బియ్యంపిండి, స్పూను అలోవెరా జెల్, స్పూను పసుపు వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని దూదితో ముఖంపైన దళసరి మాస్కులాగ అప్లై చేసుకోవాలి. పదిహేను నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగి, తరువాత సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మృతకణాలు, బ్లాక్‌హెడ్స్ పోయి ముఖం నిగారింపును సంతరించుకుంటుంది.



లాన్స్‌నాయక్ మంజు

న్యూస్ మేకర్

గగనాన్ని జయించింది

ఆర్మీకి చెందిన లాన్స్‌నాయక్ మంజు స్కై డైవింగ్ చేసిన తొలి సైనికురాలిగా చరిత్ర సృష్టించింది. 10 వేల అడుగుల ఎత్తు నుంచి దూకి ఇటీవల ఆమె ఈ రికార్డు సాధించింది.

'పక్షి తన రెక్కలను విశ్వసించాలేగాని అంబరం అంచుల్ని చూడగలదు' అంది మంగళవారం రోజు 10 వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ (పారాచూటింగ్) చేసిన లాన్స్‌నాయక్ మంజు. భారత సైన్యంలో ఈ ఘనత సాధించిన తొలి వనితగా మంజు రికార్డు సృష్టించింది.

ఆర్మీలో మిలటరీ పోలీస్ విభాగంలో పని చేసే మంజును భారతసైన్యం ఈ ఫీట్ కోసం ఎంచుకుంది. ఇందుకోసం అడ్వెంచర్ వింగ్ ఆమెకు శిక్షణ ఇచ్చింది. మంగళవారం ఇద్దరు స్కైడైవర్లతో పాటు 'ఎ.ఎల్.హెచ్.ధ్రువ్' (అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్)లో నింగిలోకి ఎగిరిన మంజు పదివేల అడుగులకు చేరాక జంప్ చేసి తోటి స్కైడైవర్లతో పాటు కొన్ని సెకండ్ల పాటు ఉమ్మడి విన్యాసం చేసింది. ఆ తర్వాత పారాచూట్ విప్పుకుని సురక్షితంగా నేలకు దిగింది.

'మంజు సాధించిన ఈ ఘనత సైన్యంలో పని చేసే మహిళలకు స్ఫూర్తిదాయకం' అని ఆర్మీ అధికారులు వ్యాఖ్యానించారు.

రెండో ప్రపంచ యుద్ధం నుంచి

మన దేశంలో రెండో ప్రపంచ యుద్ధం నుంచి పారాచూట్ రెజిమెంట్ (1941 ఆవిర్భావం) ఉంది. కాని ఇది మగవారికి ఉద్దేశించబడింది. యుద్ధాల్లో మన సైన్యానికి పారాట్రూప్స్ విశేష సేవలు అందించాయి. అయితే ప్రయివేట్ వ్యక్తులు పారాచూటింగ్ చేయడానికి కూడా మన దేశంలో అనుమతులు అంత సులభం కాదు. శిక్షణ కూడా అంతంత మాత్రమే. అందుకే విదేశాలకు వెళ్లి స్కై డైవింగ్‌లో శిక్షణ తీసుకుంటూ ఉంటారు ప్రయివేటు వ్యక్తులు. మన దేశంలో స్కై డైవింగ్ చేసిన తొలి స్త్రీ ప్రయివేటు వ్యక్తి. రేచల్ థామస్ అనే కేరళ రైల్వే ఉద్యోగి 2002లో అది నార్త్ పోల్‌లో 7000 అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేసి ఈ రికార్డును సొంతం చేసుకోవడమే కాదు 'పద్మశ్రీ' కూడా అందుకుంది. ఇటీవల కాలంలో స్త్రీలు చాలామంది ప్రయివేటుగా స్కై డైవింగ్ నేర్చుకుని జంప్ చేస్తున్నారు.

మహిళల ముందంజ

ఇటీవల త్రివిధ దళాలలో పని చేస్తున్న స్త్రీలు రికార్డులు సాధించి వార్తల్లో నిలుస్తున్నారు. ఈ సంవత్సరం మే నెలలోనే కెప్టెన్ అభిలాష బరాక్ ఆర్మీ ఏవియేషన్‌లో మొదటి మహిళా ఆఫీసర్‌గా నియమితురాలైంది. గత సంవత్సరం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో మాయ సుదన్ మొదటి మహిళా ఫైటర్ పైలట్‌గా బాధ్యత పొందింది. ఫ్లయిట్ లెఫ్టినెంట్ హినా జైస్వాల్ మొదటి మహిళా ఫ్లయిట్ ఇంజనీర్‌గా తొలి అడుగు వేసింది. ఇవన్నీ ఘనకార్యాలే. వారి వరుసలో ఇప్పుడు మంజు చేరింది.

గగనాన్ని జయించాలని ఇటీవల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి యువతులు కూడా అభిలషిస్తున్నారు. సైన్యంలో చేరో ఏవియేషన్ చదువులు చదివో లేకుంటే కనీసం ఎయిర్ హోస్టెస్‌గా అయినా ఆకాశంలో విహరిస్తున్నారు.

అనుకోవాలే గానీ చేయొచ్చని నిరూపించే వీరంతా విజేతలే.

వంటిల్లు

శీతాకాలం పగలు తక్కువ.. రాత్రి ఎక్కువ. రాత్రి వేళల్లో చలి ఎక్కువ. భోజనం బరువుగా ఉండకూడదు. అలాగని తక్కువ తింటే పోషకాలందవు. కొద్దిగా తిన్నా సరే... అది సమతులంగా ఉండాలి. ఆహారాన్ని దేహం వెచ్చగా ఒంటబట్టించుకోవాలి. అందుకే... ఈ వారం వీటిని ట్రై చేసి చూడండి.

చలి తిండి

పాంజిరి




కావలసినవి: సన్నగా తరిగిన బాదం – కప్పు ; యాలకుల పొడి – ఒకటిన్నర టీ స్పూన్లు ; దోస గింజలు – పావు కప్పు ; తర్బూజ గింజలు – పావు కప్పు ; పిస్తా పప్పు – పావు కప్పు (తరగాలి) ; వాము – అర టీ స్పూన్ ; ఎండు కొబ్బరి తురుము – కప్పు ; అల్లం తరుగు లేదా శొంఠి పొడి– 2 టేబుల్ స్పూన్లు ; జీడిపప్పు– కప్పు (చిన్న పలుకులు); తామరగింజలు – కప్పు ; వాల్‌నట్ తురుము – 3 టేబుల్ స్పూన్లు ; కిస్‌మిస్ – 3 టేబుల్ స్పూన్లు ; నెయ్యి– 3 టేబుల్ స్పూన్లు.

ప్రధానమైన పదార్థాలు: సూజీ రవ్వ – కప్పు ; నెయ్యి – ఒకటిన్నర కప్పు ; గోధుమ పిండి – రెండున్నర కప్పులు ; బెల్లం పొడి – ఒకటిన్నర కప్పు.

తయారీ: ● మందంగా ఉన్న బాణలిలో నెయ్యి వేడి చేసి తామర గింజలు (మఖానియా) వేయించాలి. వాటిని తీసి పక్కన పెట్టుకుని అదే బాణలిలో జీడిపప్పు, వాల్‌నట్, బాదం, తర్బూజ, దోసగింజలు, పిస్తా, కొబ్బరి తురుము, కిస్‌మిస్ వేసి సన్నమంట మీద దోరగా వేయించాలి. ఇందులో అల్లం తరుగు లేదా శొంఠి, వాము, యాలకుల పొడి కలిపి పక్కన ఉంచాలి. ● ఇప్పుడు ప్రధాన దినుసులను వేయించాలి. మరొక బాణలిలో నెయ్యి వేడి చేసి గోధుమ పిండి వేసి సన్నమంట మీద వేయించాలి. గోధుమ పిండి వేగి మంచి వాసన వస్తున్న సమయంలో సూజీ రవ్వ వేసి కలుపుతూ వేయించాలి. రవ్వ కూడా దోరగా వేగిన తర్వాత బెల్లం పొడి వేసి కలపాలి. ఇందులో ముందుగా వేయించి సిద్ధంగా ఉంచిన గింజల మిశ్రమాన్ని వేసి కలిపితే పాంజిరి రెడీ. దీనిని కప్పులో వేసుకుని పొడిగా స్పూన్‌తో తినవచ్చు. పిల్లలు కింద పోసుకోకుండా మొత్తం తినాలంటే మరికొంత నెయ్యి వేసుకుని లడ్డు చేయాలి. ఇది ఉత్తరభారతదేశంలో బాలింతకు తప్పనిసరిగా పెట్టే స్వీట్. పాలిచ్చే తల్లికి తగిన శక్తినిచ్చే ఆహారం.

తిల్ పిఠా




కావలసినవి: బియ్యం – కప్పు ; నువ్వులు – కప్పు ; తాటి బెల్లం పొడి– 2 కప్పులు (ఎండు ఖర్జూరాల పొడి కూడా తీసుకోవచ్చు); ఎండు కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్లు; సోంపు గింజలు – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి నాలుగు గంటల సేపు నానబెట్టాలి. ఆ తర్వాత నీటిని వంపేసి మెత్తగా పొడి చేసుకుని ఆ పొడిని జల్లించి, పిండిలో తేమ ఆరి పోకుండా మూతపెట్టి ఉంచాలి. ● నువ్వులను వేయించి కొంచెం పలుకుగా పొడి చేయాలి. బెల్లం లేదా ఖర్జూరపు పొడిలో నువ్వుల పొడి, సోంపు గింజలు, ఎండు కొబ్బరి తురుము వేసి కలపాలి. ● పెనం వేడి చేసి గుప్పెడు బియ్యప్పిండి వేసి వేళ్లతో అట్టులా సర్దాలి. ఒక మోస్తరుగా కాలిన తర్వాత నువ్వులు– బెల్లం మిశ్రమాన్ని ఒక స్పూన్ వేసి మెల్లగా వేళ్లతోనే పరిచినట్లు సర్దాలి. బియ్యప్పిండి అట్టు కాలిన తర్వాత అట్లకాడతో పైకి లేపుతూ వేళ్లతో రోల్ చేయాలి. రోల్ చేసిన తర్వాత పది సెకన్లపాటు పెనం మీద ఉంచి తీసేయాలి. ● వెడల్పు పెనం అయితే రోల్‌ను ఒక పక్కన ఉంచి పెనం మధ్యలో మరో పిఠా చేసుకోవచ్చు. ఈ తిల్ పిఠాను వేడిగా తినవచ్చు, చల్లారిన తర్వాత కూడా బాగుంటుంది. వారం పాటు నిల్వ ఉంటుంది. ఇది అస్సాం వంట.

మెంతి పకోడి



కావలసినవి:
శనగపిండి– కప్పు ; బియ్యప్పిండి– పావు కప్పు ; మెంతి ఆకులు – కప్పు (కడిగి ఆరబెట్టాలి) ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినంత ; కారం పొడి – టీ స్పూన్ ; ఇంగువ – పావు టీ స్పూన్ ; వాము – అర టీ స్పూన్ ; కొత్తిమీర – అర టేబుల్ స్పూన్ (తరగాలి) ; ధనియాలు – టీ స్పూన్ ; పసుపు – అర టీ స్పూన్ ; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● శనగపిండిలో బియ్యప్పిండి, ఉప్పు కలిపి జల్లించాలి. ఒక గరిటెడు నూనె వేడి చేసి పిండిలో కలపాలి. ఇప్పుడు పిండిలో మెంతి ఆకు, కారం పొడి, ఇంగువ, పసుపు, వాము, ధనియాలు వేసి బాగా కలిపి రెండు–మూడు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. మెంతి ఆకు నుంచి నీరు పిండిలో కలుస్తుంది. ఇప్పుడు పిండిలో తగినంత నీటిని పోసి గట్టిగా కలుపుకోవాలి. ● బాణలిలో నూనె మరిగిన తర్వాత పిండిని పకోడీలుగా లేదా బాల్స్‌గా వేసుకోవాలి. దోరగా వేగిన తర్వాత నూనెలో నుంచి తీసి వేడిగా సర్వ్ చేయాలి. డయాబెటిస్ ఉన్న వాళ్లు మెంతిని రోజూ తీసుకుంటే మంచిది. వారంలో ఓ రోజు ఇలా రుచిగా ఆస్వాదించవచ్చు.

విజయపథం

ఆలోచనే ఆదాయం

చిన్నప్పుడెప్పుడో స్నేహితురాలికి సినిమా కథ చెప్పింది రమ్య. ఆ స్నేహితురాలు మరుసటిరోజే సినిమా చూసింది. 'ఆ సినిమా కంటే నువ్వు చెప్పిన విధానమే బాగుంది' అని రమ్యకు కితాబు ఇచ్చింది. ప్రతిభ వృథా పోదు అంటారు. రమ్యలోని ప్రతిభ కూడా అంతే. ఒక అంశాన్ని ఆకర్షణీయంగా చెప్పే ఆమె ప్రతిభ మార్కెటింగ్ రంగంలో తనకు ఎంతో బలాన్ని ఇచ్చింది.

'రమ్య రామచంద్రన్... యంగ్ ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్ ఎంటర్‌ప్రెన్యూర్'గా గుర్తింపు తెచ్చుకోవడానికి ఉపయోగపడింది.

'హుపల్' పేరుతో ముంబై కేంద్రంగా డిజిటల్ ఇన్‌ఫ్లూయెన్సర్ కంటెంట్ మార్కెటింగ్ ఏజెన్సీని స్థాపించి విజయం సాధించింది రమ్య.

డిజిటల్ ఇన్‌ఫ్లూయెన్సర్ కంటెంట్ మార్కెటింగ్ రంగంలోకి అడుగు పెట్టడం సులువే కానీ, అక్కడ గెలుపు జెండా ఎగరేయడం మాత్రం సులువు కాదు. ఎంతో పోటీ ఉంటుంది. అందుకే ఆషామాషీగా ఏజెన్సి ప్రారంభించలేదు రమ్య.

యాక్టివ్ సోషల్‌మీడియా యూజర్‌ల సంఖ్య ఎంత, ఏ వయసు వాళ్లు ఎక్కువ మంది ఉన్నారు, వారి స్క్రీన్‌టైమ్ ఎంత? ఇలాంటి ఎన్నో విషయాలను తెలుసుకొని ఏజెన్సీ ప్రారంభించింది.

ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల గురించి తెలుసుకుంటూ ఉండేది. 'వీరి ప్రతిభను మనం ఎలా ఉపయోగించుకోగలమా' అని ఆలోచించేది.

'ఈ తరం వాళ్లకు ఏది చెప్పినా ఇది మాకు సంబంధించిన విషయమే అన్నట్లుగా చెప్పాలి. ఉన్న వాస్తవాన్ని పదింతలు పెద్ద చేసి చూపించే కంటెంట్‌ను వారు ఇష్టపడడం లేదు' అంటుంది రమ్య.

డిజిటల్ ఇన్‌ఫ్లూయెన్సర్ కంటెంట్ మార్కెటింగ్‌కు ఉజ్వల భవిష్యత్ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సరికొత్త భవిష్యత్ వ్యూహాలతో సిద్ధం అవుతుంది రమ్య.

'విజయం అనేది ఒక ప్రాజెక్ట్‌కు మాత్రమే పరిమితం. అది పునరావృతం కావాలంటే బుర్రకు ఎప్పుడూ పదును పెడుతూనే ఉండాలి. ఇతరుల కంటే ఎంత భిన్నంగా ఆలోచిస్తున్నామనేదే మన బలం అవుతుంది. మన విజయానికి ఇంధనం అవుతుంది' అంటున్న రమ్య రామచంద్రన్ మాటలు నిజం కదా



● రమ్య రామచంద్రన్

గేమింగ్: నేడే విడుదల



సర్వైవల్ హారర్ వీడియోగేమ్ 'ది డెవిల్ ఇన్ మీ' నేడు విడుదల అవుతుంది. 'ది డార్క్ పిక్చర్స్ ఆంత్రపాలజీ'లో ఇది నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్. గతంలో మ్యాన్ ఆఫ్ మెదాన్(2019), లిటిల్ హోప్ (2020), హౌజ్ ఆఫ్ యాషెస్(2021)లు వచ్చాయి. తాజా ఆటలో మల్టిపుల్ పజిల్స్, రన్నింగ్, జంపింగ్, క్లైంబింగ్‌లాంటి కొత్త మూమెంట్స్ ఉంటాయి. 'మర్డర్ హోటల్' నుంచి డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ బృందానికి ఒక మిస్టీరియస్ కాల్ వస్తుంది. ఆ హోటల్‌కు చేరుకున్న బృందానికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి అనేది 'ది డెవిల్ ఇన్ మీ' కథ.

అతడు ఎవరో కాదు ఇతడే!

మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీప్లేయర్

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్, విండోస్, ప్లేస్టేషన్4, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్‌వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

యువర్స్

ఎట్టకేలకు విజయం సాధించాడు!

గజిని

'ప్రయత్నం ఆపితే పరాజయానికి శాశ్వత స్థానం ఇచ్చినట్లే' అంటారు. ఇక విషయంలోకి వస్తే... బెంగళూరుకు చెందిన



తల్లితో అద్నిన్

అద్నిన్ రాయ్‌కి ప్రసిద్ధ సంస్థ గూగుల్‌లో పనిచేయాలనేది కల. 2013 నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అయినాసరే, ఎప్పుడూ నిరాశపడలేదు. ఆశను వదులుకోలేదు. ప్రతి ప్రయత్నం నుంచి ఒక పాఠాన్ని నేర్చుకున్నాడు. రెజ్యూమ్ లో మార్పు చేసి పంపేవాడు. మొబైల్, వెబ్ అప్లికేషన్‌లలో అనుభవం ఉన్న రాయ్ ఎట్టకేలకు తన కల నెరవేర్చుకున్నాడు. గూగుల్ డిజైనింగ్ టీమ్‌లో ఉద్యోగం సంపాదించాడు. 'బాగా గుర్తింపు ఉన్న డిజైన్ కాలేజీ నుంచి డిగ్రీ లేదు కాబట్టి విఫలమవుతున్నానేమో అనుకున్నాను. కాని ఇది నిజం కాదు. మనం ఎంచుకునే పనిలో నైపుణ్యం సాధిస్తే గూగుల్‌లో ఉద్యోగం సంపాదించడం అసాధ్యమేమీ కాదు' అంటూ రాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోకు 1.3 మిలియన్ వ్యూస్ వచ్చాయి.

వర్డ్ ఆఫ్ ది ఇయర్-2022 PERMACRISIS

ఇంగ్లీష్ ఇస్కూల్

'పర్మక్రైసిస్'ను వర్డ్ ఆఫ్ ది ఇయర్-2022గా ఎంపికచేసింది కొలిన్స్ డిక్షనరీ. పర్మినెంట్, క్రైసిస్ అనే రెండు పదాల కలయికతో ఏర్పడిన పదం ఇది. దీని అర్థం...అస్థిరత, అభద్రతాకాలం విస్తరించడం. కోవిడ్ కష్టాలు పోయాయి అని అనుకునేలోపే ఉక్రెయిన్-రష్యా యుద్ధం రూపంలో ప్రపంచానికి మరో ఉపద్రవం ముంచుకొచ్చింది. యుద్ధం, వాతావరణంలోని మార్పుల వల్ల 'అస్థిరత' 'అభద్రత'లు మళ్లీ ముందుకు వచ్చాయి. సామాజిక, రాజకీయ నేపథ్యాల నుంచి ఎంపిక చేసిన పదం ఇది. కొలిన్స్ జాబితాలో ఎంపికైన పదాలలో ఒకటి: స్పోర్ట్స్ వాషింగ్. దేశాలు లేదా పెద్ద కంపెనీలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి స్పోర్ట్స్ ప్రమోషన్‌ని ఉపయోగించుకోవడాన్ని 'స్పోర్ట్స్ వాషింగ్' అంటారు.

నీవు నేర్పిన విద్యయే....

● ఆర్ట్ అండ్ కల్చర్

పోలండ్ కార్టూనిస్ట్ స్లోవోమిర్ గీసిన కార్టూన్ ఇది. 'తెలివితేటలు నీకే కాదు. నాకు కూడా ఉంటాయి' అని గాలం వేసిన వ్యక్తికి చెబుతుంది నీటిలో ఉన్న చేప. కార్టూన్‌లలో కలర్ కాంబినేషన్ స్లోవోమిర్ ప్రత్యేకత. కార్టూన్ చిత్రాలు అని అందంగా పిలుచుకోవచ్చు. ఇక స్వోవోమిర్ విషయానికి వస్తే ఒక వార్తాపత్రికలో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. మంచి ఫొటోగ్రాఫర్ కూడా. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డ్‌లు అందుకున్న స్వోవోమిర్ నవ్వించే కార్టూన్‌లు మాత్రమే కాదు ఆలోచింపజేసే సామాజిక స్పృహతో కూడిన కార్టూన్‌లు ఎన్నెన్నో గీశాడు.



● సక్సెస్ స్టోరీ

యంగ్ అండ్ ఎనర్జిటిక్

ఒక్క వ్యాపారంలో సక్సెస్ కావడానికే అష్టకష్టాలు పడేవాళ్లు ఉన్నారు. దారి తప్పే వాళ్లు ఉన్నారు. 'నాకు బిజినెస్ అచ్చిరాదు' అని రథాన్ని వెనక్కి మళ్లించేవాళ్లు ఉన్నారు. అయితే, అఖిల్ ఆర్యన్‌కు మాత్రం పట్టిందల్లా బంగారం అవుతుంది... 'విజన్ బాగుంటే విజయం మనదే' అనేది అతడి పాలసీ. చిన్న వయసులోనే ఎన్నో కంపెనీలు మొదలు పెట్టి సక్సెస్ అయ్యాడు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు....

ముంబైలో పుట్టి పెరిగిన అఖిల్ ఆర్యన్‌కు చిన్నప్పటి నుంచి సినిమాల కంటే టెక్నాలజీ అంటేనే ఎక్కువ ఇష్టం. అబ్బాయి ఆసక్తికి ముచ్చటపడిన తండ్రి ఒక ఫైన్ మార్నింగ్ ఇంటికి కంప్యూటర్ తీసుకువచ్చాడు. టెక్నాలజీ అనే సముద్రంలో విహరించడానికి అఖిల్‌కు ఇది ఎంతో ఉపయోగపడింది.



అఖిల్ ఆర్యన్

పదహారు సంవత్సరాల వయసులో 'ఎల్.నాగ్‌పాల్ డెవలపర్స్' కంపెనీలో చేరాడు. కంపెనీ అభివృద్ధికి ఎన్నో ఐడియాలు ఇచ్చి 'శభాష్' అనిపించుకున్నాడు. ఆ తరువాత ఒక ట్రేడింగ్ సర్వీస్ కంపెనీలో పనిచేశాడు.

'ముందు చదువు పూర్తి చెయ్యి తండ్రీ' అన్నది అమ్మ. అమ్మకు ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ పూర్తి చేశాడు.



పద్దెనిమిది సంవత్సరాల వయసులోనే తొలి స్టార్టప్‌తో సక్సెస్ సాధించిన అఖిల్ ఆతరువాత టెక్నికల్ ట్రెయినింగ్, ఫైనాన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీలు మొదలు పెట్టాడు. అన్నింట్లోనూ విజయం సాధించాడు.

'నీది గోల్డెన్‌హ్యాండ్. ఏది పట్టినా బంగారమే' అనిపించుకున్నాడు. తన వ్యాపార ప్రస్థానంలో భాగంగా అమెరికా, ఇంగ్లాండ్‌లకు వెళ్లాడు. 2015లో స్వదేశానికి తిరిగివచ్చాడు. తన రిసెర్చ్‌లో ఏఐ ఫీల్డ్‌కు ఫ్యూచర్ ఉంది అని తెలుసుకున్నాడు. 'హాప్‌టిక్' అనే ఏఐ ప్లాట్‌ఫామ్‌తో సూపర్‌సక్సెస్ సాధించాడు అఖిల్.

ఆ తరువాత...'ఐవోఎస్ ఎనర్జీ' పేరుతో మొదలు పెట్టిన అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌తో అఖిల్ విజయం శిఖరస్థాయికి చేరుకుంది. ఈ కంపెనీ పదిహేను దేశాల్లో పనిచేస్తోంది. 'ఐవోఎస్ ఎనర్జీ' కో-ఫౌండర్, సీయివోగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాడు అఖిల్.

ఇంతకీ అఖిల్ ఆర్యన్ విజయరహస్యం ఏమిటి?

అతడి మాటల్లోనే చెప్పాలంటే... పఠనం, ఫిట్‌నెస్.

ఎంత బిజీగా ఉన్నా సరే, వారానికి కనీసం రెండు పుస్తకాలు చదువుతాడు. 'రాడికల్ ఫోకస్: ఎచీవింగ్ యువర్ మోస్ట్ ఇంపార్టెంట్ గోల్స్ విత్ ఆబ్జెక్టివ్స్ అండ్ కీ రిజల్ట్స్' 'హౌ టూ క్రియేట్ యువర్ బిజినెస్ కల్చర్' 'స్ట్రెయిట్ టాక్ ఫర్ స్టార్టప్స్'... మొదలైన పుస్తకాలు అంటే అఖిల్‌కు ఇష్టం. వీటితో పాటు 'ఏ యోగీస్ గైడ్ టూ జాయ్' లాంటి ఆధ్యాత్మిక పుస్తకాలు కూడా చదువుతాడు.

ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తాడు అఖిల్. దీని కోసం ప్రత్యేకంగా ఒక ట్రైనర్‌ను కూడా నియమించుకున్నాడు.

కవిత్వంలాగే 'విజయం' కూడా తీరని దాహం!

భవిష్యత్‌లో అఖిల్ ఆర్యన్ మరెన్ని విజయాలు సాధిస్తాడో వేచిచూద్దాం.

ప్రపంచంతో డిస్‌కనెక్ట్

ఫిట్‌నెస్‌తో ఉంటే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. కొత్త ఆలోచనలు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకే ఫిట్‌నెస్‌కు అమిత ప్రాధాన్యత ఇస్తాను. జిమ్‌లో ఉన్నప్పుడు ఇతర ఆలోచనలేవీ తలలో దూరకుండా ప్రయత్నిస్తాను. వర్కవుట్స్ మీదే దృష్టి పెడతాను. ఒక విధంగా చెప్పాలంటే జిమ్‌లో ఉన్నప్పుడు ప్రపంచంతో డిస్‌కనెక్ట్ అవుతాను.

– అఖిల్ ఆర్యన్,
ఐవోఎస్ ఎనర్జీ-సీయివో

● మ్యూజిక్ వరల్డ్



ఫ్రిజెల్ డిసౌజా

లవింగ్ యూ

ఆర్కిటెక్చర్‌కు, సంగీతానికి అట్టే సంబంధం లేకపోవచ్చు. కానీ రెండింట్లోనూ నిర్మాణం ఉంది. ఒక ప్లాన్‌తో భవనాన్ని నిర్మించినట్లే, ఒక ప్లాన్‌తో పాట కూడా నిర్మించాలి. అవి ఆహ్లాదంగా ఉండాలి. ఆర్కిటెక్చర్ చదువుకున్న ఫ్రిజెల్ డిసౌజాకు పాట నిర్మాణం గురించి మంచి అవగాహన ఉంది. అందుకే ఆహ్లాదకరమైన పాటలు ఆమె గొంతు నించి వినిపిస్తున్నాయి.

బెంగళూరుకు చెందిన సింగర్-సాంగ్ రైటర్ ఫ్రిజెల్ డిసౌజా తన సరికొత్త ఆల్బమ్ 'ది హిల్స్ నో ఆఫ్ యూ'తో సంగీత అభిమానులను ఆకట్టుకుంది. తన సొంత అనుభవాల నుంచి రాసుకున్న పాటలు ఇవి. బిజీ లవింగ్ యూ, ది హిల్స్ నో ఆఫ్ యూ, ఇంటర్‌లూడ్, మేబీ టుమారో, జస్ట్ యాజ్ ఈజీ అనే అయిదు పాటలు ఇందులో ఉన్నాయి. రెండు సంవత్సరాల క్రితం తన డెబ్యూ సింగిల్ 'న్యూ'తో సంగీత ప్రపంచానికి కొత్తగా పరిచయం అయింది ఫ్రిజెల్. ఆ తరువాత వచ్చిన 'డ్రాన్ అవే' 'ఫూలిష్ వన్స్ ఆగేన్'లకు కూడా మంచి పేరు వచ్చింది. 'న్యూ' అనేది పూర్తిగా కల్పితం. 'డ్రాన్ అవే' మాత్రం గోవాలోని తన బాల్య జ్ఞాపకాల ఆధారంగా రాసుకుంది. 'ఒక ఐడియా అనుకొని పాట మొదలుపెట్టను. పాట దానికదే రూపుదిద్దుకుంటుంది. సన్నివేశాలు పుడుతుంటాయి' అంటుంది ఫ్రిజెల్.

ఫ్రిజెల్ తండ్రి నేవీలో పనిచేశాడు. ఆయన ఎక్కడెక్కడి నుంచో ఇంటికి మ్యూజిక్ క్యాసెట్లు, సీడీలు తెచ్చేవాడు. అలా ఇంటర్నేషనల్ పాప్ మ్యూజిక్‌తో ఫ్రిజెల్‌కు పరిచయం ఏర్పడింది. చిన్నప్పటి నుంచే పాటంటే ఇష్టం ఏర్పడింది. పాటల పోటీలలో ఎన్నో బహుమతులు గెలుచుకుంది.

ఆర్కిటెక్చర్‌లో పట్టా పుచ్చుకున్న ఈ సింగర్, సాంగ్ రైటర్‌కు ప్రత్యేకమైన భవిష్యత్ ప్రణాళిక అంటూ ఏదీ లేదు. 'ప్రతి ఆర్టిస్ట్‌కు తనదైన శబ్దం ఉంటుంది' అంటున్న ఫ్రిజెల్ డిసౌజా సంగీతంలో తనదైన శైలి కోసం ప్రయత్నిస్తోంది.

సినిమా

జైలర్‌తో పోరాటం!



● రజనీకాంత్, శివరాజ్‌కుమార్

రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. ఇందులో రమ్యకృష్ణ, యోగిబాబు, వసంత్ రవి, వినాయకన్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కొన్ని రోజులుగా చెన్నైలో జరుగుతోంది. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అయ్యారు కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్. ఈ చిత్రంలో ఆయన ముఖ్య పాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం రజనీకాంత్, శివరాజ్‌కుమార్ కాంబినేషన్‌లో పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారని కోలీవుడ్ టాక్. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ కానుంది.

సార్ ఎప్పుడు వస్తున్నారంటే...

● ధనుష్



వెండితెరపైకి 'సార్' వచ్చే సమయం ఖరారైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17న 'సార్' థియేటర్స్‌లోకి రానున్నాడు. ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న సినిమా 'సార్' (తమిళంలో 'వాతి'). శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సాయి సౌజన్య, ఎస్. నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలుత ఈ సినిమాను డిసెంబరులో విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. కానీ 'సార్' సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 17న రిలీజ్ చేయనున్నట్లుగా గురువారం కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ''విద్యా వ్యవస్థల విధి విధానాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఆలోజింపజేసే సన్నివేశాలు కూడా ఈ సినిమాలో ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



సోదరుడు రమేశ్‌బాబు కుమారుడు జయకృష్ణతో మహేశ్‌బాబు

హైదరాబాద్‌లో కృష్ణ మెమోరియల్!

సూపర్‌స్టార్ కృష్ణ దూరమై మూడు రోజులైంది. కుటుంబ సభ్యులు, ఆయన్ను అభిమానించేవారు ఈ షాక్ నుంచి తేరుకోవడానికి కాస్త టైమ్ పడుతుంది. అయితే తాను చేసిన సినిమాల ద్వారా, మంచితనం ద్వారా కృష్ణ నిలిచిపోతారు. ఇక కృష్ణ జ్ఞాపకార్థం హైదరాబాద్‌లో మెమోరియల్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఆయన కుటుంబ సభ్యులు ఉన్నట్లు తెలిసింది. కృష్ణకి ఎంతో ఇష్టమైన పద్మాలయ స్టూడియోలో ఈ మెమోరియల్‌ని నిర్మించాలని ఆయన తనయుడు మహేశ్‌బాబు అనుకుంటున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. మెమోరియల్ హాల్‌లో కృష్ణ కాంస్య విగ్రహంతో పాటు ఆయన నటించిన చిత్రాల ఫొటోలు, కొన్ని చిత్రాల కాస్ట్యూమ్స్, షీల్డ్‌లు ఉంచనున్నారట. కాగా హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన కృష్ణ చిన్న కర్మలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెమోరియల్ విషయమై చర్చించారని, త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నారని తెలిసింది.

హారర్.. థ్రిల్



● సంగీత, తిరువీర్, కావ్య కల్యాణ్‌రామ్

''మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' వంటి చిత్రాల తర్వాత మా బ్యానర్‌లో 'మసూద' లాంటి మంచి సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. నిజాయతీగా తీసిన ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని రాహుల్ యాదవ్ నక్కా అన్నారు. సంగీత, తిరువీర్, కావ్య కల్యాణ్‌రామ్, బి.శ్రీధర్, 'శుభలేఖ' సుధాకర్, సత్యప్రకాశ్ ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'మసూద'. సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. కాగా యువ దర్శకులు స్వరూప్ ఆర్ ఎస్‌జె, వెంకటేశ్ మహా, వివేక్ ఆత్రేయ, వినోద్ అనంతోజు, సందీప్ రాజ్ ఈ చిత్రం ప్రీమియర్ చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ– ''చాలాకాలం తర్వాత నిజాయతీ హారర్ డ్రామాగా వచ్చిన 'మసూద' చూసి థ్రిల్ అయ్యాం'' అన్నారు. ''నాకు తొలి చాన్స్ ఇచ్చిన రాహుల్‌కు థ్యాంక్స్'' అన్నారు సాయికిరణ్. ''మంచి పాత్రను నాకు ఇచ్చిన దర్శక-నిర్మాతలకు కృతజ్ఞతలు'' అన్నారు తిరువీర్. ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెల్, సంగీతం: ప్రశాంత్ ఆర్.విహారి.

నమ్మకం రెండింతలయింది - రావణ్



● రావణ్, శ్రీ నిఖిత

రావణ్ నిట్టూరు, శ్రీ నిఖిత జంటగా ఆనంద్. జె దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అలిపిరికి అల్లంత దూరంలో..'. రమేష్ డబ్బుగొట్టు, రెడ్డి రాజేంద్ర.పి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా రావణ్ మాట్లాడుతూ– ''ఈ కథ విన్నప్పుడు ఈ సినిమాపై కలిగిన నమ్మకం అవుట్‌పుట్ చూసిన తర్వాత రెండింతలయింది. కొత్తవాళ్లతో కూడా మంచి సినిమా తీయవచ్చని మా సినిమా చూసిన తర్వాత మరోసారి నిరూపితమవుతుంది. ఇంతమంచి స్క్రిప్ట్‌లో నన్ను భాగం చేసిన దర్శకుడు ఆనంద్‌కు ధన్యవాదాలు'' అన్నారు. ''ఇందులో పూర్తిగా తిరుపతి నేటివిటీని చూస్తారు. నటీనటులు కొత్తవారైనా అంకిత భావంతో పని చేశారు'' అన్నారు ఆనంద్. ''థ్రిల్లర్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో డివైన్ టచ్ ఉన్న సినిమా ఇది. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరు, ఓవర్సీస్‌లో కూడా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు రమేష్, రాజేంద్ర. హీరోయిన్ శ్రీ నిఖితతో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు.



● తమన్నా

ఇతన్నే పెళ్లి చేసుకోబోతున్నా!

తమన్నా పెళ్లి గురించి ఇటీవల చాలా వార్తలు వినిపించాయి. ఈ వార్తలకు కూల్‌గా స్పందించారు తమన్నా. తాజాగా ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్తతో తమన్నా పెళ్లి జరగనుందని, ఏర్పాట్లు కూడా మొదలయ్యాయనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ విషయంపై తమన్నా స్పందించారు. "నేను పెళ్లి చేసుకోబోతున్న వ్యాపారవేత్త ఇతనే...' అంటూ 'ఎఫ్ 3' చిత్రంలో తాను వేసుకున్న మేల్ గెటప్ (ఒక పాటలో తమన్నా మగవేషంలో కనిపించారు) లుక్‌ను షేర్ చేశారు తమన్నా. "నా పెళ్లి వదంతులు మళ్లీ వినిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ నా జీవితం గురించి రాస్తున్నారు" అంటూ వ్యంగ్యంగా కూడా స్పందించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం చిరంజీవి 'భోళా శంకర్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు తమన్నా. అలాగే సత్యదేవ్ హీరోగా, తమన్నా ఓ హీరోయిన్‌గా నటించిన 'గుర్తుందా.. శీతాకాలం' రిలీజ్‌కి రెడీగా ఉంది.



అది నాకో వరం – సుడిగాలి సుధీర్

''హీరో, కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్టు... ఇలా కాకుండా ప్రేక్షకులు నన్నో ఎంటర్‌టైనర్‌గా గుర్తిస్తే చాలు. తెరపై నేను కనిపించినప్పుడు ప్రేక్షకులు వినోదాన్ని ఆస్వాదించడం నాకో వరంలా భావిస్తున్నాను'' అని 'సుడిగాలి' సుధీర్ అన్నారు. 'సాఫ్ట్‌వేర్ సుధీర్' చిత్రం తర్వాత హీరో 'సుడిగాలి' సుధీర్, దర్శకుడు రాజశేఖర్ రెడ్డి పులిచర్ల కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'గాలోడు'. ప్రకృతి సమర్పణలో సంస్కృతి ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'సుడిగాలి' సుధీర్ చెప్పిన విశేషాలు.

● ఓ ఊర్లో పనీ పాటా లేకుండా తిరిగే ఓ కుర్రాడు ఓ సమస్యలో చిక్కుకుని పట్టణానికి వచ్చి మరో సమస్యలో ఇరుక్కుంటాడు. ఈ సమస్యలు ఇలా ఉండగానే ఓ అమ్మాయిని ప్రేమిస్తాడు. మరి.. అతను సమస్యల నుంచి ఎలా బయటపడ్డాడు? అతని లవ్‌స్టోరీ ఏమైంది? అన్నదే ఈ సినిమా కథ. 'గాలోడు' ట్రైలర్, టీజర్ చూసి, నా సన్నిహితులు, శ్రేయోభిలాషులు 'ఓ హీరోలా యాక్ట్ చేశావు' అని అభినందించారు. ఈ క్రెడిట్ దర్శకుడు రాజశేఖర్ రెడ్డిగారు, నిర్మాతలకు దక్కుతుంది. ● బుల్లితెర వీక్షకుల అభిమానం నాకు లభించింది. ఇప్పుడు వెండితెరపై సినిమాలు చేస్తున్నాను కాబట్టి మళ్లీ బుల్లితెరపై యాక్ట్ చేయనని కాదు. తప్పకుండా చేస్తాను. ఇటీవలే ఓ మ్యాజిక్ షోకు కూడా ఓకే చెప్పాను. ఫలానా సబ్జెక్ట్స్ మాత్రమే నాకు ఇష్టం అని చెప్పను. కానీ నాకు థ్రిల్లింగ్, మాస్ సినిమాలంటే ఇష్టం. ఎందుకంటే నేను నేల ఆడియన్‌లా చిరంజీవి, రజనీకాంత్‌గార్ల సినిమాలు చూసి పెరిగిన వాడిని. ● 'గాలోడు'లో నేను, రష్మీ గౌతమ్ హీరో హీరోయిన్‌గా చేయాల్సింది.. కుదర్లేదు. మా ఇద్దరి కాంబినేషన్‌లో మాత్రం ఓ సినిమా ఉంటుంది. నా తర్వాతి చిత్రం 'కాలింగ్ సహస్ర' వచ్చే ఏడాది రిలీజవుతుంది.



మా నమ్మకం నిజమైంది - శివలెంక కృష్ణప్రసాద్



● శివలెంక కృష్ణప్రసాద్, హరీష్, వరలక్ష్మి, హరి

''యశోద' చిత్రాన్ని ఫిమేల్ ఓరియంటెడ్‌గా చేయాలనుకోలేదు. కొత్త పాయింట్‌ని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో చేశాం. మంచి సినిమా తీస్తే విజయం అందిస్తామంటూ మా నమ్మకాన్ని నిజం చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. సమంత టైటిల్ రోల్‌లో హరి, హరీష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యశోద'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''సమంతగారి వన్ విమన్ షో 'యశోద'. ఈ చిత్రం సీక్వెల్ గురించి చాలామంది అడుగుతున్నారు.. ఆ ప్రయత్నం హరి, హరీష్ నుంచి రావాలి. మా మూవీ ఫస్ట్ డే ఆరున్నర కోట్ల గ్రాస్ వసూలు చేసింది. మూడు రోజుల్లోనే 20 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది.. అమెరికాలో హాఫ్ మిలియన్ మార్క్ చేరుకుంది'' అన్నారు. ''మాకు ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు వరలక్ష్మీ శరత్‌కుమార్. హరి, హరీష్ మాట్లాడుతూ– ''యశోద' మా తొలి తెలుగు చిత్రం. 'యశోద 2' విషయంలో మాకు ఒక ఐడియా ఉంది. సెకండ్ పార్ట్, థర్డ్ పార్ట్‌కు లీడ్ కూడా ఉంది. అయితే సీక్వెల్ సమంతగారిపై ఆధారపడి ఉంది'' అన్నారు. మాటల రచయితలు పులగం చిన్నారాయణ, చల్లా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ– ''మీరు రాయగలరు.. రాయండి. మీ సక్సెస్ చూడాలని ఉంది'' అని మమ్మల్ని ప్రోత్సహించిన కృష్ణప్రసాద్‌గారికి థ్యాంక్స్'' అన్నారు. 'యశోద'ని హిందీలో రిలీజ్ చేసిన యూఎఫ్‌ఓ లక్ష్మణ్, క్రియేటివ్ డైరెక్టర్ హేమాంబర్ జాస్తి, ఆర్టిస్టులు కల్పికా గణేష్, దివ్య శ్రీపాద, ప్రియాంక శర్మ, మధురిమ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత రాజా సెంథిల్, ఎడిటర్ మార్తాండ్ కె. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 230	నిఫ్టీ ▽ 66
61,751	18,344

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,132	▽	52
డోజోన్స్	33,545	▽	19
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,347	▽	5
డాక్స్	14,266	△	32
షాంఘై	3,115	▽	5
నికాయ్	27,931	▽	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	52,894 ▽ 200
బంగారం (99.5 స్వచ్ఛత)	52,682 ▽ 199
వెండి (కిలో)	61,253 ▽ 1,341

రేపు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

న్యూఢిల్లీ: ఉద్యోగాల అవుట్‌సోర్సింగ్‌ను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగుల యూనియన్ ఏఐబీఈఏ ఈ నెల 19న (రేపు) సమ్మెకు పిలుపునిచ్చింది. అధికారులు ఇందులో పాల్గొనకపోయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) కొన్ని కార్యకలాపాలపై ప్రభావం పడనుంది. నగదు డిపాజిట్, విత్‌డ్రాయల్, చెక్కుల క్లియరింగ్ వంటి లావాదేవీలపై కొంత ప్రభావం ఉండవచ్చని అంచనా. సమ్మె జరిగితే పరిస్థితుల గురించి బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ మొదలైన పలు బ్యాంకులు ఇప్పటికే తమ కస్టమర్లకు సమాచారం అందించాయి.



కొన్ని బ్యాంకులు ఉద్యోగాలను అవుట్‌సోర్స్ చేయడం వల్ల కస్టమర్ల ప్రైవసీకి, వారి సొమ్ముకు రిస్కులు పొంచి ఉండటంతో పాటు కింది స్థాయిలో రిక్రూట్‌మెంట్ తగ్గిపోతోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఏఐబీఈఏ) జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం తెలిపారు. కొన్ని బ్యాంకులు పారిశ్రామిక వివాదాల (సవరణ) చట్టాన్ని కూడా ఉల్లంఘిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం, సమ్మెలు జరపడం మినహా తమ ఆందోళనను వ్యక్తపర్చేందుకు మరో ప్రత్యామ్నాయం లేదని ఆయన చెప్పారు. ప్రైవేట్ బ్యాంకులపై సమ్మె ప్రభావం ఉండదు.

బ్లాక్‌స్టోన్ చేతికి ఆర్ సిస్టమ్స్

- డీల్ విలువ రూ. 2,904 కోట్లు
- మెజారిటీ వాటా కొనుగోలు



ముంబై: డిజిటల్ ఐటీ సర్వీసుల కంపెనీ ఆర్ సిస్టమ్స్‌ను కొనుగోలు చేసినట్లు యూఎస్ పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ తాజాగా పేర్కొంది. ఇందుకు 35.9 కోట్ల డాలర్లు(రూ. 2,904 కోట్లు) చెల్లించనున్నట్లు వెల్లడించింది. కంపెనీలో మెజారిటీ వాటాను సొంతం చేసుకునేందుకు ప్రమోటర్లు సతీందర్ సింగ్ రేఖీ తదితరులతో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. 1993లో రేఖీ ప్రమోట్ చేసిన కంపెనీ డిజిటల్ ఐటీ సర్వీసులతో పాటు, ప్రొడక్ట్ ఇంజనీరింగ్‌లో ప్రత్యేకతను కలిగి ఉంది. నోయిడాకు చెందిన ఈ కంపెనీ టెక్నాలజీ, మీడియా, టెలికం, ఫైనాన్షియల్ సర్వీసుల రంగాలలో 250 కస్టమర్లకు సేవలందిస్తోంది.

4,400 మంది సిబ్బంది

ఆర్ సిస్టమ్స్ 4,400 మంది ఉద్యోగులను కలిగి ఉంది. దేశ, విదేశాలలో 18 డెలివరీ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఈ సెప్టెంబర్‌తో ముగిసిన 12 నెలల కాలంలో కంపెనీ రూ. 1,445 కోట్ల ఆదాయం సాధించింది. ఇది 36 శాతం వృద్ధికాగా.. రేఖీ తదితర ప్రమోటర్లు ప్రస్తుతం కంపెనీలో 52 శాతం వాటాను కలిగి ఉన్నారు. బ్లాక్‌స్టోన్ షేరుకి రూ. 245 చొప్పున వాటాను కొనుగోలు చేయనుంది. మిగిలిన వాటా కోసం షేరుకి రూ. 246 ధరలో డీలిస్టింగ్ ఆఫర్‌ను ప్రకటించనుంది. తదుపరి రేఖీ నాన్‌ఎగ్జిక్యూటివ్ సలహాదారుగా సేవలను కొనసాగించనున్నారు. కాగా.. బ్లాక్‌స్టోన్ ఐటీ, ఐటీ ఆధారిత సేవల దేశీ కంపెనీలలో భారీగా ఇన్వెస్ట్ చేస్తోంది. ఇప్పటివరకూ 7 బిలియన్ డాలర్లు పంప్ చేసింది. ఎంఫసిస్, వీఎఫ్ఎస్, టాస్కియూఎస్, ఐబీఎస్ సాఫ్ట్‌వేర్, ఇంటెలినెట్, సింప్లిలెర్న్ తదితర కంపెనీలలో పెట్టుబడులు పెట్టింది. బ్లాక్‌స్టోన్ సొంతం చేసుకోనున్న వార్తల ప్రభావంతో ఆర్ సిస్టమ్స్ కౌంటర్‌లో భారీ డిమాండ్ నెలకొంది. వెరసి బీఎస్‌ఈలో షేరు తొలుత 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 281ను దాటింది. చివరికి 16 శాతం జంప్‌చేసి రూ. 271 వద్ద ముగిసింది.

బలహీన బాటలో రూపాయి

ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ బలహీన బాటలో పయనిస్తోంది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం 38 పైసలు బలహీనపడి, 81.64 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లలో అమెరికా కరెన్సీ పటిష్టత, దేశీయ ఈక్విటీల్లో మిశ్రమ ధోరణి రూపాయి సెంటిమెంట్‌పై ప్రభావం చూపుతోందని ఫారెక్స్ ట్రేడర్లు పేర్కొంటున్నారు.



రూపాయి విలువ బుధవారం 35 పైసలు తగ్గి 81.26కు పడిపోయింది. గురువారం ట్రేడింగ్‌లో మరింత బలహీనంగా 81.62 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81.45 – 81.68 శ్రేణిలో కదలాడింది. అక్టోబర్ 19న అమెరికా కరెన్సీలో రూపా యి విలువ 60 పైసలు పతనమై, చరిత్రాత్మక కనిష్టం 83 వద్ద ముగిసింది. అదే రోజు ఇంట్రాడేలో 83.01నీ చూసింది.

దివాలా ప్రక్రియతో రూ. 2.43 లక్షల కోట్ల రికవరీ

న్యూఢిల్లీ: ఎన్‌సీఎల్‌టీ పర్యవేక్షణలో దివాలా పరిష్కార ప్రక్రియల ద్వారా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మొండి బాకీలను గణనీయంగా రికవరీ చేసుకోగలుగుతున్నాయి. 2022 సెప్టెంబర్ నాటికి రూ. 2.43 లక్షల కోట్లు రాబట్టుకోగలిగాయి. నిర్దిష్ట తేదీ నాటికి సంక్షోభంలో కూరుకున్న కంపెనీల నుండి మొత్తం రూ. 7.91 లక్షల కోట్లు బ్యాంకులకు రావాల్సి ఉంది. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) తమ త్రైమాసిక నివేదికలో ఈ విషయాలు తెలిపింది. మరోవైపు, ప్రస్తుతం కొనసాగుతున్న సీఐఆర్‌పీల్లో (కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ) 64 శాతం కేసుల పరిశీలనకు 270 రోజుల పైగా జాప్యం జరుగుతోందని తెలిపింది. సీఐఆర్‌పీలు నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ జాప్యం జరుగుతుండటం సమస్యగా మారిన నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. దివాలా కోడ్ (ఐబీసీ) ప్రకారం పిటిషన్ స్వీకరించిన తేదీ నుండి



180 రోజుల్లోగా సీఐఆర్‌పీని పూర్తి చేయాల్సి ఉంటుంది. దివాలా పరిష్కార నిపుణుడి (ఆర్‌పీ) అభ్యర్థన మేరకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) దీన్ని మరో 90 రోజుల వరకూ పొడిగించవచ్చు. అయితే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రక్రియ 330 రోజుల్లోగా ముగియాలి. లిటిగేషన్లు, ఎన్‌సీఎల్‌టీ బెంచీల్లో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల సమస్యలు, కోవిడ్‌పరమైన అవాంతరాలు మొదలైనవి పరిష్కార ప్రక్రియల జాప్యానికి కారణమవుతున్నాయి.

సూచీలకు మళ్లీ నష్టాలు

- ప్రపంచ ప్రతికూలతల ప్రభావం
- రెండురోజుల ర్యాలీకి బ్రేక్
- 18,350 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్‌కు 230 పాయింట్ల నష్టం

ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయంతో పాటు ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు గురువారం నష్టపోయాయి. ప్రపంచ మార్కెట్లలో బలహీన సంకేతాలు, వారాంతపు డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ నేపథ్యంలో అప్రమత్తత సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. తొలిదశలో కాస్త కొనుగోళ్ల మద్దతు లభించినా.., తర్వాత స్థిరంగా అమ్మకాలు జరగడంతో సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. సెన్సెక్స్ ఉదయం 169 నష్టంతో 61,812 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 338 పాయింట్లు బలహీనపడి 61,643 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 230 పాయింట్ల క్షీణించి 61,751 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 51 పాయింట్ల నష్టంతో 18,359 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 105 పాయింట్ల పరిధిలో కదలాడి 18,313 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. మార్కెట్ ముగిసే సరికి 66 పాయింట్లు పతనమై 18,344 వద్ద నిలిచింది. ప్రభుత్వరంగ బ్యాంక్స్, రియల్టీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆటో షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.618 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.449 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు, యూఎస్ స్టాక్ ఫ్యూచర్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- పేటీఎం షేరు పది శాతం నష్టపోయి రూ.540 వద్ద స్థిరపడింది. ఐపీవో లాకిన్ గడువు ముగియడంతో కంపెనీలో అతిపెద్ద వాటాదారు సాఫ్ట్‌బ్యాంక్ ఓపెన్ మార్కెట్ ద్వారా 4.5 శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించడం షేరు పతనానికి కారణమైంది. బీఎస్‌ఈలో మొత్తం 43.24 లక్షల షేర్లు చేతులు మారాయి. షేరు 10% పతనంతో కంపెనీకి రూ.4,022 కోట్ల నష్టం వాటిల్లింది.
- కంపెనీ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ సీఈవో థియరీ బొల్లోర్ రాజీనామాతో టాటా మోటార్స్ షేరు రెండుశాతం నష్టపోయి రూ.424 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 3% పతనమై రూ.420 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

మరింత పారదర్శకంగా బైబ్యాక్

- ప్రస్తుత 6 నెలల గడువులో కోత
- ఓపెన్ మార్కెట్ విధానానికి స్వస్తి
- పన్ను విధింపుపైనా సవరణలు
- సెబీ తాజా ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ షేర్ల బైబ్యాక్ విధానాన్ని క్రమబద్ధీకరించేందుకు నడుం బిగించింది. ఇందుకు తాజా ప్రతిపాదనలతో చర్చా పత్రాన్ని విడుదల చేసింది. తద్వారా బైబ్యాక్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగంగా, సమర్థవంతంగా, వాటాదారులకు మద్దతిచ్చే బాటలో చేపట్టే చర్యలకు తెరతీసింది. వీటి ప్రకారం గరిష్ట పరిమితిలో కోతతోపాటు, బైబ్యాక్ పూర్తిచేసే గడువును భారీగా తగ్గించనుంది. బైబ్యాక్‌లో షేర్ల కొనుగోలు వివరాలపై స్పష్టత కోసం స్టాక్ ఎక్స్ఛేంజీలలో ప్రత్యేక విండోను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం ఓపెన్ మార్కెట్ ద్వారా కంపెనీ చెల్లించిన మూలధనంలో 15 శాతానికి మించకుండా ఫ్రీ రిజర్వుల ద్వారా బైబ్యాక్‌ను చేపట్టేందుకు వీలుంది. వచ్చే ఏప్రిల్ నుంచి 10 శాతానికి కుదిస్తోంది. ఆపై ఏడాది 5 శాతానికి, తదుపరి పరిమితిని పూర్తిగా ఎత్తివేయనుంది. ఇక టెండర్ మార్గంలో బైబ్యాక్‌కు ప్రస్తుతమున్న 25 శాతం పరిమితిని 40 శాతానికి పెంచనుంది. ప్రస్తుతం బైబ్యాక్ పూర్తికి ఆరు నెలల గడువు లభిస్తోంది. అయితే ఈ గడువులో కృత్రిమంగా డిమాండును సృష్టించడం ద్వారా షేర్ల ధరలను ప్రభావితం చేసేందుకు అవకాశముంటున్నదని సెబీ పేర్కొంది. దీంతో గడువులో పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. తాజా ప్రతిపాదనలపై సెబీ డిసెంబర్ 1వరకూ పబ్లిక్ నుంచి సూచనలు కోరుతోంది.

22 రోజులకు పరిమితం

తాజా ప్రతిపాదనల ప్రకారం 2023 ఏప్రిల్ నుంచి బైబ్యాక్ గడువును 66 పనిదినాలకు కుదించనుంది. ఆపై 2024 ఏప్రిల్ నుంచి 22 రోజులకు తగ్గించనుంది. ఈ బాటలో 2025 ఏప్రిల్ నుంచి ఓపెన్ మార్కెట్ విధానానికి స్వస్తి పలకనుంది. స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా బైబ్యాక్‌ను చేపడితే ఇందుకు కేటాయించిన నిధులను 75 శాతం వరకూ వినియోగించవలసి ఉంటుంది. ప్రస్తుతం ఈ పరిమితి 50 శాతంగా ఉంది. అంతేకాకుండా గడువులో సగం రోజులు ముగిసేసరికి కనీసం 40 శాతం సొమ్మును షేర్ల కొనుగోలుకి వెచ్చించవలసి ఉంటుంది. యాక్టివ్‌గా ట్రేడయ్యే షేర్లలోనే బైబ్యాక్‌ను చేపట్టవలసి ఉంటుంది. కంపెనీ నికరంగా రుణరహితమై ఉంటే ఒకే ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు బైబ్యాక్ చేపట్టేందుకు అనుమతిస్తారు. అయితే ఇందుకు ఆరు నెలల కనీస గడువును పాటించడంతో పాటు టెండర్ మార్గాన్ని ఎంచుకోవలసి ఉంటుంది. ఇక బుక్ బిల్డింగ్ పద్ధతిలో ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లకు ప్రమోటర్లు, సహచరులు పాల్గొనేందుకు అనుమతించరు. బైబ్యాక్‌పై పన్ను విధింపును కంపెనీకి బదులుగా సంబంధిత వాటాదారులకు బదిలీ చేయవలసిందిగా ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం బైబ్యాక్‌లో పాలుపంచుకోని వాటాదారులపై పన్ను భారం పడుతున్నందున తాజా సవరణలకు సెబీ ప్రతిపాదించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-11-2022	
విశాఖ	520-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	517-00
విజయవాడ	517-00
రిటైల్ ధర (డజను)	78.00
17-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

తొలి వన్డేలో ఆస్ట్రేలియా గెలుపు

ఇంగ్లండ్‌తో అడిలైడ్‌లో గురువారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ మలాన్ (128 బంతుల్లో 134 ; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. జంపా, కమిన్స్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆసీస్ 46.5 ఓవర్లలో 4 వికెట్లకు 291 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (84 బంతుల్లో 86 ; 10 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (78 బంతుల్లో 80 నాటౌట్ ; 9 ఫోర్లు, 1 సిక్స్), ట్రవిస్ హెడ్ (57 బంతుల్లో 69 ; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో జట్టును గెలిపించారు. రెండో వన్డే శనివారం సిడ్నీలో జరుగుతుంది. విల్లీకి రెండు వికెట్లు దక్కాయి.



ద్వైపాక్షిక సిరీస్ సమయం

- భారత్, కివీస్‌ల మధ్య నేడు తొలి టి20
- శుభారంభంపై ఇరు జట్ల దృష్టి
- మ.గం.12 నుంచి 'డీడీ స్పోర్ట్స్', అమెజాన్ ప్రైమ్‌లో ప్రత్యక్ష ప్రసారం



హార్దిక్ పాండ్యా



కేన్ విలియమ్సన్

వెల్లింగ్టన్: గతవారమే భారత్, న్యూజిలాండ్ జట్లు టి20 ప్రపంచకప్‌లో ఫైనల్ కోసం ప్రత్యర్థి జట్లతో సెమీ ఫైనల్స్ ఆడాయి. ఓటమితో రెండు గ్రూప్ టాపర్స్ జట్ల ఆశలకు అక్కడే తెర పడింది. ఇప్పుడు ఓ రకంగా ఈ మూడు టి20ల సిరీస్‌ను 'కాంస్యం' కాని కాంస్య పతక పోరు అనుకోవచ్చు. ఈ నేపథ్యంలో సెమీఫైనల్స్ సమ ఉజ్జీల మధ్య ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఇక్కడ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలాంటి అనుభవజ్ఞులు లేని భారత జట్టు బరిలోకి దిగుతోంది. కానీ మెరుపుల్లో ఇప్పటికే నిరూపించుకున్న ఇషాన్ కిషన్, సంజూ సామ్సన్, శుబ్‌మన్ గిల్, దీపక్ హుడాలు ఉన్న టీమిండియా సీనియర్లు లేని లోటును కచ్చితంగా పూరిస్తుంది. వీళ్లంతా ఐపీఎల్‌లో అంతర్జాతీయ బౌలర్లను ఎదుర్కొన్నవారే కావడంతో భారత బృందం నుంచి కేన్ విలియమ్సన్ సేనకు కఠిన సవాళ్లు తప్పకపోవచ్చు.

మళ్లీ పాండ్యా సారథ్యంలో...

హార్దిక్ పాండ్యా ఈ ఏడాది సారథిగా ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను గెలిపించి నిరూపించుకున్నాడు. ఐర్లాండ్ గడ్డపై 2–0తో సిరీస్ సాధించాడు. ఇప్పుడు మాత్రం గట్టి ప్రత్యర్థి న్యూజిలాండ్‌తో జట్టును నడిపించేందుకు సిద్ధమయ్యాడు. క్రికెట్ విశ్లేషకుల అంచనాల ప్రకారం రోహిత్ తర్వాత పూర్తిస్థాయి కెప్టెన్ అయ్యే అర్హతలున్న ఆటగాడిగా కితాబందుకుంటున్న పాండ్యాకు ఈ సిరీస్ సువర్ణావకాశం కల్పిస్తోంది. ఇలా సీనియర్ల గైర్హాజరీలో వచ్చిన ప్రతీ అవకాశాన్ని విజయవంతం చేసుకుంటే మాత్రం 2024 టి20 ప్రపంచకప్‌లో టీమిండియాను నడిపేది కచ్చితంగా పాండ్యానే! ఇందులో ఏ సందేహం లేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో జట్టును గెలిపిస్తే అద్భుతమే అని చెప్పాలి. సూర్యకుమార్ సూపర్ ఫామ్‌లో ఉండటం, హార్డ్ హిట్టర్లు ఇషాన్ కిషన్, సంజూ సామ్సన్, ఆల్‌రౌండర్ దీపక్ హుడాలతో టీమిండియా పొట్టిసిరీస్‌కు సరిపోయే మెటీరియల్‌తోనే ఉంది. పైగా గత న్యూజిలాండ్ పర్యటనలో భారత్ 5–0తో చేసిన క్లీన్‌స్వీప్ విజయం జట్టును ఒక మెట్టు పైనే నిలబెట్టుతోంది.

ప్రతీకారంపై కివీస్ కన్ను

సొంతగడ్డపై అనుకూలతలున్నా... టీమిండియా చేతిలో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవాలని న్యూజిలాండ్ చూస్తోంది. అనుభవజ్ఞులు లేని ప్రపంచ నంబర్‌వన్ టి20 జట్టుపై తొలి మ్యాచ్ నుంచే ఆధిపత్యం కనబరచాలని విలియమ్సన్ సేన ప్రణాళికతో ఉంది. ఆసీస్ గడ్డపై జరిగిన టి20 మెగా ఈవెంట్‌లో ఫిన్ అలెన్, కాన్వే, గ్లెన్ ఫిలిప్స్ అదరగొట్టారు. ఇప్పుడు సొంతగడ్డపై కూడా అదే జోరు సాగించాలని బ్యాటింగ్ త్రయం ఉవ్విళ్లూరుతోంది. దీంతో పాటు భారత్‌తో పోల్చితే ప్రస్తుత న్యూజిలాండ్ బౌలింగ్ దళం పటిష్టంగా ఉంది. సీనియర్ సీమర్ బౌల్ట్ లేకపోయినా సౌతీ, సాన్‌ట్నర్, ఫెర్గూసన్, ఇష్ సోధిలు ఫామ్‌లో ఉన్నారు. వీళ్లంతా ప్రపంచకప్‌లో నిలకడగా రాణించడం వల్లే సూపర్–12 దశలో కివీస్ అగ్రస్థానంలో నిలిచింది.

జట్లు (అంచనా)

భారత్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, అయ్యర్, సూర్యకుమార్, రిషభ్ పంత్, సుందర్, హర్షల్ / ఉమ్రాన్ మలిక్, భువనేశ్వర్, అర్ష్‌దీప్, చహల్.

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), ఫిన్ అలెన్, కాన్వే, ఫిలిప్స్, మిచెల్, నీషమ్, సాన్‌ట్నర్, సౌతీ, ఇష్ సోధి, మిల్నే, ఫెర్గూసన్.

పిచ్, వాతావరణం

సాధారణంగా కివీస్ గడ్డపై జరిగే పొట్టి పోటీల్లో మెరుపులు, భారీస్కోర్లకు కొదవుండదు. కానీ వెల్లింగ్టన్ మాత్రం ప్రతీసారి ఆ అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇక్కడ సగటు స్కోరు 162. కాబట్టి ఈ వేదికపై బౌలర్లకూ అవకాశముంటుందని చెప్పొచ్చు. శుక్రవారం వాన ముప్పు ఉన్నప్పటికీ మ్యాచ్ సమయానికల్లా సర్దుకుంటుంది.

రెండు దశాబ్దాల ఎదురుచూపులు

ఆరో టైటిల్ వేటలో బ్రెజిల్ ● గ్రూప్ 'జి'నుంచి ముందంజపై స్విస్ ఆశలు



బ్రెజిల్ జట్టు

ఫుట్‌బాల్ అనగానే వినిపించే దేశం పేరు బ్రెజిల్... ప్రపంచవ్యాప్తంగా తమ జాతీయ జట్టుతో సంబంధం లేకుండా బ్రెజిల్‌ను అభిమానించేవారే పెద్ద సంఖ్యలో ఉంటారనడంలో అతిశయోక్తి లేదు. ఆటకు పర్యాయపదంగా నిలిచిన బ్రెజిల్ ఐదు సార్లు విశ్వవిజేతగా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పీలే కాలంనుంచి రొనాల్డో వరకు ఎందరో బ్రెజిల్ స్టార్లు ఫుట్‌బాల్‌ను సుసంపన్నం చేశారు. 2002లో చివరి సారి చాంపియన్‌గా నిలిచిన తర్వాత ఆ జట్టు తర్వాతి నాలుగు ప్రయత్నాల్లోనూ విఫలమైంది. గ్రూప్ 'జి'లో ఇతర జట్ల అవకాశాలను చూస్తే... –సాక్షి క్రీడా విభాగం

బ్రెజిల్

ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన: ఐదు సార్లు చాంపియన్ (1958, 1962, 1970, 1994, 2002) **'ఫిఫా' ర్యాంక్:** 1 **అర్హత ఎలా:** క్వాలిఫయింగ్ దశలో ఆడిన 17 మ్యాచ్‌లలో 11 విజయాలతో అర్హత సాధించింది. 3 మ్యాచ్‌లలో ఓడగా, మరో 3 డ్రా అయ్యాయి.

వరుసగా గత నాలుగు ప్రపంచకప్‌లలో బ్రెజిల్ టాప్–3 లో నిలవడంలో విఫలమైంది. అయితే ఇప్పుడు కోచ్ టిటె జట్టును పటిష్టంగా తీర్చిదిద్దాడు. కొత్తతరం అటాకింగ్ ఆటగాళ్లతో అతను జట్టును నింపడం సత్ఫలితాలు ఇచ్చింది. స్టార్ ప్లేయర్ నెమార్ జట్టును ముందుండి నడిపించగలడు. అలీసాన్ ప్రస్తుతం అత్యుత్తమ గోల్‌కీపర్లలో ఒకడు. థియాగో, రఫిన్హా ఇతర కీలక ఆటగాళ్లు. గ్రూప్ టాపర్ ఖాయం.

సెర్బియా

ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన: నాలుగో స్థానం (1930, 1962) **'ఫిఫా' ర్యాంక్:** 21 **అర్హత ఎలా:** క్వాలిఫయింగ్ టోర్నీలో పోర్చుగల్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానంతో అర్హత సాధించడం విశేషం. అటాకింగ్ ప్రధాన బలం కాగా ప్రస్తుతం అత్యుత్తమ ఫామ్‌లో ఉంది. కోచ్ స్టొకోవిచ్ జట్టులో కొత్త స్ఫూర్తిని నింపాడు. దేశం తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన కెప్టెన్ డ్యుసాన్ టాడిక్ ప్రదర్శనే కీలకం కానుంది. పావ్లొవిక్, ల్యూకిక్ ఇతర ప్రధాన ఆటగాళ్లు. అయితే గ్రూప్‌లో పోటీని బట్టి చూస్తే నాకౌట్ చేరడం అద్భుతమే అవుతుంది.

స్విట్జర్లాండ్

ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన: మూడు సార్లు క్వార్టర్ ఫైనల్ (1934, 1938, 1954) **'ఫిఫా' ర్యాంక్:** 15 **అర్హత ఎలా:** క్వాలిఫయింగ్ టోర్నీలో తమ గ్రూప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. 15 గోల్స్ చేసి 2 మాత్రమే ఇచ్చి అనూహ్యంగా అగ్రస్థానంలో నిలిచింది. కొత్త కోచ్ మురాత్ యకీన్ పర్యవేక్షణలో డిఫెన్స్‌లో బలంగా మారింది. ఏ ఒక్కరి ప్రదర్శనపైనో ఆధారపడకుండా సమష్టితత్వంతో మ్యాచ్‌లు నెగ్గడమే స్విస్ జట్టు ప్రధాన బలం. బ్రెజిల్‌ను వదిలేస్తే రెండో స్థానం కోసం సెర్బియాతో పోటీ ఉంటుంది కాబట్టి ఆ మ్యాచ్‌తోనే ముందంజ వేయడం తేలుతుంది.

కామెరూన్

ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన: క్వార్టర్ ఫైనల్ (1990) **'ఫిఫా' ర్యాంక్:** 43 **అర్హత ఎలా:** క్వాలిఫయింగ్ టోర్నీలో ఒక దశలో నిష్క్రమించేలా కనిపించినా...ప్లే ఆఫ్స్‌లో అల్జీరియాపై చేసిన ఏకైక గోల్‌తో గట్టెక్కి అర్హత సాధించింది. అంతర్జాతీయ పోటీల్లో కామెరూన్ చరిత్రను చూస్తే ఎన్నో పెద్ద జట్లను ఓడించిన సంచలన విజయాలు కనిపిస్తాయి. ఆఫ్రికా నేషన్స్ టోర్నీలో గోల్డెన్ బూట్ గెలిచిన అబూబకర్ ప్రమాదకరమైన ఆటగాడు. అయితే స్టార్లు లేని ఈ జట్టు సహజంగానే ఒత్తిడికి చిత్తయిన సందర్భాలూ ఉన్నాయి. అయితే దీనిని అధిగమిస్తే మరో సంచలనాన్ని ఆశించవచ్చు.

ఆంధ్ర విజయం... హైదరాబాద్ ఓటమి



హెబర్

బెంగళూరు: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్‌హజారే ట్రోఫీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 132 పరుగుల తేడాతో బిహార్‌ను చిత్తు చేసింది. ముందుగా ఆంధ్ర 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. అశ్విన్ హెబర్ (141 బంతుల్లో 154; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగగా...రికీ భుయ్ (65 బంతుల్లో 52; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), హనుమ విహారి (70 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధసెంచరీలు చేశారు. అనంతరం బిహార్ 44.3 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. వీర్‌ప్రతాప్ సింగ్ (49 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సకీబుల్ ఘని (42) మినహా అంతా విఫలమయ్యారు. హరిశంకర్ రెడ్డి 3 వికెట్లు పడగొట్టగా...అయ్యప్ప, షోయబ్, నితీశ్ కుమార్ తలా 2 వికెట్లు తీశారు.

ఆర్యన్ శతకం...

న్యూఢిల్లీ: మరో మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 7 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా హైదరాబాద్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. మికిల్ జైస్వాల్ (59 బంతుల్లో 73; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ బుద్ధి (36 బంతుల్లో 51; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు చేయగా...శివమ్ మావి 3, సౌరభ్ కుమార్ 2 వికెట్లు తీశారు. అనంతరం యూపీ 48.4 ఓవర్లలో 3 వికెట్లకు 262 పరుగులు సాధించింది. ఆర్యన్ జుయాల్ (136 బంతుల్లో 100 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదగా...రింకూ సింగ్ (48 బంతుల్లో 78 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), మాధవ్ కౌశిక్ (92 బంతుల్లో 70; 4 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. రోహిత్ రాయుడుకే 3 వికెట్లు దక్కాయి.

ఇషా సింగ్ బృందానికి స్వర్ణం



ఇషా

న్యూఢిల్లీ: తెలంగాణ షూటర్ ఇషా సింగ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించింది. కొరియాలోని డేగూలో జరుగుతున్న ఆసియా ఎయిర్‌గన్ చాంపియన్‌షిప్‌లో ఇషా సింగ్, మను బాకర్, శిఖా నర్వాల్‌తో కూడిన పసిడి నెగ్గింది. గురువారం జరిగిన జూనియర్ మహిళల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో ఇషా జట్టు 16–12తో కొరియాకు చెందిన కిమ్ మిన్సియో, కిమ్ జుహి, యంగ్ జిన్ జట్టుపై విజయం సాధించింది. తాజా ఫలితాలతో భారత్ స్వర్ణాల సంఖ్య 23కు చేరింది. నేడు పోటీలకు చివరి రోజు.

మనిక బాత్రా సంచలనం

బ్యాంకాక్: ఐటీటీఎఫ్–ఏటీటీయూ ఆసియాన్ కప్‌లో భారత టేబుల్ టెన్నిస్ ప్లేయర్ మనిక బాత్రా సంచలన విజయంతో క్వార్టర్స్ చేరింది. ఈ క్రీడలో 'పవర్ హౌజ్' అయిన చైనాకు చెందిన ప్రపంచ ఏడో ర్యాంకర్ చెన్ జింగ్‌టాంగ్‌ను కంగు తినిపించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 44వ ర్యాంకర్ మనిక 4–3 (8–11, 11–9, 11–6, 11–6, 9–11, 8–11, 11–9)తో తనకన్నా ఎన్నో రెట్లు మెరుగైన ర్యాంకింగ్ ప్లేయర్ జింగ్‌టాంగ్‌ను ఇంటిదారి పట్టించింది.

మళ్లీ ఓడిన అర్జున్

శాన్‌ఫ్రాన్సిస్కో: మెల్ట్‌వాటర్ చాంపియన్స్ టూర్ ఫైనల్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌కు మళ్లీ పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన మూడో రౌండ్లో అర్జున్ 0.5–2.5తో అమెరికాకు చెందిన వెస్లీ సో చేతిలో పరాజయం చవిచూశాడు. ఈ టోర్నీలో తెలంగాణ కుర్రాడికిది వరుసగా మూడో ఓటమి కాగా... చెన్నై గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద ఈ ఈవెంట్‌లో బోణీ కొట్టాడు. మూడో రౌండ్ గేమ్‌లో అతను 3–0తో లియెమ్ క్వాంగ్ (వియత్నాం)పై విజయం సాధించాడు.

క్లుప్తంగా

హార్టీ సెట్ ఫలితాలు విడుదల



హార్టీ సెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్, అధికారులు

తాడేపల్లిగూడెం:పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలోని వెంకట్రామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అక్టోబర్ పదో తేదీన నిర్వహించిన హార్టీ సెట్-2022 ఫలితాలను గురువారం వర్సిటీ వీసీ టాక్టర్ టి.జానకీరామ్ విడుదల చేశారు. బీఎస్సీ (ఆనర్స్) హార్టీకల్చర్ నాలుగు సంవత్సరాల కోర్సులో చేరడానికి ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 382 మంది హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. నాలుగు ప్రభుత్వ, ఏడు ప్రైవేట్ ఉద్యాన కళాశాలలకు చెందిన విద్యార్థులు హార్టీ సెట్‌కు హాజరయ్యారు. ఉమ్మడి జీవన నరసింహ సత్య గణేష్ (ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల, రామచంద్రాపురం) మొదటి ర్యాంక్ సాధించాడు. పింజారీ షరీఫ్ (ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల, కలికిరి) రెండో ర్యాంక్, మిద్దే ప్రణీత్‌కుమార్ (ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల, రామచంద్రాపురం) మూడో ర్యాంక్ సాధించారు. ఫలితాలు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ స్వామి, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్ పద్మావతమ్మ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ నారం నాయుడు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎస్.సూర్యకుమారి, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డీఆర్ సలోమి సునీత, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ కె.ధనుంజయరావు పాల్గొన్నారు.

జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్



సాక్షి, అమరావతి: పాఠశాలల్లో క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సూచించారు. గురువారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో 66వ అండర్ 14, 17, 19 జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శుల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు శక్తి సామర్థ్యాల పరీక్ష నిర్వహించి 'ఖేలో ఇండియా ఫిట్ నెస్' యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కనీసం రెండు ఆటల్లో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. బాలికల భద్రతకోసం మహిళా టీచర్లు పర్యవేక్షించాలన్నారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి స్థానాల్లో వారికి 33శాతం కేటాయించాలని, ప్రతి జిల్లాలో ఒక పాఠశాలను 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఎంపిక చేసి విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, పాఠశాల విద్యాశాఖ ఉప సంచాలకులు పి.పార్వతి, పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ (సర్వీసులు) మువ్వా రామలింగం, రాష్ట్ర స్కూల్ గేమ్స్ సెక్రటరీ జి.భానుమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

శాప్ లీగ్స్ యాప్ ఆవిష్కరణ



శాప్ లీగ్స్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న సిద్ధార్థ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: శాప్ లీగ్స్ నిర్వహణకు రూపొందించిన ప్రత్యేక యాప్‌ను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. క్రీడాకారుల పూర్తి వివరాలను నమోదు చేసేలా యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వచ్చే నెలలో ప్రారంభమయ్యే జగనన్న క్రీడా సంబరాల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను గుర్తించడంతో పాటు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు యాప్‌లోని సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

రైల్వే సూపర్‌వైజర్లకు పే స్కేల్ పెంపుపై హర్షం

సాక్షి, అమరావతి: రైల్వేలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సీనియర్ సూపర్‌వైజర్లకు 5,400 గ్రేడ్ పే, మిగిలిన సీనియర్ సూపర్‌వైజర్లకు 4,800 గ్రేడ్ పే ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయించడంపై దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. తమ యూనియన్ దీర్ఘకాలిక డిమాండ్‌ను ఆమోదించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ జాతీయ కోశాధికారి శంకర్‌రావు గురువారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. రైల్వే ఉద్యోగుల ఇతర న్యాయమైన డిమాండ్లను కూడా నెరవేర్చాలని కోరారు.



అన్నమయ్య జిల్లా కె.రెడ్డివారిపల్లి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

మన ప్రభుత్వం



కాకినాడ జిల్లా వాకలపూడిలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



గుంటూరు జిల్లా మంగళగిరిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

తప్పు చేయకపోతే భయం ఎందుకు?

రాజకీయ వైరుధ్యం ఉంటే విచారణ చేయకూడదా?

- విచారణలో అన్నీ వెలుగులోకి వస్తాయి
- సమీక్షించకూడదంటే తప్పు జరిగినట్లు అంగీకరించినట్టే
- పాలనలో దురుద్దేశం ఉన్నప్పుడు విచారణ జరగాలి కదా
- వర్ల రామయ్య న్యాయవాదిని నిలదీసిన సుప్రీంకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం
- ఇరు పక్షాల వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు



సాక్షి, న్యూఢిల్లీ: ఎలాంటి తప్పూ చేయకుండా పారదర్శకంగా ఉన్నప్పుడు సిట్ దర్యాప్తునకు ఎందుకు భయపడుతున్నారని టీడీపీ నేత వర్ల రామయ్య తరపు న్యాయవాదిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అవినీతి దురుద్దేశం ఉన్నప్పుడు ఎందుకు విచారించకూడదని ప్రశ్నించింది. ఒక ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందని భావించిన తర్వాతి ప్రభుత్వం, వాటిని సమీక్షించకూడదంటే తప్పు జరిగినట్లు వందశాతం అంగీకరించినట్టే (ఇమ్యూనిటీ ఇచ్చినట్లే) కదా అని వ్యాఖ్యానించింది. ఇలా సమీక్షించడం ప్రజా ప్రయోజనానికి వ్యతిరేకమా అని ప్రశ్నించింది. రాజకీయ వైరుధ్యం ఉంటే విచారణ చేయకూడదా అని నిలదీసింది. పాలనలో దురుద్దేశం ఉన్నప్పుడు విచారణ జరగాలి కదా , శాశ్వతంగా తప్పించుకోలేరు కదా అని వ్యాఖ్యానించింది. సీబీఐ విచారణకు స్వీకరించలేదన్న కారణంతో తప్పు ఏమీ జరగనట్లేనని ఎలా భావించాలని ప్రశ్నించింది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న విధాన నిర్ణయాలు, అమరావతి భూసేకరణ, ఫైబర్‌నెట్ తదితర అంశాలపై ఏర్పాటైన సిట్ దర్యాప్తును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

గురువారం వర్ల రామయ్య తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ బృందంలో అందరూ వారి పార్టీ వారేనని ఆరోపించారు. న్యాయమూర్తి జస్టిస్ షా స్పందిస్తూ.. గత ప్రభుత్వం చేసిన పనులపై తర్వాతి ప్రభుత్వం సమీక్షించకూడదా అని ప్రశ్నించారు. పాలన వ్యవహారాలైతే తప్పకుండా పరిశీలించొచ్చని దవే అన్నారు. దురుద్దేశపూర్వకమైన పాలనా వ్యవహారమైతే విచారణ చేపట్టొచ్చుకదా అని జస్టిస్ షా మరోసారి ప్రశ్నించగా.. రాజకీయపరమైన ఉద్దేశాలైతే విచారణలను నియంత్రించాలని దవే అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా మాట్లాడని వారు అధికారంలోకి రాగానే విచారణకు ఆదేశించడంలో ఉద్దేశం తెలుసుకోవాలన్నారు. నిజ నిర్ధారణ బృందం నివేదిక పరిశీలించిన సభాపతి దర్యాప్తు చేయమని ఆదేశించారని అన్నారు. నిజ నిర్ధారణ బృందంలో రాజకీయ నేతల గురించి తాను మాట్లాడుతున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పటికీ, విచారణకు సీబీఐ చేతులు ఎత్తేసిందన్నారు. సీబీఐ నిరాకరించినంత మాత్రాన దురుద్దేశపూర్వక వ్యవహారాలు జరగలేదని ఎలా భావించాలని, ఈ విధంగా ఎలా ఊహించుకుంటారని జస్టిస్ షా ప్రశ్నించారు. ప్రభుత్వం మారిన తర్వాత దురుద్దేశ చర్యలపై వీకే ఖన్నా తీర్పును దవే ప్రస్తావించారు. పక్షపాతం ఉంటే న్యాయపరమైన చర్యలకు వెళ్లొచ్చని ఆ తీర్పులో ఉందని జస్టిస్ సుందరేశ్ చెప్పారు. ఈ కేసు విషయాన్ని సీరియస్‌గానే తీసుకుంటున్నామని, కేవలం రాజకీయ కక్షలు మాత్రమే నిజాలను వెలికితీస్తాయని భజన్‌లాల్ తీర్పు చెబుతోందని జస్టిస్ షా గుర్తుచేశారు. మీరు పారదర్శకంగా ఉంటే ఆందోళన ఎందుకని దవేనుద్దేశించి అన్నారు. ఈ వ్యవహారంలో అధికారులేమైనా ప్రకటన చేస్తే సీఆర్‌పీసీ వర్తించడంతోపాటు అరెస్టులు ఉంటాయని దవే తెలిపారు. గోద్రా ఘటన ఎఫ్ఐఆర్‌ల గురించి దవే ప్రస్తావిస్తుండగా అవి అవసరం లేదని జస్టిస్ ఎంఆర్ షా చెప్పారు. దవే వాదనలు కొనసాగిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ జీవో ఏకపక్షంగా, పక్షపాతంగా ఉందన్నారు. సిట్ కూడా చీకట్లో దేని కోసమో వెతుకుతున్నట్లు ఉందన్నారు. దీనికి జస్టిస్ షా స్పందిస్తూ.. ప్రతి ఒక్కరూ చీకట్లోనే వెదుకుతారని, విచారణ జరిగితే అన్నీ వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించారు. వాదనలకు సంబంధించి క్లుప్తంగా కోర్టుకు అందజేయాలని ఇరుపక్షాలకు ధర్మాసనం సూచించింది. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి కొన్ని అంశాలు ప్రస్తావించాలని పేర్కొనగా ఒక్కో పక్షం నుంచి ఒకరికే అవకాశం ఇస్తామని, ఇది అందరికీ వర్తిస్తుందని జస్టిస్ ఎంఆర్ షా వ్యాఖ్యానించారు.

సిట్టింగ్ జడ్జిపై సీజేఐకి సీఎం లేఖపై విచారణ వాయిదా

సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2020 అక్టోబరు 6న సీజేఐకి రాసిన లేఖలో చేసిన వ్యాఖ్యలపై దాఖలైన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారించింది. న్యాయవాదికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో పిటిషనర్ సునీల్ కుమార్ సింగ్ కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలేమిటని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించగా.. సీజేఐకి ముఖ్యమంత్రి రాసిన లేఖను మీడియా ముందు బహిర్గతం చేశారని, ఈ పద్ధతిని అనుమతించకూడదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేయకుండా హైకోర్టు స్టే విధిస్తూ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ నుంచి ఈ పిటిషన్‌ను వేరు చేస్తున్నట్లు జస్టిస్ ఎంఆర్ షా తెలిపారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ధర్మాసనం డిసెంబరు 12కు వాయిదా వేసింది. ముఖ్యమంత్రికి నోటీసులు ఇవ్వాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది.

సంక్రాంతి నాటికి అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్

- 176 స్కిల్ హబ్స్ ద్వారా 222 కోర్సుల్లో శిక్షణ
- ఏటా 10 వేలమంది విద్యార్థులకు ప్రయోజనం
- నైపుణ్యాభివృద్ధి శాఖ సమీక్షలో మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ఒక స్కిల్ హబ్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. ఇప్పటికే 66 స్కిల్ హబ్స్ ప్రారంభించామని, త్వరలోనే మరో 110 ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన గురువారం విజయవాడలో నైపుణ్యాభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిశ్రమలకు అవసరమైన 222 కోర్సులను ఎంపిక చేశామని, ప్రతి స్కిల్ హబ్‌లో కనీసం రెండు కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. మొత్తం స్కిల్ హబ్స్ అందుబాటులోకి వస్తే ఏటా 10 వేలమంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ప్రస్తుతం 66 స్కిల్ హబ్స్‌లో 2,400 మందికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కేంద్రాల్లో యువతకు ఆహారం, పరిశుభ్ర, ప్రశాంత వాతావరణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీపడొద్దని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీ, నైపుణ్య, శిక్షణ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, సాంకేతిక విద్య డైరెక్టర్ నాగరాణి, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో నెదర్లాండ్స్ వర్సిటీ ప్రతినిధులు

- ఏయూతో కలసి పనిచేయాలని ఆహ్వానించిన వీసీ
- వ్యవసాయ, పర్యావరణ రంగాల్లో పనిచేసే దిశగా చర్చలు



నెదర్లాండ్స్ ప్రతినిధులను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నెదర్లాండ్స్‌కు చెందిన వాగెనింగెన్ యూనివర్సిటీ అండ్ రీసెర్చ్ ప్రతినిధులు గురువారం సందర్శించారు. ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. రెండు విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా పనిచేసే అంశాలపై చర్చించారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, పర్యావరణ రంగాల్లో సంయుక్తంగా పనిచేయాలని ఆహ్వానించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ, ఫుడ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న విధానం, నిర్వహిస్తున్న కోర్సుల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రంగాలకు ప్రయోజనం కలిగేలా కలసి పనిచేసే దిశగా ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన సిద్ధం చేయాలని సూచించారు. విశాఖకు ఆనుకుని ఉన్న తూర్పుకనుమలు ప్రకృతికి, విలువైన పర్యావరణానికి కేంద్రంగా ఉన్నాయని చెప్పారు. ఆదివాసీల వద్ద విలువైన జ్ఞానం ఉందని, వీరికి మరికొన్ని నైపుణ్యాలను అందించడం అవసరమని పేర్కొన్నారు. పాడేరులో ఏయూ ప్రత్యేక నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సాధారణ విద్యకు భిన్నంగా గిరిజన యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలను కల్పించే నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను చేపడతామని ఆయన చెప్పారు. అనంతరం వీరు వర్సిటీలోని ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో వాగెనింగెన్ యూనివర్సిటీ నేచర్ ఎక్స్‌క్లూజివ్ ట్రాన్సిషన్ డైరెక్టర్ డాక్టర్ లారెన్స్ జోన్స్ వాల్టర్స్, అకౌంట్ మేనేజర్ (ఆసియా) జి.కళ్యాణచక్రవర్తి, కల్చరల్ జియోగ్రఫీ గ్రూప్ ప్రొఫెసర్ ఎడ్వర్డ్ హెచ్ హుయిజ్‌బెన్స్, సీనియర్ డేటా సైంటిస్ట్ డాక్టర్ అరుణ్ ప్రతిహస్త్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరప్ప, ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏయూ పర్యావరణ శాస్త్రం, వివిధ స్వచ్ఛంద సంస్థల, అనుబంధ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. నెదర్లాండ్స్ ప్రతినిధుల బృందాన్ని వర్సిటీ తరపున సత్కరించారు.

విశాఖ రాజధాని కోసం గర్జించిన విద్యార్థి లోకం

- ప్రతిధ్వనించిన మన విశాఖ.. మన రాజధాని నినాదం
- శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో వికేంద్రీకరణకు మద్దతుగా జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



విశాఖలో పరిపాలన రాజధాని కావాలనే నినాదంతో టెక్కలిలో జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

టెక్కలి: శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో గురువారం 'మన విశాఖ.. మన రాజధాని' నినాదం మార్మోగింది. వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందని విద్యార్థిలోకం గళమెత్తింది. వికేంద్రీకరణకు మద్దతుగా ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ హనుమంతు లజపతిరాయ్, టెక్కలి నియోజకవర్గ కన్వీనర్ డి.ఎ.స్టాలిన్, విద్యార్థి, నిరుద్యోగ పోరాటసమితి నాయకుడు టి.సూర్యం నేతృత్వంలో విద్యార్థులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఉత్తరాంధ్రకు ఊపిరిపోసే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో పరిపాలన రాజధానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మన భావితరాల బంగారు భవిష్యత్ కోసం విశాఖ పరిపాలన రాజధాని కావాల్సిందేనన్నారు. ఈ విషయంలో వెనుకడుగు లేదని స్పష్టం చేశారు. జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ డి.ఎ.స్టాలిన్ మాట్లాడుతూ మన భవిష్యత్ కోసం చేస్తున్న ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖలో పరిపాలన రాజధానితో ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

ప్రాణత్యాగానికైనా సిద్ధం

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖలో పరిపాలన రాజధాని కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. భావిపౌరుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన గొప్ప ఆలోచనకు ఉత్తరాంధ్ర ప్రజలు మద్దతుగా ఉన్నారని తెలిపారు. సీఎం ఇప్పటికే భావనపాడు పోర్టుకు శ్రీకారం చుట్టారని, దీనిద్వారా కొద్దిరోజుల్లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ హనుమంతు ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులతోపాటు అన్ని వర్గాల ప్రజలమంతా ఐక్యంగా పోరాడి విశాఖలో పాలన రాజధాని సాధించుకుందామని చెప్పారు. విద్యార్థి, నిరుద్యోగ పోరాటసమితి నేత టి.సూర్యం మాట్లాడుతూ విశాఖలోనే రాజధాని ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పాత జాతీయ రహదారి మీదుగా వైఎస్సార్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు విద్యార్థులు ర్యాలీ చేశారు. వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాల వద్ద జేఏసీ నాయకులు నివాళులు అర్పించారు.

ఓట్ల కోసం రాజకీయం చేయట్లేదు

- ప్రజల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలు
- గత ప్రభుత్వం ఉద్యోగులను వాడుకుని వదిలేసింది
- ఉద్యోగ సంఘాల భేటీలో మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల



మాట్లాడుతున్న మంత్రి బొత్స. చిత్రంలో సజ్జల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓట్ల కోసం రాజకీయాలు చేయట్లేదని.. సమాజంలోని అంతరాలను తగ్గించి.. అట్టడుగు వర్గాలను పైకి తీసుకొచ్చేందుకు సీఎం జగన్ కృషిచేస్తున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పేదలకు విద్య, వైద్యం, ఆరోగ్య కల్పన కోసమే అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామనే విషయాన్ని ఉద్యోగులు గుర్తించాలన్నారు. ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డికి సచివాలయంలో కేటాయించిన చాంబర్‌ను మంత్రి గురువారం ప్రారంభించారు. అనంతరం మరో సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డితో కలిసి ఉద్యోగ సంఘాల నాయకులతో వారు భేటీ అయ్యారు. ఆ తర్వాత ఇద్దరూ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు 4.70 కోట్ల మంది ప్రజల సంక్షేమ బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజా ప్రయోజనాలను కాపాడటంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. అటువంటి ఉద్యోగుల కోరికలు, ఆకాంక్షలను తాము ఎప్పుడూ గౌరవిస్తామన్నారు. కానీ, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు. తెలంగాణ కంటే తీసిపోని విధంగా ఉద్యోగులకు మేలు చేస్తున్నామని, అందుకే సీఎం జగన్ ప్రభుత్వం-ఉద్యోగుల మధ్య సంధానకర్తగా ప్రత్యేక సలహాదారును నియమించినట్లు వివరించారు. ఇటీవల ఎంఈవో పోస్టుల భర్తీ విషయంలో ఒకరిద్దరు కోర్టులకు వెళ్లడంతో మొత్తం ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచామన్నారు. త్వరలోనే వర్సిటీలు, ఎయిడెడ్ ఉద్యోగులకు కూడా ఇది వర్తించేలా ఉత్తర్వులు వస్తాయన్నారు. పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకూ రిటైర్మెంట్ వయసును పెంచే అంశం పరిశీలనలో ఉందన్నారు. త్వరలోనే సుప్రీం కోర్టు నిబంధనలకు లోబడి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్నారు.

చంద్రబాబుకు చివరి ఎన్నికలు

మరోవైపు.. చంద్రబాబుకి ఇవే చివరి ఎన్నికలని, ఆయన అనుకున్నట్లే దేవుడు తథాస్తు అంటాడని మంత్రి బొత్స ఎద్దేవా చేశారు. ప్రజలు కూడా ఇంటికి పంపించేలా తీర్పు ఇస్తారన్నారు. బాబు అధికారంలో ఉంటే అరిష్టం చుట్టుకోవడంతో పాటు అతివృష్టి, అనావృష్టి ఆవరిస్తుందన్నారు. అసెంబ్లీలో ఆయన కుటుంబ సభ్యుల ప్రస్తావన తేకున్నా.. సానుభూతి కోసం డ్రామాలాడటం నీచమని మంత్రి మండిపడ్డారు.

ఉద్యోగులతో రాజకీయాలు చేయం: సజ్జల

ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల మధ్య గత ప్రభుత్వం విభేదాలు సృష్టించి వాడుకుని వదిలేసిందని సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. కానీ, తమకు ఉద్యోగులతో రాజకీయాలు చేయాల్సిన అవసరంలేదన్నారు. సీఎం టీంలో ఉద్యోగులు ఒక భాగమన్నారు. అన్ని సంఘాలను సమానంగా చూస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఆర్థిక పరిస్థితులను బట్టి ఉద్యోగులకు వీలైనంత మేలుచేసేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. త్వరలోనే ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. చంద్రబాబుకు 2019లోనే చివరి ఎన్నికలయ్యాయని, అప్పుడే ప్రజలు తిరస్కరించారని సజ్జల అన్నారు. ప్రజలిచ్చిన అవకాశాలను ఆయన ఎప్పుడూ సద్వినియోగం చేసుకోలేదన్నారు. ఇప్పుడు దింపుడు కళ్లెం ఆశలా చేస్తున్న ప్రయత్నంలోనూ దిగజారుడుతనం చూపిస్తున్నాడన్నారు. ఈసారి ఎన్నికల్లో 23 సీట్లనూ తీసేసేలా ప్రజలు స్థిర నిశ్చయంతో ఉన్నారన్నారు. తనను అధికారంలో కూర్చోబెట్టడం ప్రజల బాధ్యత అన్నట్లు హెచ్చరిక మాటలు బాబు దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు బండి శ్రీనివాసరావు, బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యోగుల సమస్యలను విన్నవించారు.

డిసెంబర్ 17న ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశం

- ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి
- త్వరలోనే ఇథియోపియాలోనూ ఏయూ పూర్వ విద్యార్థుల సంఘ కార్యాలయం
- వివరాలు వెల్లడించిన వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల వార్షిక సమావేశం డిసెంబర్ 17వ తేదీన నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఏయూ సెనేట్ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి, ప్రత్యేక అతిథిగా అవంతి ఫీడ్స్ లిమిటెడ్ సీఎండీ ఎ.ఇంద్ర కుమార్ హాజరవుతారని చెప్పారు. పూర్వవిద్యార్థుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జీఎంఆర్ సంస్థల అధినేత జీఎం రావు(జీఎంఆర్) అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. దేశం గర్వించే సంస్థ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి డిసెంబర్ 17న ఏయూలోని ఇంక్యుబేషన్ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఫార్మసీ విభాగం, అమెరికన్ కార్నర్ వంటివి సందర్శిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరవుతారని తెలిపారు. ఇటీవల విశాఖలో ఇన్ఫోసిస్ సంస్థ సేవలు ప్రారంభించిందని, యువతకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న నారాయణమూర్తి ఏయూకు అతిథిగా రావడం శుభపరిణామమన్నారు. త్వరలో ఇథియోపియాలోనూ ఏయూ పూర్వవిద్యార్థుల సంఘ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది వ్యవస్థాపక ఉత్సవ సమారోహన కార్యక్రమాలను 2023, ఏప్రిల్ 26 నుంచి ఘనంగా ప్రారంభిస్తామని, శతాబ్ది ఉత్సవాలు 2025, ఏప్రిల్ 26వ తేదీన ప్రారంభమవుతాయని వివరించారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘ కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పూర్వవిద్యార్థుల సంఘ చైర్మన్ ఆచార్య బీల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎ.మన్మోహన్, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య బి.మోహన వెంకటరామ్, సంయుక్త కార్యదర్శి కుమార్ రాజా పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.